www.prajanaava.in

Telugu Daily

ప్రజానావ

ప్రతి అక్షరం జనం కోసం..

పేజీలు : 08 | వెల రూ.5.00

Published from: Hyderabad, Rangareddy, Karimnagar Circulated to: Warangal, Khammam, Nalgonda, Mahabubnagar, Nizamabad

హైదరాబాద్ | సంపుటి 01 | సంచిక: 190 | శనివారం | 4 జులై, 2026

ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
తెలుగు రాష్ట్రాల్లో శరవేగంగా అభివృద్ధి చెందుతున్న
ప్రజానావ దినపత్రికలో అతి తక్కువ ధరకే ప్రకటనలివ్వండి!
వివరాలకు ఈ క్రింది ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు.
✆ : 99484 33277 / 9014966169

బీఆర్ఎస్ అప్పులు అక్షరాలా..

రూ.8,21,651 కోట్లు

అనేక సంస్థలకు వేల కోట్ల బకాయిలు పెట్టారు

- చేసిన తప్పులను కప్పిపుచ్చుకునేందుకే డ్రామాలు
- నాటి అప్పులు, తప్పులపై కేసీఆర్ స్పందించాలి
- హరీశ్‌రావు అబద్ధాలను కట్టిపెడితే మంచిది
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

ప్రజానావ, హైదరాబాద్: గత బీఆర్ఎస్ ప్రభుత్వ పదేళ్ల పాలనలో రాష్ట్రంపై అక్షరాలా రూ. 8,21,651 కోట్ల అప్పులు, బకాయిల భారాన్ని మోపారని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తీవ్రంగా విమర్శించారు. ఆర్థిక వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు ప్రతిపక్షాలు తప్పుడు ప్రచారం, అసత్య ఆరోపణలు చేస్తున్నాయని ఆయన మండిపడ్డారు. సచివాలయంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌తో కలిసి మీడియాతో మాట్లాడిన భట్టి విక్రమార్క, రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై స్పష్టమైన లెక్కలు వెల్లడించారు. గత ప్రభుత్వ హయాంలో భారీ స్థాయిలో అప్పులు తీసుకురావడంతో పాటు అనేక సంస్థలకు వేల కోట్ల రూపాయల బకాయిలు మిగిల్చారని ఆరోపించారు. ఈ అప్పుల భారాన్ని ప్రస్తుత ప్రభుత్వం క్రమబద్ధీకరిస్తూ ముందుకు సాగుతోందని తెలిపారు. రెసిడెన్షియల్ పాఠ శాలల్లో విద్యార్థులకు కనీస సౌకర్యాలు కల్పించడంలో గత ప్రభుత్వం విఫలమైందని, ప్రస్తుత ప్రభుత్వం విద్యా సంస్థల వసతుల మెరుగుదలకు పెద్దపీట వేస్తోందని పేర్కొన్నారు. అలాగే సింగరేణి సంస్థపై జరుగుతున్న తప్పుడు ప్రచారాలను ఖండించిన ఆయన, గత ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగానే సంస్థ నష్టాల్లోకి వెళ్లిందని ఆరోపించారు. సింగరేణిలో జరిగిన అక్రమాలపై విజిలెన్స్ విచారణకు ఆదేశించామన్నారు.

దమ్ముంటే చర్చకు రావాలి

బీఆర్ఎస్ నేతలు సోషల్ మీడియా వేదికగా అసత్య ప్రచారం చేస్తున్నారని విమర్శించిన భట్టి విక్రమార్క, దమ్ముంటే బహిరంగ చర్చకు రావాలని మాజీ సీఎం కేసీఆర్‌కు సవాల్ విసిరారు. హరీశ్‌రావు పదేపదే అబద్ధాలు చెబుతున్నారని ఆరోపిస్తూ, ప్రజలను వాస్తవాలు తెలుసుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. గత ప్రభుత్వ హయాం లో రాష్ట్రంపై వేసిన అప్పుల భారాన్ని ఎవరు చెల్లిస్తారని ప్రశ్నించిన ఆయన, తమ ప్రభుత్వం ఇప్పటివరకు రూ. 2.08 లక్షల కోట్ల మేర అప్పులు చెల్లించినట్లు తెలిపారు. వడ్డీ భారాన్ని తగ్గించే చర్యలు తీసుకున్నామని చెప్పారు.

బీఆర్ఎస్ అప్పులపై చర్చకు సిద్ధం

నా లెక్కలు తప్పని నిరూపిస్తే రాజీనామాకు సిద్ధం

కాళేశ్వరం కార్పొరేషన్ రుణాలపై ప్రశ్నలకు ఎందుకు సమాధానమివ్వడం లేదు

- పదవులు కాదు.. ఆత్మగౌరవమే ముఖ్యమని వ్యాఖ్య
- మంత్రి జూపల్లి కృష్ణారావు

ప్రజానావ, హైదరాబాద్: బీఆర్ఎస్ హయాంలో జరిగిన అప్పులపై తాను చేసిన వ్యాఖ్యలకు, అలాగే రాజీనామా సవాల్‌కు ఇప్పటికీ కట్టుబడి ఉన్నానని మంత్రి జూపల్లి కృష్ణారావు స్పష్టం చేశారు. తన లెక్కలు తప్పని కేసీఆర్ స్వయంగా మీడియా ముందుకు వచ్చి వివరించాలని ఆయన డిమాండ్ చేశారు. తన లెక్కలు తప్పని నిరూపిస్తే మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌తో పాటు కేటీఆర్, హరీశ్‌రావులు తమ ఎమ్మెల్యే పదవులకు రాజీనామా చేస్తారా? లేదా బీఆర్ఎస్ పార్టీని రద్దు చేస్తారా? ఏం చేస్తారో లిఖితపూర్వకంగా ప్రకటించాలని జూపల్లి సవాల్ విసిరారు. శుక్రవారం ఆయన అసెంబ్లీ ఆవరణలోని సీఎల్పీ మీడియా హాల్‌లో, అనంతరం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌తో కలిసి మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు తనకు రాసిన లేఖపై స్పందిస్తూ, అందులో బీఆర్ఎస్ హయాంలో చేసిన అప్పులు, బకాయిలపై స్పష్టమైన సమాధానం ఇవ్వలేదని విమర్శించారు. తాను ఉదయం వాట్సాప్, పోస్టు ద్వారా కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావులకు అప్పుల వివరాలు పంపించానని, సాయంత్రం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో తరువాయి 2లో..

అప్పులపై తప్పుడు ప్రచారం

బీఆర్ఎస్ హయాంలో రూ.4.17 లక్షల కోట్ల రుణాలే తీసుకున్నాం

- మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు
- ఆధారాలతో మంత్రి జూపల్లికి బహిరంగ లేఖ
- అసెంబ్లీ వీడియోలు, ఆర్‌బీఐ గణాంకాలు పంపినట్లు వెల్లడి

ప్రజానావ, హైదరాబాద్: బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అప్పులపై కాంగ్రెస్ ప్రభుత్వం తప్పుడు ప్రచారం చేస్తోందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆరోపించారు. ఈ మేరకు ఆయన మంత్రి జూపల్లి కృష్ణారావుకు బహిరంగ లేఖ రాశారు. తొమ్మిదిన్నరేళ్ల బీఆర్ఎస్ పాలనలో తీసుకున్న రుణాలు, ప్రభుత్వ హామీలపై తీసుకున్న రుణాలు కలిపి మొత్తం రూ.4.17 లక్షల కోట్లేనని అసెంబ్లీ లో తాము స్పష్టంగా వివరించామని హరీశ్‌రావు పేర్కొన్నారు. ఆ లెక్కలపై ఎప్పుడైనా చర్చకు సిద్ధమని అప్పుడే ప్రకటించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం 2023 డిసెంబర్ నుంచి 2026 జూన్ వరకు రూ.1,77,058 కోట్ల అప్పులు చేసినట్లు మంత్రి జూపల్లి తన లేఖలో పేర్కొన్నారని హరీశ్‌రావు తెలిపారు. అయితే రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గణాంకాల ప్రకారం 2026 జూన్ 30 నాటికి రాష్ట్ర అప్పు రూ.1,86,067 కోట్లుగా ఉన్నట్లు ఆయన వెల్లడించారు. ఇక 2026 మార్చి 18న అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్వయంగా ఎఫ్ఆర్‌బీఎం సహా మొత్తం రుణాలు రూ.3,47,294 కోట్లుగా ప్రకటించిన విషయాన్ని కూడా హరీశ్‌రావు లేఖలో ప్రస్తావించారు. బీఆర్ఎస్ లెక్కలు మారడం లేదని, కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం సందర్భానుసారంగా అప్పుల గణాంకాలను మార్చి చూపుతోందని ఆయన విమర్శించారు.

వాస్తవాలు నిర్ధారించుకోవాలి

తమ అంచనాల ప్రకారం ప్రస్తుత ప్రభుత్వం వివిధ మార్గాల ద్వారా సుమారు రూ.4.5 లక్షల కోట్ల వరకు అప్పులు చేసిందని ఆయన ఆరోపించారు. ఈ అంశానికి సంబంధించిన అసెంబ్లీ ప్రసంగాల వీడియోలు, ముఖ్యమంత్రి ప్రకటనలు, ఆర్‌బీఐ అధికారిక గణాంకాలను మంత్రి జూపల్లి కృష్ణారావుకు పంపినట్లు హరీశ్‌రావు తెలిపారు. వాటిని పరిశీలించి వాస్తవాలను నిర్ధారించుకోవాలని ఆయన కోరారు. ఇకనైనా అప్పుల అంశంపై తప్పుడు ప్రచారం మానుకోవాలని కాంగ్రెస్ ప్రభుత్వానికి హరీశ్‌రావు సూచించారు.

ముఖ్యమంత్రిదో మాట.. మంత్రిదో మాట!

తెలంగాణ ఏర్పడిన తరువాత రాష్ట్రంలో చేసిన అప్పు రూ. 1,77,058 కోట్లు అని మంత్రి జూపల్లి కృష్ణారావు నాకు లేఖ రాశారు. కానీ రేవంత్ రెడ్డి నాలుగు నెలల క్రితం అసెంబ్లీలో కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన అప్పు రూ.3,45,294 కోట్లు అని చెప్పాడు. నాలుగు నెల కిందనే నిండు అసెంబ్లీలో తరువాయి 2లో..

భారత్ వృద్ధికి మధ్యతరగతే చోదకశక్తి

- దేశ వినియోగంలో 93 శాతం వాటా వారిదే
- త్వరలో కొత్త ఆర్థిక కేంద్రాలుగా 500 నగరాలు
- 2035 నాటికి మధ్యతరగతి జనాభాలో చైనాను అధిగమించే అవకాశం: నిర్మలా సీతారామన్

న్యూఢిల్లీ: భారత్ ఆర్థికాభివృద్ధికి మధ్యతరగతే ప్రధాన చోదకశక్తిగా మారిందని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో దేశంలోని దాదాపు 500 నగరాలు కొత్త ఆర్థిక కార్యకలాపాల కేంద్రాలుగా రూపుదిద్దుకోనున్నాయని ఆమె వెల్లడించారు. ఫ్రాన్స్‌లోని ఐక్స్-ఆన్-ప్రోవెన్స్‌లో జరిగిన అంతర్జాతీయ ఆర్థిక సదస్సులో 'కొత్త మధ్యతరగతి అభివృద్ధి' అంశంపై మాట్లాడిన ఆమె, ప్రస్తుతం భారత జనాభాలో 31 శాతం మంది మధ్యతరగతికి చెందిన వారని చెప్పారు. ఆర్థిక సంస్కరణలు ప్రారంభమైనప్పటి నుంచి దేశంలో మధ్యతరగతి ఏటా సగటున 6.3 శాతం వృద్ధి చెందుతోందని సీతారామన్ తెలిపారు. దేశ మొత్తం వినియోగ వ్యయంలో దాదాపు 93 శాతం మధ్యతరగతి, ఎగువ మధ్యతరగతి వినియోగదారుల నుంచే వస్తోందని పేర్కొన్నారు. ఈ వర్గం మెట్రో నగరాలకే పరిమితం కాకుండా టియర్-2, టియర్-3 నగరాలకు విస్తరించడంతో సంపద పంపిణీ సమతుల్యంగా జరుగుతోందని వివరించారు. మధ్యతరగతి కేవలం అభివృద్ధి ఫలాలను అనుభవించే వర్గం మాత్రమే కాకుండా దేశ ఆర్థిక వృద్ధిని ముందుకు నడిపించే శక్తిగా నిలుస్తోందని అన్నారు.

2035 నాటికి చైనాకు మించి..

ఓఈసీడీ అధ్యయనం ప్రకారం 2030–2035 మధ్యకాలంలో మధ్యతరగతి జనాభా పరంగా భారత్ చైనాను అధిగమించే అవకాశాలు ఉన్నాయని సీతారామన్ తెలిపారు. కోవిడ్ అనంతరం ప్రపంచంలోనే వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థగా భారత్ నిలవడానికి మధ్యతరగతి వినియోగమే ప్రధాన కారణమని పేర్కొన్నారు. మధ్యతరగతి విస్తరణ కోసం ఆర్థిక సమ్మిళితం, జీఎస్టీ రేట్ల హేతుబద్ధీకరణ, తాకట్టు లేని రుణాలు, ప్రధానమంత్రి ఆవాస్ యోజన వంటి కార్యక్రమాలను ప్రభుత్వం అమలు చేస్తోందని వివరించారు.

ఏఐతో కొత్త అవకాశాలు

కృత్రిమ మేధ (ఏఐ) ప్రభావంతో ఉద్యోగాలపై ఆందోళనలు ఉన్నప్పటికీ, అదే సమయంలో కొత్త అవకాశాలు కూడా సృష్టిస్తున్నాయని సీతారామన్ అన్నారు. యువతకు ఏఐ ఆధారిత నైపుణ్యాలను అందించేందుకు ప్రభుత్వం తరువాయి 2లో..

మూడు దేశాల పర్యటనకు ప్రధాని మోదీ

- ఈ నెల 6 నుంచి 11 వరకు ఇండోనేషియా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్‌లో కీలక ద్వైపాక్షిక చర్చలు
- రక్షణ, వాణిజ్యం, సముద్ర భద్రత, పెట్టుబడులపై దృష్టి
- నాలుగు దశాబ్దాల తర్వాత న్యూజిలాండ్‌లో పర్యటించనున్న భారత ప్రధాని

5

యువత ఆశలపై నీళ్లు చల్లొద్దు

- కానిస్టేబుల్ ఉద్యోగాల భర్తీపై వెంటనే చర్యలు తీసుకోవాలి
- సీఎం రేవంత్ రెడ్డికి కేటీఆర్ బహిరంగ లేఖ
- కాంగ్రెస్ ప్రభుత్వం హామీలను విస్మరించిందని ఆగ్రహం

ప్రజానావ, హైదరాబాద్: రాష్ట్రంలో పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగార్థుల సమస్యలను పరిష్కరించాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి బహిరంగ లేఖ రాశారు. నిరుద్యోగ యువత ఆశలపై నీళ్లు చల్లవద్దని ఆయన ఆ లేఖలో విజ్ఞప్తి చేశారు. పోలీస్ ఉద్యోగాలకు పోటీ పడుతున్న వారిలో ఎక్కువ మంది పేద, మధ్యతరగతి, గ్రామీణ వర్గాల యువతేనని కేటీఆర్ పేర్కొన్నారు. రేయింబవళ్లు కష్టపడి సన్నద్ధమవుతున్న నిరుద్యోగులకు న్యాయం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని తెలిపారు. నీళ్లు.. నిధులు.. నియామకాలు అన్నది తెలంగాణ ఉద్యమ నినాదమని గుర్తుచేసిన కేటీఆర్, నియామకాల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేస్తోందని ఆరోపించారు. రాష్ట్రంలో 17 వేల పోస్టులు ఖాళీగా ఉన్నాయని ప్రభుత్వమే చెప్పినప్పటికీ ఇప్పటివరకు వాటి భర్తీ జరగలేదని విమర్శించారు. బీఆర్ఎస్ హయాంలో ఎలాంటి హామీలు లేకుండానే 47 వేల పోలీస్ ఉద్యోగాలు భర్తీ చేశామని, అలాగే 2,32,000 ప్రభుత్వ ఉద్యోగాలకు నోటిఫికేషన్లు జారీ చేసి 1,60,000కు పైగా ఉద్యోగాలు భర్తీ చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రభుత్వం యువతకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని కేటీఆర్ ఆరోపించారు. అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు గడిచినా ఉద్యోగాల భర్తీ ఆశించిన స్థాయిలో జరగలేదని విమర్శించారు. వచ్చిన సంవత్సరంలోనే రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేస్తామని ప్రకటించిన కాంగ్రెస్ ప్రభుత్వం దానిని అమలు చేయలేదని ఆయన పేర్కొన్నారు. ఇప్పటివరకు కేవలం 17 వేల ఉద్యోగాలే భర్తీ చేసినట్లు కేటీఆర్ అన్నారు. యువతలో ప్రభుత్వంపై తీవ్ర అసంతృప్తి నెలకొన్నదని, ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని కేటీఆర్ తన లేఖలో డిమాండ్ చేశారు.

రాజకీయాల్లో ముదిరాజులకు ప్రాధాన్యత ఇవ్వాలి

- **ప్రగతి మత్స్య కార్మిక సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు శ్రీనివాస్**

ప్రజానావ, పెద్దపల్లి : రాజకీయాల్లో ముదిరాజ్ సామాజిక వర్గానికి తగిన ప్రాధాన్యత దక్కడం లేదని, జనాభా ప్రాతిపదికన గుర్తింపు లభించక పోతే కచ్చితంగా తమ గళాన్ని వినిపిస్తామని, అవసరమైతే ప్రతిఘటిస్తామని ప్రగతి మత్స్య కార్మిక సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షులు ఉస్తేం శ్రీనివాస్ ముదిరాజ్ హెచ్చరించారు. శుక్రవారం పెద్దపల్లి ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన ప్రగతి మత్స్య కార్మిక సేవా సమితిని మరింత బలోపేతం చేసేందుకు నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. జిల్లా ఉపాధ్యక్షులుగా కలవేన రవి ముదిరాజ్, జిల్లా మీడియా ఇంచార్జిగా కారుపాకల రాజేందర్ ముదిరాజ్, హుజురాబాద్ నియోజకవర్గ ఇంచార్జిగా జోడు సంపత్ ముదిరాజ్‌లను నియమి స్తూ ఉత్తర్వులు జారీ చేశారు. నూతన కార్యవర్గ సభ్యులు మత్స్యకారుల అభివృద్ధికి, వారి సమస్యల పరిష్కారానికి నిబద్ధతతో పనిచేయాలని ఆయన దిశానిర్దేశం చేశారు. అనంతరం రాజకీయ పరిస్థితు లపై శ్రీనివాస్ ముదిరాజ్ మాట్లాడుతూ గత ప్రభు త్వం ముదిరాజులకు అన్యాయం చేసిందని, అందు కే మార్పును ఆకాంక్షించి కాంగ్రెస్ ప్రభుత్వానికి మద్దతు ఇచ్చామని గుర్తు చేశారు. నేటి ప్రభుత్వంలో కూడా ముదిరాజులకు తగిన ప్రాధాన్యత లభించ డం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. నామినేటెడ్ పోస్టులు, రాజకీయ పదవులు మరియు టికెట్ల కేటా యింపులో కనీస గుర్తింపు కూడా దక్కడం లేదని ఆయన అసహనం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం ముదిరాజుల జనాభా ప్రాతిపదికను గుర్తించి, వారికి తగిన రాజకీయ ప్రాధాన్యత కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో క్రమశిక్షణ కమిటీ చైర్మన్ కారుపకాల రమేష్, సుగ్లాంపల్లి మాజీ సర్పంచ్ పసేడ్ల రవీందర్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరా మహిళా శక్తితో ఆర్థిక ప్రగతి

- **ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లతో ఎస్‌హెచ్‌జీ మహిళల ఉపాధికి మార్గం**
- **జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్**
- **తంగళ్ళపల్లిలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ప్రారంబం**

ప్రజానావ, సిరిసిల్ల : ఇందిరా మహిళా శక్తి యూనిట్లు మహిళా సంఘాల ఆర్థిక ప్రగతికి దోహదపడుతున్నాయని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు. ఇందిరా మహిళా శక్తి కింద తంగళ్ళపల్లి మండల కేంద్రంలో స్వయం సహాయక సంఘాల (ఎస్ హెచ్ జీ) మహిళలు వెంకటసాయి కోల్డ్ ప్రెస్ ఆయిల్ అండ్ ఫ్లోర్ మిల్ యూనిట్, కోవిదా మిల్క్ పాయింట్ ఏర్పాటు చేసుకోగా, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ శుక్రవారం ప్రారంభించారు. వాటి పని తీరు, ఉపాధి, ఆదాయం తదితర వివరాలను మహిళలను జిల్లా కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. ఇందిరా మహిళా శక్తి కింద రెండు యూనిట్లు ప్రారంభించామని తెలిపారు. ఒక యూనిట్లో కోల్డ్ ప్రెస్సింగ్ ఆయిల్, పిండి గిర్ని, ఇతర దాదాపు ఆరు యంత్రాలు ఏర్పాటు చేశారని తెలిపారు. దాదాపు రూ. 11 లక్షల 50 వేలతో యూనిట్ ప్రారంభించారని వివరించారు. దీనికి పీ ఎం ఎఫ్ ఎం ఈ కింద రూ . 3 లక్షల 50 వేల సబ్సిడీ అందుతుందని వెల్లడించారు. అలాగే మరో మహిళ డైరీ యూనిట్ ను ఏర్పాటు చేసుకున్నారని, దీనికి మహిళా సంఘాల నుంచి దాదాపు రూ.5 లక్షల రుణం ఇప్పించామని తెలిపారు. ఇక్కడ ఇతర డైరీ ఉత్పత్తులు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. జిల్లాలో ఇలాంటి మరిన్ని యూనిట్లు ఏర్పాటు చేసేందుకు మహిళలు ముందుకు రావాలని పిలుపు నిచ్చారు. యూనిట్లు ఏర్పాటు చేయడంతో ఉపాధితో పాటు మహిళా సాధికారతకు దోహదం చేస్తుందని వివరించారు. నిన్న బ్యాంకర్ల సమావేశంలో ఇదే విషయంపై చర్చించి.. మహిళా సంఘాలకు రుణాలు ఇవ్వాలని ఆదేశాలు జారీ చేశామని తెలిపారు. జిల్లాలోని గ్రామీణ మహిళా, పురుష అభ్యర్థులకు ఉచిత రెసిడెన్షియల్ శిక్షణ సిరిసిల్ల జిల్లా కేంద్రంలో ఆర్ సేథీ ఆద్వర్యంలో అందుబాటులో ఉందని వెల్లడించారు. శిక్షణను యువత సద్వినియోగం చేసుకోవాలని, ఆర్థికంగా రాణించేందుకు వినియోగించు కోవాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీఓ లక్ష్మీ నారాయణ, లీడ్ డిస్ట్రిక్ మేనేజర్ మల్లికార్జున రావు, ఏఎంసీ వైస్ చైర్మెన్ నర్సింగం, ఇంచార్జి తహసీల్దార్ మురళి, ఇంచార్జి ఎంపీడీఓ రమేష్, ఎంపీఓ మీర్జా, సర్పంచ్ లక్ష్మీరాజం, తదితరులు పాల్గొన్నారు.

తావీ రివర్‌ఫ్రంట్‌లో బోటింగ్‌కు శ్రీకారం

- **రూ.100కే 15 నిమిషాల విహారం**
- **ఆన్‌లైన్ బుకింగ్‌తో పాటు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు**
- **జమ్మూలో కొత్త పర్యాటక ఆకర్షణ**

జమ్మూ: జమ్మూలోని తావీ రివర్‌ఫ్రంట్‌లో బోటింగ్ సౌకర్యాన్ని శుక్రవారం ప్రారంభించారు. అమర్‌నాథ్ యాత్ర కొనసాగుతున్న నేపథ్యంలో యాత్రికులు, పర్యాటకులు, స్థానిక ప్రజలకు ఇది కొత్త వినోద ఆకర్షణగా నిలవనుంది. జమ్మూ స్మార్ట్ సిటీ లిమిటెడ్ సీఈఓ దేవాంశ్ యాదవ్ ఈ సేవలను ప్రారంభించారు. స్మార్ట్ సిటీస్ మిషన్‌లో భాగంగా అభివృద్ధి చేసిన ఈ కేంద్రంలో పెడల్ బోట్లు, రాఫ్టులు, మోటార్ బోట్లు, శికారాలు అందుబాటులో ఉంటాయి. ప్రతిరోజూ ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకు సేవలు కొనసాగుతాయి. ఒక్కో వ్యక్తికి 15 నిమిషాల బోటింగ్‌కు రూ.100గా ఛార్జీ నిర్ణయించారు. పవిత్ర అమర్‌నాథ్ గుహకు ప్రవేశ ద్వారమైన జమ్మూకు ప్రతి ఏడాది లక్షలాది మంది యాత్రికులు వస్తారని, వారి బసను మరింత ఆహ్లాదకరంగా మార్చడంతో పాటు నగరంలో పర్యాటకాన్ని ప్రోత్సహించేందుకు ఈ బోటింగ్ సౌకర్యాన్ని అందుబాటులోకి తీసుకొచ్చామని దేవాంశ్ యాదవ్ తెలిపారు. యాత్రికుల సౌకర్యార్థం ఆన్‌లైన్ బుకింగ్ విధానాన్ని కూడా ప్రవేశపెట్టారు. ప్రతి ప్రయాణికుడికి లైఫ్ జాకెట్ తప్పనిసరి చేయడంతో పాటు శిక్షణ పొందిన బోటు నిర్వాహకులు, రెస్క్యూ సిబ్బంది, అత్యవసర స్పందన వ్యవస్థలను ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. స్మార్ట్ సిటీస్ మిషన్‌లో భాగంగా తావీ రివర్‌ఫ్రంట్‌ను వాకింగ్, సైక్లింగ్ ట్రాక్‌లు, మ్యూజికల్ ఫౌంటెన్లు, ఇతర ప్రజా సౌకర్యాలతో ఆధునికంగా అభివృద్ధి చేశారు.

పంజాబ్‌లో శాంతిభద్రతలపై ఆందోళన

- **కేంద్ర హోం మంత్రి అమిత్ షాను కలిసిన రంధావా**
- **సరిహద్దు రాష్ట్రంలో గ్యాంగ్‌స్టర్ల ఆగడాలు, మాదకద్రవ్య ఉగ్రవాదంపై కేంద్ర దృష్టి సారించాలని విజ్ఞప్తి**
- **కాంగ్రెస్‌లో అంతర్గత అసంతృప్తి మధ్య రాజకీయ ప్రాధాన్యం సంతరించుకున్న భేటీ**

న్యూఢిల్లీ: పంజాబ్ కాంగ్రెస్‌లో పదవుల పునర్వ్యవస్థీకరణ అనంతరం అసంతృప్తి కొనసాగుతున్న వేళ ఆ పార్టీ సీనియర్ నేత, మాజీ ఉప ముఖ్యమంత్రి సుఖ్‌జిందర్ సింగ్ రంధావా శుక్రవారం కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా పంజాబ్‌లో శాంతిభద్రతలు క్షీణిస్తున్నాయని, ముఖ్యంగా సరిహద్దు జిల్లాల్లో గ్యాంగ్‌స్టర్ల కార్యకలాపాలు, వసూళ్లు, పాకిస్థాన్ ప్రేరేపిత మాదకద్రవ్య ఉగ్రవాదం పెరుగుతున్న అంశాలను ఆయన ప్రస్తావించారు. దాదాపు నెల క్రితమే ఇదే విషయాలపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి లేఖ రాసినట్లు రంధావా తెలిపారు. గుర్దాస్‌పూర్, అమృత్‌సర్, పఠాన్‌కోట్ వంటి సరిహద్దు జిల్లాల్లో పరిస్థితి ఆందోళనకరంగా మారిందని, కేంద్ర నిఘా సంస్థలు, భద్రతా యంత్రాంగం మరింత అప్రమత్తంగా వ్యవహరించాలని కోరినట్లు చెప్పారు. ఈ భేటీకి రాజకీయ ప్రాధాన్యం ఇవ్వడం సరికాదని రంధావా స్పష్టం చేశారు. శాంతిభద్రతల అంశంపై తాను ముందుగానే సమయం తీసుకుని హోంమంత్రిని కలిశానని, దీనిని రాజకీయ కోణంలో చూడొద్దని సోషల్ మీడియాలో కూడా వెల్లడించారు. ఇదిలా ఉండగా, రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడిగా అమరీందర్ సింగ్ రాజా వారింగ్‌ను కొనసాగించాలని పార్టీ అధిష్ఠానం నిర్ణయించడంతో పంజాబ్ కాంగ్రెస్‌లో అసంతృప్తి వ్యక్తమవుతోంది. మాజీ ముఖ్యమంత్రి చరణ్‌జిత్ సింగ్ చన్నీకి ఆ బాధ్యత అప్పగించాలని పలువురు మాజీ ఎమ్మెల్యేలు డిమాండ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో చన్నీ నివాసానికి పలువురు పార్టీ నేతలు వెళ్లి సంఘీభావం తెలిపారు. రంధావాకు మాజీ రాజస్థాన్ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లోత్, రాజస్థాన్ పీసీసీ అధ్యక్షుడు గోవింద్ దోతాస్రా మద్దతు తెలిపారు. జాతీయ భద్రతకు సంబంధించిన అంశంపై కేంద్ర హోంమంత్రిని కలవడాన్ని రాజకీయ కోణంలో చూడడం సరికాదని వారు పేర్కొన్నారు.

భూ సమస్యల పరిష్కారమే లక్ష్యం

- **అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి**
- **శాఖల సమన్వయంపై కలెక్టర్ దివాకర్ టీఎస్ ఆదేశాలు**

ప్రజానావ, ఖమ్మం: ప్రజలకు సంబంధించిన భూ సమస్యలను పారదర్శకంగా, త్వరితగతిన పరిష్కరించడంతో పాటు జిల్లాలో అభివృద్ధి పనులను వేగవంతం చేయడమే జిల్లా యంత్రాంగం ప్రధాన లక్ష్యమని జిల్లా కలెక్టర్ దివాకర్ టీఎస్ స్పష్టం చేశారు. ఇందు కోసం అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు సమన్వయంతో, బాధ్యతాయుతంగా పనిచేయాలని ఆయన ఆదేశించారు. శుక్రవారం కల్లూరు సబ్ కలెక్టర్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి, సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్తో కలిసి రెవెన్యూ డివిజన్ పరిధిలోని భూసేకరణ, రీ సర్వే, ప్రభుత్వ భూముల పరిరక్షణ, మౌలిక వసతుల అభివృద్ధిపై సమగ్ర సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కల్లూరు మండలం చెన్నూరులో నిర్మిస్తున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ అప్రోచ్ రోడ్డు కోసం సర్వే రికార్డులు అందిన వెంటనే భూసేకరణ ప్రక్రియ ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. కల్లూరు పట్టణంలో నాన్‌వెజ్ మార్కెట్ ఏర్పాటుకు ఇరిగేషన్ శాఖ నుంచి ఎన్‌ఓసీ అందిన వెంటనే ప్రభుత్వ భూమి కేటాయింపు చర్యలు చేపట్టాలని సూచించారు. తల్లాడ మండలంలో నిరుపయోగంగా ఉన్న ఎన్‌ఎస్‌పీ భూములను ప్రజా ప్రయోజనాల కోసం వినియోగించాలని, అలాగే అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ ఏర్పాటుకు అవసరమైన స్థలాన్ని గుర్తించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. నీలాద్రి అర్బన్ పార్క్ విస్తరణకు సంబంధించి ఉన్న సరిహద్దు వివాదాలను సింగరేణి సంస్థ త్వరగా పరిష్కరించాలని స్పష్టం చేశారు. పేరువంచ ప్రభుత్వ పాఠశాల భవనాల పునర్నిర్మాణానికి డిజైన్లు సిద్ధమయ్యాయని, నిధులు మంజూరైన వెంటనే పనులు ప్రారంభమవుతాయని తెలిపారు. బేతుపల్లి రీ సర్వేలో ప్రభుత్వ భూముల సరిహద్దుల నిర్ధారణ పూర్తయిందని, అటవీ–రెవెన్యూ భూముల వివాదాల పరిష్కారానికి సంయుక్త సర్వేలు వేగంగా కొనసాగుతున్నాయని వివరించారు. ప్రభుత్వ భూముల పరిరక్షణ విషయంలో అధికారులు అలసత్వం ప్రదర్శించకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని హెచ్చరించారు. ఈ సమీక్ష సమావేశంలో సత్తుపల్లి, తల్లాడ, వేంసూరు, పెనుబల్లి, కల్లూరు తహసీల్దార్లు, సర్వేయర్లు, రెవెన్యూ, ఇరిగేషన్, సింగరేణి తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

దేశ ఎన్నికల ప్రజాస్వామ్యానికి ముప్పు

- **మోదీ-షా ప్రభుత్వంపై కాంగ్రెస్ తీవ్ర విమర్శలు**
- **సుప్రీంకోర్టుకు ప్రతిపక్షాల విజ్ఞప్తి**
- **ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియను నిలిపివేయాలని డిమాండ్**

న్యూఢిల్లీ: దేశ ఎన్నికల ప్రజాస్వామ్యం తీవ్ర ముప్పును ఎదుర్కొంటోందని కాంగ్రెస్ ఆరోపించింది. ఎన్నికల ప్రక్రియ సమగ్రత, విశ్వసనీయతను కాపాడేందుకు సుప్రీంకోర్టు అత్యవసరంగా జోక్యం చేసుకోవాలని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ కోరారు. 23 ప్రతిపక్ష పార్టీలు, ఒక స్వతంత్ర ఎంపీ కలిసి సీజేఐకి లేఖ రాస్తూ ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశాయి. ఎన్నికల సంఘం పనితీరులో పారదర్శకత లోపించిందని, మార్గదర్శకాల మార్పులతో అధికారుల్లో అయోమయం నెలకొందని పేర్కొన్నాయి. అలాగే సీబీఐ, ఈడీ, ఎన్ఐఏ వంటి దర్యాప్తు సంస్థలను ప్రతిపక్షాలపై మాత్రమే వినియోగిస్తున్నారని ఆరోపించాయి. ఎన్నికల ప్రక్రియపై ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టేందుకు సుప్రీంకోర్టు తక్షణ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశాయి.

భారత్–ఫ్రాన్స్ ఆర్థిక బంధాలకు మరింత బలం

- **కీలక ఖనిజాలు, పెట్టుబడులపై కొత్త కార్యాచరణ**
- **హైస్పీడ్ రైలు, ఆర్థిక అనుసంధానం, క్రిటికల్ మినరల్స్‌పై దృష్టి**
- **2027లో తదుపరి ఈఎఫ్‌డీ నిర్వహణకు సూత్రప్రాయ నిర్ణయం**

న్యూఢిల్లీ: భారత్, ఫ్రాన్స్ మధ్య ఆర్థిక, వాణిజ్య భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసే దిశగా కీలక ఖనిజాలు (క్రిటికల్ మినరల్స్), పరస్పర పెట్టుబడులు, ఆర్థిక అనుసంధానం వంటి వ్యూహాత్మక రంగాల్లో సహకారాన్ని విస్తరించాలని ఇరు దేశాలు నిర్ణయించాయి. ఫ్రాన్స్‌లోని ఐక్స్–ఆన్–ప్రోవెన్స్‌లో జరిగిన భారత్–ఫ్రాన్స్ ఆర్థిక, విత్త సంభాషణ (ఎకనామిక్ అండ్ ఫైనాన్షియల్ డైలాగ్–ఈఎఫ్‌డీ)లో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, ఫ్రాన్స్ ఆర్థిక మంత్రి రోలాండ్ లెస్క్యూర్ ఈ అంశాలపై విస్తృతంగా చర్చించారు. భారత్–ఫ్రాన్స్ ప్రత్యేక వ్యూహాత్మక భాగస్వామ్యం వేగంగా విస్తరిస్తున్న నేపథ్యంలో అంతర్జాతీయ ఆర్థిక పరిస్థితులు, ద్వైపాక్షిక సహకారం, ఫలితాలపై దృష్టి సారించిన కార్యాచరణ కు ప్రాధాన్యం ఇవ్వాలని ఇరు దేశాలు అభిప్రాయపడ్డాయి. ప్రపంచ ఆర్థిక పరిణామాలతో పాటు జీ20, పారిస్ క్లబ్ వంటి బహుపాక్షిక వేదికల్లో సమన్వయాన్ని మరింత పెంచేందుకు కూడా అంగీకరించాయి. సమావేశంలో ఆర్థిక భద్రత, వ్యూహాత్మక స్వావలంబనను బలోపేతం చేసే లక్ష్యం తో క్రిటికల్ మినరల్స్ భాగస్వామ్యాన్ని వేగవంతం చేయడంపై ప్రత్యేకంగా చర్చించారు. అలాగే పరస్పర పెట్టుబడులను పెంచడం, హైస్పీడ్ రైలు రంగంలో సహకారాన్ని విస్తరించడం, ఇరు దేశాల ఆర్థిక వ్యవస్థల మధ్య అనుసంధానాన్ని బలోపేతం చేయ డం వంటి అంశాలు కూడా చర్చకు వచ్చాయి. ఆర్థిక, విత్త, సాంకేతిక, పెట్టుబడులు, వాణిజ్య అంశాలపై సమగ్ర చర్చలకు ఈఎఫ్‌డీని ప్రధాన వేదికగా కొనసాగించాలని ఇరు దేశాలు నిర్ణయించాయి. తదుపరి భారత్–ఫ్రాన్స్ ఆర్థిక, విత్త సంభాషణను 2027లో నిర్వహించే అవకాశాన్ని కూడా పరిశీలించనున్నట్లు వెల్లడించాయి. ఈ సమావేశం ప్రధాని నరేంద్ర మోదీ, ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్‌ల మధ్య గతంలో కుదిరిన అవగాహనకు కొనసాగింపుగా జరిగింది. ప్రస్తుతం కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ నాలుగు రోజుల అధికారిక పర్యటనలో భాగంగా ఫ్రాన్స్‌లో పర్యటిస్తున్నారు.

భారత్ వృద్ధికి మధ్యతరగతే చోదకశక్తి

(మొదటిపేజీ తరువాయి)

ప్రైవేటు రంగంతో కలిసి జిల్లా స్థాయిలో శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తోందని తెలిపారు. ప్రస్తుతం దేశ ఎగుమతుల్లో దాదాపు 40 శాతం వాటా సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఈలు) నుంచే వస్తోందని, అవి కూడా ఏఐ ఆధారిత వ్యాపార విధానాలను వేగంగా స్వీకరిస్తున్నాయని చెప్పారు.

బీఆర్ఎస్ అప్పులపై చర్చకు సిద్ధం

(మొదటిపేజీ తరువాయి)

చర్చకు రావాలని ఆహ్వా నించానని తెలిపారు. అయితే హరీశ్‌రావు లేఖ లో ప్రధాన అంశాలను దాటవేశారని ఆయన ఆరోపించారు. కాళేశ్వరం కార్పొరేషన్ పేరుతో తీసుకున్న రుణాలపై ప్రశ్నించినప్పటికీ సమాధానం రాలేదని జూపల్లి అన్నారు. హరీశ్‌రావు దాటవేత ధోరణి అవలంబిస్తున్నారని, ఇది "పలాయనవాదం" అని వ్యాఖ్యానించారు. పాలమూరు పౌరుషంతోనే తాను గతంలో మంత్రి పదవికి రాజీనామా చేశానని గుర్తుచేశారు. తెలంగాణ ఉద్యమ ఆకాంక్షలకు అనుగుణంగా గత బీఆర్ఎస్ పాలన సాగలేదని ఆయన ఆరోపించారు. బీఆర్ఎస్ అప్పులపై కేటీఆర్, హరీశ్‌రావులు చెబుతున్న లెక్కలు తప్పని అన్నారు. తనకు పదవులు కాదని, ఆత్మగౌరవమే ముఖ్యమని స్పష్టం చేశారు. ధైర్యం ఉంటే తమ లెక్కలు, వాదనలపై బహిరంగ చర్చకు రావాలని జూపల్లి సవాల్ విసిరారు.

అప్పులపై కాంగ్రెస్ తప్పుడు ప్రచారం

(మొదటిపేజీ తరువాయి)

రేవంత్‌రెడ్డి అంత చెప్పాడు అంటే ఈ నాలుగు నెలలది కూడా కలిపితే రూ. 4 లక్షల కోట్లు దాటుతుందన్నారు. జూపల్లి ఒక మాట చెబుతున్నాడు, రేవంత్ రెడ్డి ఇంకో మాట చెబుతున్నాడు. ఇప్పుడు రాజీనామా ఎవరు చేయాలి? అని హరీశ్ రావు సూటిగా ప్రశ్నించాడు. పూటకో సవాల్.. రోజుకో అడ్రస్‌లా మంత్రి జూపల్లి కృష్ణారావు తీరు ఉందని హరీశ్‌రావు విమర్శించారు. మంత్రి జూపల్లి సవాళ్లు నిన్నే చూశాం.. ఏమైందో అందరికీ తెలుసు. తెలంగాణ భవన్‌కు వస్తానని చెప్పింది ఆయనే. వెంటనే మాట మార్చి గన్‌పార్క్‌కు వెళ్లారు. గన్‌పార్క్‌కు వెళ్లకుండా పోలీసులు మమ్మల్ని అడ్డుకున్నారు. చర్చకు కేసీఆర్ రావాలని ఇప్పుడు అంటున్నారు. జూపల్లి వాట్సప్‌లో లేఖ పెట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక వాళ్లు చేసిన అప్పులు లేఖలో రాశారు. తాము వచ్చాక రూ.1.77లక్షల కోట్లు అప్పు చేశామని జూపల్లే చెప్పారు. ఆర్‌బీఐ వద్ద తెచ్చిన ఎఫ్ఆర్‌బీఎం అప్పులు మొత్తం చెబుతా. కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన అప్పు రూ.1.86లక్షల కోట్లు. ఆర్‌బీఐ తెచ్చిన అప్పులోనే తేడాలు చెప్పారు. ఏం చేయాలో అర్థంకాక డ్యామేజ్ కంట్రోల్ చేసుకుంటున్నారు' అని హరీశ్‌రావు విమర్శించారు.

మూడు దేశాల పర్యటనకు ప్రధాని మోదీ

- **ఈ నెల 6 నుంచి 11 వరకు ఇండోనేషియా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్‌లో కీలక ద్వైపాక్షిక చర్చలు**
- **రక్షణ, వాణిజ్యం, సముద్ర భద్రత, పెట్టుబడులపై దృష్టి**
- **నాలుగు దశాబ్దాల తర్వాత న్యూజిలాండ్‌లో పర్యటించనున్న భారత ప్రధాని**

న్యూఢిల్లీ: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ నెల 6 నుంచి 11 వరకు ఇండోనేషియా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్‌లలో పర్యటించనున్నారు. రక్షణ, వాణిజ్యం, సముద్ర భద్రత, కీలక ఖనిజాలు, సాంకేతికత తదితర రంగాల్లో ద్వైపాక్షిక సహకారాన్ని మరింత విస్తరించడమే ఈ పర్యటన ప్రధాన లక్ష్యమని విదేశాంగ శాఖ (ఎంఈఏ) శుక్రవారం వెల్లడించింది. పర్యటనలో తొలి విడతగా జూలై 6 నుంచి 8 వరకు ఇండోనేషియాలోని జకార్తాలో ప్రధాని మోదీ అధికారిక కార్యక్రమాల్లో పాల్గొంటారు. అనంతరం చారిత్రక నగరం యోగ్యకర్తకు వెళ్లి యునెస్కో ప్రపంచ వారసత్వ కట్టడమైన ప్రంబనన్ ఆలయ సముదాయాన్ని సందర్శిస్తారు. ఈ ఆలయ పరిరక్షణ పనుల్లో భారత్, ఇండోనేషియా సంయుక్తంగా సహకరించనున్నట్లు విదేశాంగ శాఖ తెలిపింది. ఇండోనేషియా అధ్యక్షుడు ప్రబోవో సుబియాంటోతో ద్వైపాక్షిక సమావేశం నిర్వహించి సముద్ర భద్రత, రక్షణ, వాణిజ్యం, సాంస్కృతిక సంబంధాలపై చర్చించనున్నారు. జకార్తాలో భారతీయ ప్రవాసులను కూడా ఉద్దేశించి ప్రసంగిస్తారు.

భారత్–ఆస్ట్రేలియా వార్షిక శిఖరాగ్ర సమావేశం

అనంతరం 8 నుంచి 10 వరకు ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్‌లో పర్యటించనున్న మోదీ, ఆ దేశ ప్రధాని ఆంథనీ అల్బనీస్తో మూడో భారత్–ఆస్ట్రేలియా వార్షిక శిఖరాగ్ర సమావేశంలో పాల్గొంటారు. కీలక ఖనిజాలు, సైబర్ భద్రత, సరఫరా గొలుసుల బలోపేతం, అభివృద్ధి చెందుతున్న సాంకేతిక రంగాల్లో సహకారాన్ని విస్తరించడంపై చర్చలు జరగనున్నాయి. ఆస్ట్రేలియా గవర్నర్ జనరల్ సామ్ మోస్టిన్‌ను మర్యాదపూర్వకంగా కలవడంతో పాటు ఇండియా–ఆస్ట్రేలియా సీఈఓల ఫోరంలో పాల్గొని పారిశ్రామికవేత్తలను ఉద్దేశించి ప్రసంగించనున్నారు. అక్కడి భారతీయ ప్రవాసులతో కూడా సమావేశమవుతారు. 10న మోదీ న్యూజిలాండ్‌లోని ఆక్లాండ్‌కు చేరుకుని ప్రధాని క్రిస్టోఫర్ లక్సన్ ఆహ్వానం మేరకు అధికారిక పర్యటన చేపడతారు. దాదాపు 40 ఏళ్ల తర్వాత భారత ప్రధాని న్యూజిలాండ్‌లో పర్యటించడం ఇదే తొలిసారి. ఇరు దేశాల మధ్య వాణిజ్యం, పెట్టుబడులు, రక్షణ, ప్రజల మధ్య సంబంధాలపై సమగ్రంగా చర్చలు జరగనున్నాయి. వ్యాపార, క్రీడా రంగ ప్రముఖులతో సమావేశమయ్యే మోదీ, భారతీయ ప్రవాసులను కూడా ఉద్దేశించి ప్రసంగించనున్నారు.

వేడుకలు సమాజానికి ఉపయోగపడాలి

- **ఎన్నారై ప్రాజెక్ట్స్ అధినేత నంబూరి రవి**
- **సేవా కార్యక్రమాల నడుమ జన్మదిన వేడుకలు**
- **అన్నదానం, రక్తదానం, ఉచిత వైద్య శిబిరాల నిర్వహణ**

ప్రజానావ, ఉప్పల్: ఎన్నారై ప్రాజెక్ట్స్ అధినేత నంబూరి రవి జన్మదిన వేడుకలు ఉప్పల్‌లోని సంస్థ కార్యాలయంలో ఆదర్శంగా నిలిచే రీతిలో సేవా కార్యక్రమాల నడుమ ఘనంగా నిర్వహించారు. ప్రతి సంవత్సరం సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాలను ప్రోత్సహిస్తూ ముందుకు సాగుతున్న ఆయన, ఈసారి కూడా రక్తదాన శిబిరం, ఉచిత వైద్య శిబిరం, అనాథ చిన్నారులకు అన్నదానం వంటి సేవా కార్యక్రమాలను చేపట్టారు. ఈ సందర్భంగా నిర్వహించిన వైద్య శిబిరంలో మెడికవర్ హాస్పిటల్, ఏషియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ నెఫ్రాలజీ అండ్ యూరాలజీ వైద్యులు పాల్గొని రక్తపరీక్షలు, కంటి పరీక్షలు నిర్వహించి ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందించారు. ఆరోగ్యంపై అవగాహన పెంపొందించే దిశగా ఈ శిబిరం ముఖ్య ఆకర్షణగా నిలిచింది. జన్మదిన వేడుకలను కేవలం ఆర్భాటంగా కాకుండా సమాజానికి ఉపయోగపడే సేవా కార్యక్రమాలతో జరుపుకోవడం ద్వారా బాధ్యతాయుతమైన దృక్పథాన్ని చాటుకోవాలని నంబూరి రవి ఈ సందర్భంగా పేర్కొన్నారు. అనంతరం ఎన్నారై ప్రాజెక్ట్స్ అదిరా టీం సభ్యులు జి. ప్రభాకర్, ఆముల పరుశురాం తదితరులు నంబూరి రవిని శాలువాతో సన్మానించి కేక్ కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు, టీం సభ్యులు, ప్రముఖులు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

రూ.77 లక్షల అభివృద్ధి పనులకు శ్రీకారం

- **ఓపెన్ జిమ్, రోడ్లు, డ్రైనేజీ పనుల ప్రారంభించిన చుట్టిన బండి సంజయ్**

ప్రజానావ, కరీంనగర్: బండి సంజయ్ కుమార్ కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాల్లో భాగంగా 37వ డివిజన్‌లో శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా డివిజన్‌లో చేపట్టిన పలు అభివృద్ధి పనులను ప్రారంభించి స్థానికంగా జరుగుతున్న మౌలిక వసతుల అభివృద్ధిపై సమీక్ష నిర్వహించారు. ముందుగా పద్మశాలి స్టేట్ శ్రీనివాస థియేటర్ సమీపంలో సిఎస్ఆర్ నిధులతో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌ను ప్రారంభించారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ఉపయోగపడే విధంగా ఈ జిమ్ ఏర్పాటు చేయడం అభినందనీయమని అధికారులు పేర్కొన్నారు. అనంతరం గాయత్రీనగర్‌లో మున్సిపల్ సాధారణ నిధులతో రూ.77 లక్షల వ్యయంతో చేపట్టిన రోడ్లు, డ్రైనేజీలు తదితర అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మేయర్ కొలగాని శ్రీనివాస్, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు, స్థానిక కార్పొరేటర్ కోడూరి ఏపీపీ చంద్ర, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, బీజేపీ కార్పొరేటర్లు, కోఆప్షన్ సభ్యులు, పార్టీ నాయకులు, డివిజన్ వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సిరిసిల్ల కళాశాలలో.. 25వ రోజు జాతీయ పతాకావిష్కరణ

ప్రజానావ, సిరిసిల్ల : కష్టపడితేనే విజయాన్ని సాధిస్తారని ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ రాజ్ కుమార్ తెలిపారు. సిరిసిల్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల (కో–ఎడ్యుకేషన్) శుక్రవారం నిత్య జాతీయ పతా కావిష్కరణ 25వ రోజు కార్యక్రమంలో భాగంగా జాతీయ పతాకాన్ని ఏ ఆర్ హెడ్ –కానిస్టేబుల్ రాజ్ కుమార్ పతాకావిష్కరణ చేశారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ పతాకావిష్కరణ అవకాశం మాన్యులకే కాకుండా సామాన్యులకు కూడా అందించే నిత్య జాతీయ పతాకావిష్కరణ అభినంద నీయమన్నారు. ప్రతిరోజు విద్యార్థులచే జాతీయ పతాకావిష్కరణ చేయించడం ఒక వినూత్న కార్యక్ర మమని, ఈ విధంగా కార్యక్రమాన్ని నిర్వహించే రాష్ట్రంలోని ఏకైక కళాశాల ప్రభుత్వ జూనియర్ కళా శాల అని తెలిపారు. ప్రతి విద్యార్థి దేశభక్తి భావాలను పెంచుకోవాలని క్రమశిక్షణతో చదివితే ఎలాంటి ఉన్నత ఉద్యోగాలైన సాధించవ చ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కనకశ్రీ విజయ రఘునందన్, అధ్యాపకులు శ్రీధర్, బి వెంకటేశం, సామల వివేకానంద్, కనకయ్య, రాజయ్య, చంద్రమౌళి, పి. ఆంజనేయులు, సరోజ, విజయ, రాజశేఖ ర్, శ్రీనివాస్, సుజిత, నర్మద, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు

గంభీరావుపేటలో అధునాతన రైతు మార్కెట్ నిర్మాణం

- **కేసీఆర్ రైతు మార్కెట్ పేరిట నిర్మాణానికి హామీ ఇచ్చిన కేటీఆర్**
- **కేటీఆర్‌ను కలిసిన గంభీరావుపేట పాలకవర్గ సభ్యులు**

ప్రజానావ, సిరిసిల్ల : గంభీరావుపేట మండల కేంద్రానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ మరో కీలక హామీ ఇచ్చారు. మండల కేంద్రంలో ప్రజలకు, వ్యాపారులకు ఎంతో ఉపయోగపడేలా ఆధునాతన డైలీ కూరగాయల మార్కెట్ షెడ్‌ను నిర్మించి ఇస్తానని ఆయన ప్రకటించారు. శుక్రవారం హైదరాబాద్‌లో గంభీరావుపేట మేజర్ గ్రామపంచాయతీ ఉప సర్పంచ్‌తో పాటు వార్డు సభ్యులు, స్థానిక నాయకులు కేటీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని గాంధీ విగ్రహం సమీపంలో మోడల్ కూరగాయల మార్కెట్ షెడ్ నిర్మించాలని కోరారు. ప్రస్తుతం వ్యాపారులు, రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లారు. వారి విజ్ఞప్తికి సానుకూలంగా స్పందించిన కేటీఆర్, మార్కెట్‌ను 'కేసీఆర్ కూరగాయల మార్కెట్' పేరిట తన స్వంత ఖర్చులతో నిర్మిస్తానని ప్రకటించారు. ఈ మార్కెట్ నిర్మాణంతో కూరగాయల వ్యాపారులకు శాశ్వత వసతి, వినియోగదారులకు మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. అడగగానే స్పందించి మార్కెట్ నిర్మాణానికి హామీ ఇచ్చిన కేటిఆర్ కి బీఆర్ఎస్ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో ఉప సర్పంచ్ లక్కిరెడ్డి కమలాకర్ రెడ్డి, వార్డు సభ్యులు గ్యార దేవరాజు, ఎగదండి స్వామి, రెడ్డి మల్ల రాజనర్సు, పిట్ట శ్రీమతి, అర్జున్, చిలుక ప్రశాంత్, పార్టీ మండల అధ్యక్షుడు పాపాగారి వెంకటస్వామి గౌడ్, ప్రధాన కార్యదర్శి గంధ్యాడపు రాజు, చేరాల నిఖిల్ గౌడ్, ఈరవేణి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు ప్రాధాన్యం ఇవ్వాలి

పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా

ప్రజానావ, రామగుండం: రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులకు పోలీసులంటే భయం కలిగేలా అధికారులు సమర్థవంతంగా విధులు నిర్వహించాలని అంబర్ కిశోర్ ఝా అన్నారు. రామగుండం పోలీస్ కమిషనరేట్‌లోని వివిధ విభాగాల్లో నూతనంగా బాధ్యతలు చేపట్టిన సీసీఎస్ ఏసీపీలు కె. రవీందర్, టి. ప్రవీణ్ కుమార్, టాస్క్‌ఫోర్స్ ఏసీపీ బి. శ్రీనివాస్ శుక్రవారం పోలీస్ కమిషనర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి మొక్కలను అందజేశారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ కమిషనరేట్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. నేరాల నియంత్రణ, చట్టవ్యతిరేక కార్యకలాపాల నిర్మూలన, నేరస్తులపై కఠిన చర్యలు తీసుకోవడంలో అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ సమర్థవంతమైన విధానాలను అమలు చేయాలని ఆదేశించారు.

మొక్కలు నాటి సంరక్షించడమూ బాధ్యతే

- **సత్తుపల్లిలో 15 వేల మందితో భారీ వనమహోత్సవ ర్యాలీ**
- **పర్యావరణ పరిరక్షణకు అందరూ భాగస్వాములు కావాలి**
- **సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి**

ప్రజానావ, సత్తుపల్లి: పర్యావరణ పరిరక్షణ అనేది కేవలం ప్రభుత్వాల బాధ్యత మాత్రమే కాదని, ప్రతి ఒక్కరూ ఇందులో భాగస్వాములు కావాలని సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ పిలుపునిచ్చారు. మొక్కలు నాటడం ఎంత ముఖ్యమో, వాటిని చెట్లుగా పెరిగే వరకు సంరక్షించడం కూడా అంతే ముఖ్యమని ఆమె స్పష్టం చేశారు. ఆశా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో సత్తుపల్లి పట్టణంలో రాష్ట్రంలోనే తొలిసారిగా సుమారు 15 వేల మందితో నిర్వహించిన భారీ వనమహోత్సవ ర్యాలీ ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర్, ఎమ్మెల్యే మట్టా రాగమయి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్తో కలిసి స్థానిక జేవీఆర్ కాలేజ్ గ్రౌండ్‌లో శుక్రవారం ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పర్యావరణ సమతుల్యతను కాపాడటం ప్రతి ఒక్కరి నైతిక బాధ్యత అని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్కనైనా నాటి బాధ్యతగా పెంచాలని పిలుపునిచ్చారు. కేవలం ఫోటోల కోసం మొక్కలు నాటడం కాకుండా వాటి సంరక్షణపై ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని తెలిపారు. సత్తుపల్లి పట్టణంలో పర్యావరణ పరిరక్షణపై భారీ స్థాయిలో చైతన్యం తీసుకొచ్చిన విద్యార్థులు, యువత, ప్రజలను ప్రత్యేకంగా అభినందించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ దాదాపు 15 వేల మందితో ఇంత భారీ స్థాయిలో వనమహోత్సవ కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. తన సర్వీస్‌లో ఇంత పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్న పర్యావరణ చైతన్య కార్యక్రమాన్ని చూడటం ఇదే మొదటిసారి అని తెలిపారు. డాక్టర్ మట్టా దయానంద్ మాట్లాడుతూ సత్తుపల్లి నియోజకవర్గం ఎప్పటికప్పుడు విద్య, అభివృద్ధి, సామాజిక చైతన్యంలో ముందంజలో ఉంటుందని, ఈ భారీ వనమహోత్సవ ర్యాలీ రాష్ట్ర చరిత్రలోనే సత్తుపల్లికి ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చిందని పేర్కొన్నారు. స్థానిక జేవీఆర్ కాలేజ్ గ్రౌండ్‌లో నిర్వహించిన వనమహోత్సవ కార్యక్రమం పండుగ వాతావరణాన్ని తలపించింది. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలకు చెందిన విద్యార్థులు, యువత, ప్రజాప్రతినిధులు, అధికారులు పెద్ద సంఖ్యలో హాజరుకావడంతో ప్రాంగణం జనసందోహంగా మారింది. అనంతరం జేవీఆర్ కాలేజ్ నుంచి పాత సెంటర్ మీదుగా భారీ ర్యాలీ కొనసాగింది. పర్యావరణ పరిరక్షణకు మద్దతుగా విద్యార్థులు చేసిన నినాదాలు పట్టణంలో ప్రత్యేక ఉత్సాహాన్ని నింపాయి. చిన్నారులతో కలిసి ఎమ్మెల్యే రాగమయి, డాక్టర్ దయానంద్ ఉత్సాహంగా అడుగులు వేస్తూ వారితో మమేకమ య్యారు. ర్యాలీలో జానపద కళాకారుల ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్, డీఎఫ్‌వో, ఖమ్మం జిల్లా డీసీసీ అధ్యక్షుడు నూతి సత్యనారాయణ, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, పట్టణ ప్రముఖులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఉరుకొండపేటలో సీఎం పర్యటనకు ఏర్పాట్లు పూర్తి

- **భద్రతా చర్యలు పకడ్బందీగా అమలు చేయాలి**
- **కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్**

ప్రజానావ, నాగర్‌కర్నూల్: ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి శనివారం జిల్లాలోని ఉరుకొండ మండలం ఉరుకొండపేటలోని శ్రీ ఆంజనేయస్వామి దేవాలయాన్ని సందర్శించనున్న నేపథ్యంలో జిల్లా అధికార యంత్రాంగం పకడ్బందీగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ తెలిపారు. శుక్రవారం ఉరుకొండపేట దేవాలయ ప్రాంగణంతో పాటు వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసే ప్రాంతాలు, ముఖ్యమంత్రి పాల్గొనే ఆత్మీయ విందు కార్యక్రమ స్థలాన్ని సంబంధిత శాఖల అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించి సమగ్ర సమీక్ష నిర్వహించారు. జిల్లా కలెక్టర్‌తో పాటు జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జి పాటిల్, ముఖ్యమంత్రి భద్రతా విభాగం ఉన్నతాధికారులు, ఇంటెలిజెన్స్ అధికారులు, జిల్లా స్థాయి అధికారులతో కలిసి ముఖ్యమంత్రి పర్యటించే ప్రాంతాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ముఖ్యంగా హెలిప్యాడ్, ఆలయ ప్రాంగణం, సభా వేదిక, ప్రజల రాకపోకల మార్గాలు, వాహనాల పార్కింగ్ స్థలాలు, కాన్వాయ్ ప్రయాణ మార్గం, భద్రతా పాయింట్లను పరిశీలించి అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు. పర్యటనకు సంబంధించిన ప్రతి శాఖకు బాధ్యతలు అప్పగించామని, భద్రతా విషయంలో ఏ మాత్రం నిర్లక్ష్యానికి తావు ఉండకూడదని స్పష్టం చేశారు. ప్రతి అధికారి తన బాధ్యతలను పూర్తి స్థాయిలో నిర్వర్తించాలని, శాఖల మధ్య సమన్వయం అత్యంత కీలకమని, చిన్న అంశాలను కూడా విస్మరించకుండా పర్యవేక్షించాలని సూచించారు. ముఖ్యమంత్రి భద్రతా విభాగం తరఫున అదనపు ఎస్పీ చి. వాసుదేవ రెడ్డి, డీఎస్పీలు శ్రీధర్ రెడ్డి, కృష్ణ ఏఎస్ఎల్‌లో పాల్గొని స్థానిక యంత్రాంగంతో కలిసి భద్రతా ఏర్పాట్లను క్షుణ్ణంగా పరిశీలించారు.ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్లు అరుణ రెడ్డి, దేవ సహాయం, ఆర్డీవో జనార్దన్ రెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు, పోలీసు అధికారులు, అగ్నిమాపక, వైద్య ఆరోగ్య, విద్యుత్, పంచాయతీరాజ్, రోడ్లు–భవనాలు, మున్సిపల్, రెవెన్యూ శాఖల అధికారులు, ఆలయ కమిటీ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

విరసం సభలను విజయవంతం చేయండి

ప్రజానావ,పెద్దపల్లి : 5న విరసం ఆవిర్భావ దినం సందర్భంగా హైదరాబాద్ బాగ్లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో దేశంలో ప్రజా పోరాటాల పై అమలవుతున్న ఫాసిస్ట్ నిర్బంధానికి , అణిచివేతకు వ్యతిరేకంగా సాహిత్య, సాంస్కృతిక రంగాల్లో పోరాటం కొనసాగించాలానే నేపథ్యంతో 2026 జూలై 5 ఆదివారంనాడు ఉదయం 10 గంటల నుంచి సాయింత్రం 5.30 వరకు సదస్సు ఉంది. ఈ సందర్భంగా పెద్దపల్లి జిల్లా కేంద్రంలో హైదరాబాదులో జరిగే విజయవంతం చేయాలని కోరుతూ ఆయా ప్రజా సంఘాల ఆధ్వర్యంలో పెద్ద పల్లి అంబేద్కర్ చౌరస్తా వద్ద కరపత్రం వాల్ పోస్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాల నాయకులు పలువురు మాట్లాడుతూ భారతదేశంలో ఫాసిజం ప్రత్యేకతలు, బుల్డోజర్ రాజకీయాలు మత మైనారిటీల అస్తిత్వంపై దాడి, తెలుగు సాహిత్యంలో ఇటీవల ధోరణులు – మార్క్సిస్ట్ దృక్పథం అనే అంశాలపై ఉపన్యాసాలు, విరసం కళాబృందం నాటక ప్రదర్శనతో పాటు వివిధ కళాబృందాల ఆధ్వర్యంలో సంస్కృతిక కార్యక్రమా లు ఉంటాయన్నారు. ఎప్పటిలాగానే స్నేహపూర్వక సహకారాన్ని ఆశిస్తూ అందరికీ సాదర ఆహ్వానం పలుకుతున్నామని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా తీసుకువచ్చిన కరపత్రాన్ని, పోస్టర్లను విరసం ఆవిష్కరణ చేశారు. ఈ కార్యక్రమంలో బాలసాని రాజయ్య విరసం ఉమ్మడి కరీంనగర్ జిల్లా కన్వీనర్, మాదన కుమారస్వామి సి.ఎల్.సి రాష్ట్ర సహాయ కార్యదర్శి, మార్వాడి సుదర్శన్ డిఎల్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, గాండ్ల మల్లేశం తెలంగాణ ప్రజా ఫ్రంట్ రాష్ట్ర కార్యదర్శి, దేవి సత్యం తెలంగాణ మున్సిపల్ కాంట్రాక్టు కార్మిక సంఘ గౌరవ అధ్యక్షులు, ఐత బాపు కార్మిక సంఘ రాష్ట్ర కార్యదర్శి ఎస్ నంబయ్య కార్మిక సంఘం నాయకుడు, శ్రీపతి రాజగోపాల్ పౌర హక్కుల సంఘం ఈ.సి మెంబర్, బండి శంకర్ గౌడ్ సి.ఎల్.సి జిల్లా మెంబర్, అయిందాల అంజన్న తెలంగాణ ప్రజా ఫ్రంట్ కరీంనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి, బట్టారి ఆంజనేయస్వామి టియుజెసి రాష్ట్ర సెక్రెటరీ, బండారి గంగారాజ్ టి యు జేఏసీ జిల్లా వైస్ ప్రెసిడెంట్, ఆజాద్ ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు పెద్దపల్లి తదితరులు పాలుగోన్నారు

కేజీబీవీల్లో ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోండి

పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

ప్రజానావ, పెద్దపల్లి : జిల్లాలోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయా ల్లో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్స రంలో మిగిలి ఉన్న ఖాళీ సీట్లలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్న ట్లు జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష శుక్రవారం తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణులైన అర్హత గల బాలికలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జిల్లాలోని ధర్మారం ఎంపిహెచ్ డబ్ల్యు కోర్సులో 25 సీట్లు, జూలపల్లి బిపిసిలో 12 సీట్లు, ముత్తారం (మంథని) సీఈసీలో 10 సీట్లు, ఓదెల ఎంపీసీలో 14 సీట్లు, బిపీసీలో 14 సీట్లు, పాలకుర్తిలో ఎమ్మెల్ టి ఐదు సీట్లు, బిపిసి 10 సీట్లు, రామగిరి కంప్యూటర్ సైన్స్ లో 15 సీట్లు, శ్రీరాంపూర్ సీఈసీలో రెండు సీట్లు, ఎంపిహెచ్ డబ్ల్యు రెండు సీట్లు, సుల్తానాబాద్ సీఈసీలో ఆరు సీట్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కేజీబీవీల్లో విద్యార్థినులకు ఉచిత వసతి, భోజనం, పాఠ్యపుస్తకాలు, యూనిఫాం, నాణ్యమైన విద్య వంటి సదుపాయాల ఉంటాయని, పరిమిత సంఖ్యలో మాత్రమే సీట్లు ఉన్నందున, అర్హులైన విద్యార్థినులు వెంటనే సంబంధిత ప్రధానోపా ధ్యాయులను సంప్రదించి ప్రవేశం పొందాలని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు.

ఓటరు జాబితాలో ప్రతి అర్హుడి పేరు నమోదవ్వాలి

- **ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ల శ్రీను బాబు**

ప్రజానావ, గోదావరిఖని: రామగుండం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం రామగుండం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సర్–బీఎల్‌ఏ ఇంచార్జులతో రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ , టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ల శ్రీను బాబు సమీక్షా సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (సర్) కార్యక్రమం పురోగతి, బీఎల్‌ఏలు చేపట్టాల్సిన బాధ్యతలు, ప్రజలకు అందించాల్సిన సహకారంపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మాట్లాడుతూ.. భారత ఎన్నికల కమిషన్ చేపట్టిన ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమం అత్యంత కీలకమైనదని అన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థకు ఓటు హక్కు ఎంతో విలువైనదని, అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో ఉండేలా కాంగ్రెస్ పార్టీ నాయకులు, బీఎల్‌ఏలు బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. ప్రతి బూత్ పరిధిలో ఇంటింటికీ వెళ్లి ప్రజలకు సర్ ప్రక్రియపై పూర్తి అవగాహన కల్పించాలని, అవసరమైన దరఖాస్తులు నింపడంలో సహకరించాలని తెలిపారు. ఓటరు జాబితాలో పేర్లు లేకపోవడం, తప్పులు ఉండడం, చిరునామా మార్పులు, కొత్త ఓటర్ల నమోదు వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఎలాంటి అర్హత కలిగిన ఓటరు కూడా జాబితా నుంచి మినహాయించబడకుండా అప్రమత్తంగా ఉండాలని, ప్రజలకు ఎప్పటికప్పుడు అవసరమైన సమాచారం అందించాలని అన్నారు. టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ల శ్రీను బాబు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేస్తూ ప్రతి పోలింగ్ బూత్‌లో సర్ ప్రక్రియను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ప్రజల సందేహాలను నివృత్తి చేస్తూ, ఎన్నికల కమిషన్ నిబంధనలకు అనుగుణంగా ప్రతి దరఖాస్తు సక్రమంగా పూర్తి అయ్యేలా చూడాలని సూచించారు. పార్టీ కార్యకర్తలు సేవాభావంతో పనిచేస్తే ప్రజల్లో మరింత విశ్వాసం పెరుగుతుందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో నగర మేయర్ మహంకాళి స్వామి, డిప్యూటీ మేయర్ పాతపల్లి ఎల్లయ్య, కార్పొరేటర్లు నియోజకవర్గంలోని అన్ని డివిజన్ల, గ్రామాల సర్–బీఎల్‌ఏ ఇంచార్జులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

సీఎంఆర్ డెలివరీలు వేగవంతం చేయాలి

పెండింగ్ బియ్యం తరలింపుపై కలెక్టర్ ఆందోళన

ప్రజానావ, కామారెడ్డి: జిల్లాలో కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) డెలివరీలను వేగవంతం చేయడంతో పాటు సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ (సీజీడీ) ప్రాజెక్టు విస్తరణ పనులను నిర్ణీత గడువులో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన రెండు వేర్వేరు సమీక్షా సమావేశాల్లో సీఎంఆర్ డెలివరీలు, సీజీడీ ప్రాజెక్టు పురోగతిపై సమీక్ష నిర్వహించి పలు కీలక సూచనలు చేశారు. సీఎంఆర్ డెలివరీల సమీక్షలో రబీ 2024–25, ఖరీఫ్ 2025–26, రబీ 2025–26 సీజన్లకు సంబంధించిన 3,48,991 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ డెలివరీలు పెండింగ్‌లో ఉండటంపై ఆందోళన వ్యక్తం చేశారు. జూలై నెలలో కనీసం 20 రైల్వే రేకుల ద్వారా బియ్యం తరలింపునకు ఎఫ్‌సీఐ అధికారులు అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అడ్లూర్ ఎల్లారెడ్డి ఐజీ–2, ఉప్పల్‌వాయి గోదాముల్లో నిల్వ ఉన్న స్టాక్‌కు సంబంధించిన స్థలాలను వెంటనే విడుదల చేయాలని, అన్‌లోడింగ్ పనులకు అవసరమైన హమాలీలను అందుబాటులో ఉంచాలని సూచించారు. నాణ్యత పరిశీలనలో అన్ని కేంద్రాల్లో ఒకే విధమైన ప్రమాణాలు పాటించాలని, రోజుకు 50 సీఎంఆర్ లాట్ల డెలివరీ లక్ష్యాన్ని చేరుకునేందుకు కామారెడ్డి డివిజన్‌లో అదనంగా నలుగురు టెక్నికల్ అసిస్టెంట్లను నియమించాలని సూచించారు. ప్రభుత్వ లక్ష్యాల సాధనకు రైస్ మిల్లర్లు సహకరించాలని కోరారు. అనంతరం సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ ప్రాజెక్టు అమలుపై సమీక్ష నిర్వహించారు. జిల్లాలో పైప్డ్ నేచురల్ గ్యాస్ (పీఎన్‌జీ), కంప్రెస్డ్ నేచురల్ గ్యాస్ (సీఎన్‌జీ) మౌలిక సదుపాయాల అభివృద్ధికి సంబంధిత సంస్థకు అన్ని శాఖలు పూర్తి సహకారం అందించాలని ఆదేశించారు. పైప్‌లైన్ పనులకు అవసరమైన అన్ని అనుమతులను 24 గంటల్లోపు జారీ చేయాలని, రోడ్లు, భూగర్భ యుటిలిటీలకు సంబంధించిన డిజిటలైజ్డ్ మ్యాపులను అందుబాటులో ఉంచాలని సూచించారు. తవ్వకాలకు ముందు 'కాల్ బిఫోర్ యూ డిగ్ (సీబీయూడీ)' యాప్‌ను తప్పనిసరిగా వినియోగించాలని ఆదేశించారు. జిల్లా పౌర సరఫరాల అధికారిని నోడల్ అధికారిగా నియమిస్తూ ప్రాజెక్టు పురోగతిని నిరంతరం పర్యవేక్షించి ప్రతి నెల నివేదిక సమర్పించాలని సూచించారు. జిల్లాలో సీఎంఆర్ నిల్వలను సకాలంలో తరలించడంతో పాటు పరిశుభ్రమైన, పర్యావరణహితమైన, ఆర్థికంగా ప్రయోజనకరమైన సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ మౌలిక సదుపాయాల అభివృద్ధికి అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో మిషన్ మోడ్‌లో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు.

పేద విద్యార్థులకు ప్రపంచ స్థాయి విద్యే లక్ష్యం

- **రూ.250 కోట్లతో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణం**
- **2027 విద్యా సంవత్సరంలో తరగతుల ప్రారంభం: మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి**

ప్రజానావ, సూర్యాపేట : గ్రామీణ ప్రాంతాల్లోని పేద విద్యార్థులకు నాణ్యమైన ప్రపంచ స్థాయి ఇంగ్లీష్ బోర్డింగ్ విద్య అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లను ఏర్పాటు చేస్తోందని రాష్ట్ర నీటిపారుదల, ఆహార పౌరసరఫరాల శాఖ మంత్రి నల్లమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. శుక్రవారం గరిడేపల్లి మండలం గడ్డిపల్లిలో రూ.250 కోట్ల వ్యయంతో నిర్మాణంలో ఉన్న ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ పనులను జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్తో కలిసి ఆయన పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడిన మంత్రి, హుజూర్‌నగర్ నియోజకవర్గంలోని వేలాది గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ప్రపంచ స్థాయి ఇంగ్లీష్ స్టాండర్డ్ బోర్డింగ్ విద్యను అందించేందుకు ఈ విద్యాసంస్థను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. రూ.250 కోట్లతో నిర్మిస్తున్న ఈ ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్‌లో సుమారు 2,500 మంది విద్యార్థులు ఆహ్లాదకరమైన వాతావరణంలో విద్యను అభ్యసించేందుకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. వచ్చే ఏడాది 2027 నాటికి నిర్మాణ పనులు పూర్తిచేసి, అదే విద్యా సంవత్సరంలో తరగతులను ప్రారంభించేలా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి తెలిపారు.

ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..
విలేకరులు కావలెను
రెండు తెలుగు రాష్ట్రాల్లో వేగంగా విస్తరిస్తున్న తెలుగు దినపత్రిక ప్రజానావలో పని చేయుటకు మా సంస్థ ఆహ్వానం పలుకుతోంది
తెలంగాణ వ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాలు, నియోజకవర్గ కేంద్రాలు, మండల కేంద్రాల్లో పనిచేయుటకు విలేకరులు కావలెను.
మండలాలు, అర్బన్, పట్టణ కేంద్రాల్లో పనిచేసే వారికి కనీస అర్హత ఇంటర్మీడియట్
స్టాఫ్ రిపోర్టర్, ఆర్‌సీ ఇన్‌చార్జీలకు కనీస అర్హత డిగ్రీ ఉండాలి
మీ బయోడేటాను ఇప్పుడే ఈ నెంబర్లకు వాట్సాప్ చేయండి
☎ 9948433277, 9014966169

పార్లమెంట్ సమావేశాలపై కసరత్తు!

EDITORIAL

> పార్లమెంట్ వర్షాకాల సమావేశాలకు ముందుగానే ఈ మార్పులు జరిగే అవకాశం ఉంది. ప్రస్తుతం ఉన్న రాజకీయ సవూకరణాలను దృష్టిలో ఉంచుకొని, కొన్ని కీలక మంత్రిత్వ శాఖల్లో కొత్త నాయకులకు చోటు కల్పించడమే లక్ష్యంగా ప్రధాని మోడీ వ్యూహరచన చేస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. వరుసగా ప్రధాని మోడీ, అమిత్ షాలు వేర్వేరుగా రాష్ట్రపతిని కలవడం ఈ వార్తలకు బలం చేరింది. బీజేపీ సంస్థాగత బృందంలో కూడా నితిన్ నబిన్ నేతృత్వంలో సమూల మార్పులు చేసేందుకు పార్టీ అగ్ర నాయకత్వం జాబితాను ఖరారు చేసింది.

ఈ నెలాఖరులో పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ప్రారంభం కానున్నాయి. ఈ సమావేశాల్లోనే మరోమారు మహిళా బిల్లు, డీలిమిటేషన్ బిల్లులను పెట్టే యోచనలో కేంద్రం ఉంది. అయితే గత సమావేశాల్లో ఈ రెండు బిల్లులు వీగిపోయాయి. అయినా ంద్రం తన పట్టును విడవకుండా ముందుకు సాగాలన్న యోచనలో ఉంది. ఈ బిల్లులు పాస్ కావాలంటే మూడోవంతు మెజార్టీ అవసరం. అందుకుతగ్గ కసరత్తు చేస్తున్నట్లుగా ఉంది. ఇదే సందర్భంలో అన్ని పార్టీలతో చర్చించే ప్రయత్నం మాత్రం చేయడం లేదు. అందరి అభిప్రాయాలను తీసుకుని ముందుకు సాగాలన్న ఆనవాయితీని బీజేపీ ఎప్పుడో విడనాడింది. గతంలో సమస్యలు లేదా బిల్లులకు సంబంధించి ముందస్తు అఖిపలక్ష సమావేశాలు జరిగేవి. కానీ అలాంటి ఆనవాయితీని బీజేపీ పాటించడం లేదు. దాదాపు 12 ఏళ్లుగా ఏకాభిప్రాయ సాధనలో మోడీ ఏనాడూ ప్రయత్నం చేయలేదు. ఇకపోతే ఏం జరుగుతుందో డా ప్రతిపక్షాల ఊహకు డా అందడం లేదు. ఈ క్రమంలో రేపటి బిల్లులను ఎప్పుడు, ఎలా ప్రవేశ పెడతారన్నది వలం మోడీ, అమిత్ షాలకు మాత్రమే తెలిసి ఉంటుంది. కేంద్ర మంత్రులు, బీజేపీ నేతలకు కూడా వీటిపై సమాచారం ఉండకపోవచ్చు. ఇలా గోప్యత పాటించడం వల్ల వచ్చే లాభం ఏమిటన్నది కూడా వారి తెలుసు. ఇకపోతే పార్లమెంట్ సమావేశాలు ఈ నెల 20 నుంచి ప్రారంభం కావచ్చని చూచాయగా తెలుస్తోంది. ఇదే సమయంలో సమావేశాలకు ముందు గానే మంత్రివర్గ పునర్వ్యస్థీకరణ ఉంటుందని సమాచారం వస్తోంది. దీంతో ఎవరు ఉంటారు, ఎవరు పోతారన్న లెక్కల్లో ఎంపీలు ఉన్నారు. ఇది కూడా మోడీ, అమిత్ షాల కనుసన్నల్లోనే జరుగుతుందనడంలో సందేహం లేదు. అందులో కేంద్ర మంత్రి వర్గ పునర్వ్యవస్థీకరణ అంటే దేశవ్యాప్తంగా ఆసక్తి నెలకొంది. పార్లమెంట్ వర్షాకాల సమావేశాలకు ముందుగానే ఈ మార్పులు జరిగే అవకాశం ఉంది. ప్రస్తుతం ఉన్న రాజకీయ సవూకరణాలను దృష్టిలో ఉంచుకొని, కొన్ని కీలక మంత్రిత్వ శాఖల్లో కొత్త నాయకులకు చోటు కల్పించడమే లక్ష్యంగా ప్రధాని మోడీ వ్యూహరచన చేస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. వరుసగా ప్రధాని మోడీ, అమిత్ షాలు వేర్వేరుగా రాష్ట్రపతిని కలవడం ఈ వార్తలకు బలం చేరింది. బీజేపీ సంస్థాగత బృందంలో కూడా నితిన్ నబిన్ నేతృత్వంలో సమూల మార్పులు చేసేందుకు పార్టీ అగ్ర నాయకత్వం జాబితాను ఖరారు చేసింది. ప్రభుత్వంతో పాటు పార్టీలో డా సమర్థులైన వారికి బాధ్యతలు అప్పగించే దిశగా అడుగులు పడుతున్నాయి. ప్రభుత్వ పనితీరును మరింత వేగవంతం చేసేందుకు పలువురు మంత్రుల శాఖల్లో మార్పులు ఉండబోతున్నాయి. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు విద్యాశాఖ బాధ్యతలు అప్పగించి, ఆ స్థానంలో శక్తికాంత దాస్ను తీసుకురావచ్చనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి. అనురాగ్ ఠార్ తిరిగి మంత్రివర్గంలోకి వచ్చే అవకాశం బలంగా ఉంది. పరీక్షల లీజీలు, ఆర్థిక సవాళ్ల నేపథ్యంలో సమర్థవంతమైన నాయకత్వం అవసరమని ప్రధాని భావిస్తున్నారు. ఈ క్రమంలో ప్రస్తుత విద్యాశాఖ మంత్రి ధర్మేం దర ప్రధాన్‌ను తప్పించే అవకాశాలు కూడా లేకపోలేదు. మరోవైపు పంకజ్ చౌదరి, హర్ష్ మల్హోత్రా వంటి మంత్రులు పార్టీ సంస్థాగత బాధ్యతల్లోకి వెళ్లగా, జార్జ్ కురియన్, రవనీత్ సింగ్ బిట్టు స్థానాల్లో కొత్త ముఖాలను బినెట్లోకి తీసుకోవడం ఖాయంగా కనిపిస్తోంది. రాబోయే అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, పంజాబ్ రాష్ట్రాల నుంచి మరికొందరు సమర్థ నేతలను మంత్రివర్గం లోకి తీసుకునే అవకాశం ఉంది. బెంగాల్‌లో మెరుగైన ఫలితాలు సాధించిన నేపథ్యంలో అక్కడి ఎంపీలకు ప్రాధాన్యత దక్కవచ్చు. శివసేన రెబెల్ వర్గం నుంచి ఒకరిద్దరికి, ముఖ్యంగా శ్రీకాంత్ షిండేకు అవకాశం లభించవచ్చని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. ఆప్ రెబెల్ ఎంపీలు రాఘవ్ చద్దా లేదా అశోక్ మిట్టల్ పేర్లు డా పరిశీలనలో ఉన్నాయి. రానున్న రోజుల్లో జరగనున్న కీలక రాజకీయ పరిణామాల నేపథ్యంలో, ఈ మార్పులు దేశ రాజకీయాలపై ప్రభావం చూపనున్నాయి. ంద్రంలో ఎన్డీఏ సర్కార్ త్వరలో కేబినెట్‌ను పునర్వ్యవస్థీకరించే అవకాశం ఉండడంతో ఉభయ తెలుగు రాష్ట్రాల్లోనూ మార్పులు ఉండవచ్చు.ముఖ్యంగా తెలంగాణలో ఉన్న ఇద్దరిలో మార్పు ఉంటుందా అన్న చర్చడా సాగుతోంది. ఈ నేపథ్యంలోనే ఆంధ్రప్రదేశ్‌కు మరో కేంద్ర మంత్రి పదవి దక్కనుందనే వార్తలు వస్తున్నాయి. ఇప్పటి టిడిపి నుంచి ఇద్దరు, బీజేపీ నుంచి ఒక్కరు బినేట్‌లో ఉన్నారు. ఇప్పటి ఏపీ నుండి ముగ్గురు మంత్రులు ఉన్నప్పటికీ, మరో అదనపు పదవిని టీడీపీకి టాయించే యోచనలో బీజేపీ ఉన్నట్లు సమాచారం. ఏపీలో టీడీపీ, బీజేపీ, జనసేన టమి బలంగా ఉండటంతో, కేంద్రంలో మరిన్ని అవకాశాలు దక్కేలా చంద్రబాబు వ్యూహరచన చేస్తున్నారు. ఒకవేళ మూడో పదవి వస్తే, అది టీడీపీ ఖాతాలో వెళ్తుందా లేక జనసేనకు వెళుతుందా, లేక బీజేపీ వెళుతుందా అన్నది చూడాలి. పరిణామం రాష్ట్ర అభివృద్ధికి, కేంద్రంతో సత్సంబంధాలకు మరింత బలాన్ని చేరుస్తుందని పార్టీ నేతలు ఆశిస్తున్నారు. మరోవైపు, సామాజిక సవూకరణాలను బట్టి నిర్ణయం తీసుకుంటే పరిస్థితి మారవచ్చు. మహిళా కోటాలో నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి పేరును కూడా అధిష్టానం పరిశీలించే అవకాశం ఉంది. కొత్త వారికి అవకాశం ఇస్తారా లేదా అనుభవజ్ఞుల వైపు మొగ్గు చూపుతారా అనేది వేచి చూడాలి. బీజేపీ ఇస్తే మహిళా ఎంపి పురంధేశ్వరికి ఛాన్స్ దక్కవచ్చని అనుకుంటున్నారు. మొత్తంగా ఎన్నికలు జరుగనున్న రాష్ట్రాలు, మహిళా బిల్లు, డీ లిమిటేషన్ బిల్లుల వ్యవహారంతో పాటు మంత్రివర్గ విస్తరణ అన్నది ఇప్పుడు చర్చనీయాంశంగా ఉంది. రానున్న రోజుల్లో దీనిపై స్పష్టత రానుంది. బీజేపీ వ్యూహం ఎలా ఉందన్నది డా తెలియనుంది.

> రాష్ట్ర అభివృద్ధికి, కేంద్రంతో సత్సంబంధాలకు మరింత బలాన్ని చేరుస్తుందని పార్టీ నేతలు ఆశిస్తున్నారు. మరోవైపు, సామాజిక సవూకరణాలను బట్టి నిర్ణయం తీసుకుంటే పరిస్థితి మారవచ్చు. మహిళా కోటాలో నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి పేరును కూడా అధిష్టానం పరిశీలించే అవకాశం ఉంది. కొత్త వారికి అవకాశం ఇస్తారా లేదా అనుభవజ్ఞుల వైపు మొగ్గు చూపుతారా అనేది వేచి చూడాలి.

నిబంధనల ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు

కలెక్టర్ బడుగు చంద్రశేఖర్

ప్రజానావ, నల్లగొండ: జిల్లాలోని మీ–సేవ కేంద్రాల నిర్వాహకులు ప్రభుత్వం నిర్ణయించిన ఛార్జీలకు మించి వసూళ్లు చేయరాదని, నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ బడుగు చంద్రశేఖర్ హెచ్చరించారు. నల్లగొండ కలెక్టరేట్‌లో జిల్లాలోని మీ–సేవ కేంద్రాల యజమానులు, ఆపరేటర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి సేవకు ప్రభుత్వం స్పష్టమైన ఛార్జీలను నిర్ణయించినప్పటికీ కొన్ని ప్రాంతాల్లో అధికంగా వసూళ్లు జరుగుతున్నట్లు ఫిర్యాదులు అందుతున్నాయని తెలిపారు. ధ్రువపత్రాల జారీ ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. దరఖాస్తుదారుల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి సరైన సమాచారాన్ని నమోదు చేయాలని ఆదేశించారు. మిర్యాలగూడ రోడ్డులోని టూ బీహెచ్‌కే కాలనీ, గొల్లగూడ ప్రాంతాల్లో కొత్త మీ–సేవ కేంద్రాల ఏర్పాటుకు అవకాశం ఉందని తెలిపారు. స్వయం సహాయక సంఘాల సభ్యులు కొత్త కేంద్రాల ఏర్పాటుకు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో రెవెన్యూ అధికారి దశరథ, మీ–సేవ జిల్లా అధికారి రాజశేఖర్, ఈడీఎం దుర్గారావు, ఏపీడీ శ్రవణ్ కుమార్, మీ–సేవ జిల్లా అధ్యక్షుడు రవి, ఆపరేటర్లు, యాజమాన్య ప్రతినిధులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు మంత్రి ఉత్తమ్ శ్రీకారం

- పలు బీటీ రహదారుల ప్రారంభం
- గ్రామీణ విద్యార్థులకు ప్రపంచ స్థాయి విద్య కోసం ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణం

ప్రజానావ, సూర్యాపేట: హుజూర్‌నగర్ నియోజకవర్గంలో గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, మౌలిక సదుపాయాల విస్తరణతో పాటు విద్యా రంగ బలోపేతానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని రాష్ట్ర నీటిపారుదల, ఆహార పౌర సరఫరాల శాఖ మంత్రి నల్లమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. గరిడేపల్లి మండలంలోని పలు గ్రామాలను కలుపుతూ నిర్మించిన పంచాయతీ రాజ్ రహదారులను శుక్రవారం ఆయన ప్రారంభించారు. కల్మలచెర్వులో రూ.4.20 కోట్లతో కల్మలచెర్వు నుంచి పాలకవీడు సబ్‌స్టేషన్ వరకు, రూ.2.80 కోట్లతో కల్మలచెర్వు నుంచి గానుగబండ వరకు బీటీ రోడ్లు, సోమ్లా తండలో రూ.84 లక్షలతో హనుమంతులగూడెం పీడబ్ల్యూడీ రోడ్డు నుంచి సోమ్లా తండ వరకు బీటీ రోడ్డు, గానుగబండలో రూ.3.50 కోట్లతో గానుగబండ నుంచి హనుమంతులగూడెం వరకు, రూ.1.40 కోట్లతో గానుగబండ హైస్కూల్ నుంచి పర్రెడ్డిగూడెం వరకు బీటీ రహదారులను ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ రాబోయే రోజుల్లో కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాల్లోని అన్ని గ్రామాలను తారు రహదారులతో అనుసంధానం చేస్తామని తెలిపారు. కొత్తగా నిర్మించిన రహదారులపై వ్యవసాయ పనులకు వినియోగించే ట్రాక్టర్లకు అమర్చే ఫుల్ వీల్స్, ఆఫ్ వీల్స్ వాడకాన్ని నివారించాలని, అలాంటి చర్యల వల్ల రహదారులు త్వరగా దెబ్బతింటాయని ప్రజలకు సూచించారు. గ్రామస్తులు రహదారులను దీర్ఘకాలం ఉపయోగపడేలా సంరక్షించాలని కోరారు. అనంతరం గరిడేపల్లి మండలంలోని గడ్డిపల్లి గ్రామంలో రూ.250 కోట్లతో నిర్మాణంలో ఉన్న ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ పనులను జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత విద్యార్థులకు నాణ్యమైన ప్రపంచ స్థాయి ఇంగ్లీష్ బోర్డింగ్ విద్య అందించడమే లక్ష్యంగా ఈ ఇంటిగ్రేటెడ్ స్కూల్‌ను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఈ విద్యాసంస్థలో సుమారు 2,500 మంది విద్యార్థులు ఆహ్లాదకరమైన వాతావరణంలో అన్ని సౌకర్యాలతో విద్యాభ్యాసం చేసే విధంగా ప్రణాళికలు రూపొందించామని పేర్కొన్నారు. నిర్మాణ పనులు 2027 నాటికి పూర్తిచేసి అదే విద్యా సంవత్సరంలో తరగతులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, జిల్లా ఎస్పీ కె. నర్సింహా, హుజూర్‌నగర్ ఆర్డీవో శ్రీనివాసులు, ఇన్‌చార్జ్ తహసీల్దార్ స్రవంతి, ఆర్ అండ్ బీ అధికారులు, సర్పంచులు, ప్రజాప్రతినిధులు, ఇంజనీర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఓటర్ల నమోదు పారదర్శకంగా జరగాలి

- కాంగ్రెస్ బెదిరింపులకు భయపడొద్దు
- బీఆర్ఎస్ మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్

ప్రజానావ, ఖమ్మం: నగరంలో ఓటర్ల నమోదు, సవరణల ప్రక్రియ అత్యంత పారదర్శకంగా, బాధ్యతాయుతంగా సాగాలని మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ పిలుపు నిచ్చారు. ఖమ్మం నగరంలో శుక్రవారం నిర్వహించిన ప్రత్యేక ఓటర్ల సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఓటరు జాబితా సవరణల్లో బూత్ లెవల్ అధికారుల పాత్ర అత్యంత కీలకమని ఆయన పేర్కొన్నారు. ప్రతి అర్హుడి ఓటు తప్పని సరిగా నమోదు కావాలని, ఒక్క ఓటు కూడా మిస్ కాకుండా చూడాలని కార్యకర్తలు, నాయకులకు సూచించారు. బీఎల్‌వోలు, బీఆర్ఎస్ బూత్ లెవల్ ఏజెంట్లు ప్రతి ఇంటిని తప్పనిసరిగా సందర్శించి క్షేత్రస్థాయిలో ఓటర్ల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. ఫారాలు నింపడంలో ఇబ్బందులు ఎదుర్కొనే ఓటర్లకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించి అవసరమైన సహాయ సహకారాలు అందించాలని తెలిపారు. ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా సరైన సమాచారాన్ని మాత్రమే నమోదు చేయాలని సూచించారు. ఈ ఎన్యూమరేషన్ ప్రక్రియ విజయవంతం కావడానికి ఖమ్మం నగర ప్రజలందరూ భాగస్వాములు కావాలని, ఇళ్లకు వచ్చే అధికారులకు పూర్తి సమాచారంతో సహకరించాలని కోరారు. కొత్తగా ఓటు నమోదు చేసుకునే వారికి, పాత ఓటర్ల వివరాల గుర్తింపులో లేదా ఇతర ప్రక్రియల్లో సందేహాలు ఉంటే నివృత్తి చేసుకునేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ప్రజలు ఎలాంటి సంకోచం లేకుండా బీఆర్ఎస్ బూత్ లెవల్ ఏజెంట్లను సంప్రదించవచ్చని, వారు పూర్తి స్థాయిలో మార్గదర్శకత్వం అందిస్తారని పేర్కొన్నారు. అనంతరం వైరా మున్సిపాలిటీ 19వ వార్డు లాలాపురం గ్రామంలో మాజీ మంత్రి పర్యటించారు. ఇటీవల శస్త్రచికిత్స చేయించుకుని విశ్రాంతి తీసుకుంటున్న గ్రామ పెద్ద దామా సీతారామయ్యను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన నివాసంలో బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నేతలు, కార్యకర్తలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకుల బెదిరింపులు, అక్రమ కేసులకు కార్యకర్తలు ఎవరూ అధైర్యపడాల్సిన అవసరం లేదని, బీఆర్ఎస్ పార్టీ నాయకత్వం ఎల్లప్పుడూ కార్యకర్తలకు అండగా ఉంటుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు అర్జెసి కృష్ణ, కూరాకుల నాగభూషణం, బచ్చు విజయ్‌కుమార్, మాజీ కార్పొరేటర్లు కర్నాటి కృష్ణ, పగడాల నాగరాజు, నాగండ్ల కోటేశ్వరరావు, శీలంశెట్టి వీరభద్రం, మాటేటి నాగేశ్వరరావు, ముగ్బుల్, దౌలే సాయి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధల మధ్య మహంకాళి అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ

- పూజల్లో పాల్గొన్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకురాలు కత్తి కార్తీక గౌడ్

ప్రజానావ, సిద్దిపేట: దుబ్బాక మున్సిపాలిటీ 1వ వార్డు మల్లాయిపల్లి పరిధిలోని శ్రీ మహంకాళి దేవాలయంలో విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా నిర్వహించారు. శుక్రవారం వేదమంత్రోచ్చారణల నడుమ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ, పూర్ణాహుతి కార్యక్రమాలను వైభవంగా నిర్వహించగా ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక వాతావరణంతో కళకళలాడింది. ఈ సందర్భంగా బీఆర్ఎస్ రాష్ట్ర నాయకురాలు కత్తి కార్తిక గౌడ్ ఆలయానికి విచ్చేసి శ్రీ మహంకాళి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాష్ట్ర ప్రజలు సుఖ శాంతులు, ఆయురారోగ్యాలతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించారు. అనంతరం ఆలయ అర్చకుల ఆశీర్వచనాలు స్వీకరించి భక్తులతో కలిసి మహోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కొత్త దేవి రెడ్డి, పర్శరాములు, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, భక్తులు, గ్రామస్తులు తదితరులు పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు. ఆలయ ప్రాంగణంలో భక్తుల రద్దీ నెలకొనగా మహోత్సవం భక్తి పారవశ్యంతో కొనసాగింది.



యాదాద్రిలో అమ్మవారి ఊంజల్ సేవోత్సవం

- పాంచరాత్ర ఆగమ శాస్త్రం ప్రకారం ప్రత్యేక పూజలు

ప్రజానావ, యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో శుక్రవారం ఆండాళ్ అమ్మవారి ఊంజల్ సేవోత్సవాన్ని భక్తిశ్రద్ధల మధ్య వైభవంగా నిర్వహించారు. పాంచరాత్ర ఆగమ శాస్త్రం ప్రకారం ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు, సేవా కార్యక్రమాలను నిర్వహించారు. సాయంత్రం వేళ ఆండాళ్ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి ఆలయ ప్రాంగణంలో ఊరేగింపుగా తీసుకువచ్చారు. ఈ సందర్భంగా మహిళా భక్తులు మంగళహారతులతో అమ్మవారికి ఘన స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారిని ప్రధాన ఆలయ మండపంలో అధిష్టింపజేసి సంప్రదాయబద్ధంగా ఊంజల్ సేవోత్సవాన్ని నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి దర్శనం చేసుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

జూపల్లి చెప్పిన లెక్కలు తప్పని నిరూపించాలి

ప్రజానావ, నాగర్‌కర్నూల్: గత పదేళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చేసిన అప్పుల వివరాలను అధికారిక ఆధారాలతో రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు వెల్లడించారని, వాటిని నిరూపించలేకపోతే మంత్రి పదవితో పాటు ఎమ్మెల్యే పదవికి కూడా రాజీనామా చేస్తానని స్పష్టంగా ప్రకటించారని నాగర్‌కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లు రవి, డీసీసీ అధ్యక్షుడు, అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ, స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్ రెడ్డి పేర్కొన్నారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ మంత్రి జూపల్లి చేసిన ప్రకటన అక్షర సత్యమని, ఆయన చూపిన లెక్కలు తప్పని నిరూపించాలని, లేకపోతే బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, శాసనసభ ఉపనేత హరీష్ రావు తమ పదవులకు రాజీనామా చేయడానికి సిద్ధం కావాలని డిమాండ్ చేశారు. మంత్రి జూపల్లి విసిరిన సవాల్‌కు సమాధానం చెప్పకుండా వ్యక్తిగత విమర్శలు చేస్తూ ప్రజలను తప్పుదారి పట్టించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రూ.8 లక్షల కోట్లకు పైగా అప్పులు చేశారని, వాటిపై ఆధారాలు చూపేందుకు సిద్ధంగా ఉన్నట్లు మంత్రి ప్రకటించినప్పటికీ ఆ అంశంపై స్పందించకుండా ఇతర విషయాలతో ప్రజలను మభ్య పెడుతున్నారని విమర్శించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేస్తూనే గతంలో చేసిన అప్పులు, వాటి వడ్డీ భారం మధ్య కూడా ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. రాష్ట్రంలో మూసీ ప్రక్షాళనతో పాటు పలు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నామని, గత బీఆర్ఎస్, ప్రస్తుత కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చేయని ఎన్నో పనులు జరుగుతున్నాయని అన్నారు. గత ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు 100 స్థానాలు వస్తాయని చెప్పినా ప్రజలు తిరస్కరించారని, లోక్‌సభ ఎన్నికల్లో కూడా ఆ పార్టీకి ఒక్క సీటు రాలేదని గుర్తుచేశారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీల అమలుపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. హరీష్ రావు ఎమ్మెల్యే కాకుండానే మంత్రి అయ్యారని, కేటీఆర్ కుటుంబ వారసత్వంతో ఎదిగారని, కానీ రేవంత్ రెడ్డి మాత్రం సామాన్య కుటుంబం నుంచి ప్రజల మద్దతుతో జడ్పీటీసీ స్థాయి నుంచి ముఖ్యమంత్రి స్థాయికి ఎదిగారని అన్నారు. డాక్టర్ వంశీకృష్ణ మాట్లాడుతూ మంత్రి జూపల్లి వెల్లడించినవి అధికారిక లెక్కలేనని, అప్పుల అంశాలను గతంలోనే అసెంబ్లీలో బహిర్గతం చేశారని గుర్తుచేశారు. పాలమూరుకు కేసీఆర్ ప్రభుత్వం చేసిందేమీ లేదని, కృష్ణా జలాల దోపిడీ కూడా గత ప్రభుత్వ హయాంలోనే అధికంగా జరిగిందని ఆరోపించారు. పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టు ద్వారా ఒక్క ఎకరానికి నీరు ఇచ్చినట్లు నిరూపిస్తే పాలమూరు జిల్లాకు చెందిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలంతా రాజీనామా చేస్తామని ప్రకటించారు. నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్ రెడ్డి మాట్లాడుతూ నార్లాపూర్ ప్రాజెక్టు ద్వారా కూడా ఒక్క ఎకరానికి నీరు అందలేదని, పూర్తి కాని ప్రాజెక్టును ప్రారంభించి అప్పట్లో ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేశారని విమర్శించారు. ఇదిలా ఉండగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన రాజకీయ ప్రస్థానానికి 20 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా తాను జడ్పీటీసీగా ప్రాతినిధ్యం వహించిన మిడ్జిల్‌కు శనివారం రానున్నట్లు వెల్లడించారు. ఈ సమావేశంలో డీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ తీగల సురేంద్ర, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు జక్కరాజు, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు వంకేశ్వరం నిరంజన్, జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు వినోద్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు పరిశోధనల వైపు అడుగులు వేయాలి

- ప్రొఫెసర్ చంద్రశేఖర్ శర్మ
- అస్త్ర–2.0 జాతీయ స్థాయి ఆవిష్కరణల పోటీలు ప్రారంభం

ప్రజానావ, సంగారెడ్డి: మెదక్ జిల్లా నర్సాపూర్‌లోని బీవీఆర్ ఐటీ కళాశాలలో కెమికల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అస్త్ర–2.0 జాతీయ స్థాయి ఇంజనీరింగ్ సృజనాత్మకత, ఆవిష్కరణల పోటీలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన చంద్రశేఖర్ శర్మ మాట్లాడుతూ విద్యార్థులు తరగతి గదిలో నేర్చుకున్న జ్ఞానాన్ని ప్రాక్టికల్ ఇన్నోవేషన్‌గా మలచాల్సిన అవసరం ఉందన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటా సైన్స్, మెషిన్ లెర్నింగ్ వంటి ఆధునిక సాంకేతికతలను అందిపుచ్చుకొని పరిశోధనల వైపు అడుగులు వేయాలని సూచించారు. యువ ఆవిష్కర్తలకు ఐఐటీ హైదరాబాద్ ఎల్లప్పుడూ సహకారం అందించేందుకు సిద్ధంగా ఉంటుందని తెలిపారు. తరగతి గదిలోని సైద్ధాంతిక విజ్ఞానాన్ని ప్రాయోగిక ఇంజనీరింగ్ ఆవిష్కరణలుగా మార్చేందుకు ఈ కార్యక్రమం అద్భుత వేదికగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఐఐసీహెచ్ఈ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు, జేఎన్‌టీయూ అనంతపురం రిటైర్డ్ ప్రొఫెసర్ ఎ.వి.ఎన్. స్వామి మాట్లాడుతూ విద్యార్థుల్లో సృజనాత్మకత, సాంకేతిక నైపుణ్యం, పరిశోధన దృక్పథం, ఆవిష్కరణ సామర్థ్యం, టీమ్‌వర్క్‌ను పెంపొందించే జాతీయ స్థాయి వేదికగా ఈ కార్యక్రమం నిలుస్తుందని తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ డా. సంజయ్ దూబే మాట్లాడుతూ కెమికల్ ఇంజనీరింగ్ విద్యార్థులకు అవసరమైన జాతీయ స్థాయి పోటీలను తమ కళాశాలలో నిరంతరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కళాశాల డైరెక్టర్ డా. కె. లక్ష్మి ప్రసాద్ మాట్లాడుతూ కెమికల్ ఇంజనీరింగ్ విభాగం విద్యార్థుల ఆవిష్కరణలకు ప్రోత్సాహం అందిస్తూ జాతీయ స్థాయిలో గుర్తింపు పొందడం అభినందనీయమన్నారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో కెమికల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డా. జి.బి. రాధిక మాట్లాడుతూ కెమ్–ఇ–కార్ భావన ఆవిర్భావం, దాని ప్రాముఖ్యతను వివరించారు. అలాగే శ్రీ విష్ణు ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్ కె.వి. విష్ణు రాజు ప్రోత్సాహంతో ఈ కార్యక్రమం ప్రతి ఏడాది మరింత ఉన్నత స్థాయికి చేరుకుంటోందని తెలిపారు. ఈ పోటీల ప్రధాన ఆకర్షణలుగా రియాక్ట్–ఓ–కార్, టెక్–ఓ–కార్, క్యూబ్–ఎక్స్ పోటీలు నిలిచాయి. రియాక్ట్–ఓ–కార్ పోటీలో రసాయన, ఎలక్ట్రోకెమికల్ ప్రతిచర్యల ఆధారంగా పనిచేసే మోడల్ కార్లను రూపొందించగా, టెక్–ఓ–కార్ పోటీలో మెకానికల్, ఎలక్ట్రానిక్ సాంకేతికతల సమన్వయంతో వినూత్న కార్ల రూపకల్పన చేశారు. క్యూబ్–ఎక్స్ పోటీలో ఒక క్యూబిక్ ఫుట్ పరిమితిలో నీటి శుద్ధి, కార్బన్ డయాక్సైడ్ క్యాప్చర్ వంటి వాస్తవ సమస్యలకు విద్యార్థులు వినూత్న పరిష్కారాలను ప్రదర్శించారు.

బెల్ట్ షాప్‌పై టాస్క్‌ఫోర్స్ ఆకస్మిక దాడి

- 13.89 లీటర్ల అక్రమ మద్యం స్వాధీనం.. ఒకరిపై కేసు నమోదు

ప్రజానావ, సిద్దిపేట: కుకునూరుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని చిన్నకిష్టాపూర్ గ్రామంలో నిర్వహిస్తున్న బెల్ట్ షాప్‌పై సిద్దిపేట టాస్క్‌ఫోర్స్ బృందం, కుకునూరుపల్లి పోలీసులతో కలిసి ఆకస్మిక దాడి నిర్వహించింది. నమ్మదగిన సమాచారం మేరకు చేపట్టిన ఈ దాడిలో అక్రమంగా విక్రయిస్తున్న మొత్తం 13.89 లీటర్ల మద్యాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో చిన్నకిష్టాపూర్ గ్రామానికి చెందిన పాపగోని వెంకట్ గౌడ్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. అనంతరం స్వాధీనం చేసుకున్న మద్యం, నిందితుడిని కుకునూరుపల్లి పోలీసులకు అప్పగించారు. ఈ విషయాన్ని బాలకృష్ణ ఒక ప్రకటనలో వెల్లడించారు. ఈ ఘటనపై చట్టపరమైన కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు. గ్రామాల్లో అక్రమంగా బెల్ట్ షాపులు నిర్వహించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు తమ ప్రాంతాల్లో ఎలాంటి అక్రమ లేదా చట్టవ్యతిరేక కార్యకలాపాలు గమనించిన వెంటనే డయల్–100 లేదా టాస్క్‌ఫోర్స్ మొబైల్ నంబర్ 8712667447కు సమాచారం అందించాలని కోరారు.

Singareni news

ఆర్జీ–2లో అధికారుల ఆందోళనలు

5వ రోజుకు రిలే నిరాహార దీక్షలు

ప్రజానావ, రామగుండం: అధికారుల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ఆర్జీ–2 పరిధిలో చేపట్టిన ఆందోళన కార్యక్రమాలు రోజురోజుకూ ఉధృతమవుతున్నాయి. ఆర్జీ–2 జీఎం కార్యాలయం ఎదుట నిర్వహిస్తున్న అధికారుల రిలే నిరాహార దీక్షలు శుక్రవారం నాటికి ఐదో రోజుకు చేరుకున్నాయి. ఉదయం 8.30 గంటల నుంచే అధికారులు దీక్షా కార్యక్రమాన్ని ప్రారంభించి తమ డిమాండ్ల సాధన కోసం పోరాటాన్ని కొనసాగించారు. ప్రధానంగా అధికారుల జీతాల అప్‌డేషన్ ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలని, అలాగే జీతంలో భాగమైన పీఆర్పీ చెల్లింపులను ఆలస్యం చేయకుండా విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నిరసన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. తమ హక్కులను సాధించుకునే వరకు వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని అధికారులు స్పష్టం చేశారు. శుక్రవారం నిర్వహించిన రిలే నిరాహార దీక్షల్లో మహిళా అధికారులు పాల్గొని తమ నిరసనను వ్యక్తం చేశారు. దీక్షలో ఎన్. శిరీష డిప్యూటీ ఎఫ్ఎం (ఎఫ్ అండ్ ఏ), ఎన్. రక్షిత సీనియర్ అండర్ మేనేజర్, బి. జీవన్మయి సీనియర్ అండర్ మేనేజర్, బి. సోనియా ఈఈ (సివిల్), టి. హిమవర్ష ఏఓ (ఎఫ్ అండ్ ఏ) పాల్గొన్నారు. ఇదిలా ఉండగా, శుక్రవారం జరిగిన దీక్షా కార్యక్రమానికి ప్రత్యేకత కూడా చోటుచేసుకుంది. ఆర్జీ–2 ఏరియా అధికారుల కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి దీక్షలో కూర్చున్న అధికారులకు పూర్తి మద్దతు ప్రకటిస్తూ సంఘీభావం తెలిపారు. కుటుంబ సభ్యుల మద్దతుతో అధికారుల పోరాట పటిమ మరింత రెట్టింపు అయిందని, తమ డిమాండ్లు నెరవేరే వరకు ఈ పోరాటాన్ని ఇదే స్థాయిలో కొనసాగిస్తామని అధికారుల ప్రతినిధులు పేర్కొన్నారు.

1,3 గనుల్లో భద్రతపై ప్రత్యేక అవగాహన సదస్సు

- అత్యవసర పరిస్థితుల్లో తీసుకోవాల్సిన చర్యలపై శిక్షణ
- సీపీఆర్, అగ్నిమాపక పరికరాల వినియోగంపై ప్రత్యక్ష ప్రదర్శనలు

ప్రజానావ, రామగుండం: జీడీకే–1,3 ఇంక్లైన్ గనుల్లో కార్మికుల్లో భద్రతా అవగాహన పెంపొందించే లక్ష్యంతో శుక్రవారం రెస్క్యూ సిబ్బంది ఆధ్వర్యంలో ప్రత్యేక భద్రతా అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా భూగర్భ గనుల్లో సంభవించే అత్యవసర పరిస్థితులు, గ్యాస్, విషవాయువుల లీకేజీలు, విద్యుత్ ప్రమాదాలు, గుండె సంబంధిత అత్యవసర పరిస్థితుల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కార్మికులకు అవగాహన కల్పించారు. అలాగే అగ్నిమాపక పరికరాల వినియోగంపై ప్రత్యక్ష ప్రదర్శన నిర్వహించి, మండుతున్న మంటలను అగ్నిమాపక పరికరంతో ఎలా అదుపులోకి తీసుకురావాలనే అంశాన్ని ఆచరణాత్మకంగా చూపించారు. అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు అనుసరించాల్సిన జాగ్రత్తలు, భద్రతా చర్యల గురించి రెస్క్యూ బృందం వివరించింది. ఇలాంటి అవగాహన కార్యక్రమాలు గనుల్లో పని చేసే కార్మికుల్లో భద్రతా స్పృహను మరింత పెంచడంతో పాటు అత్యవసర పరిస్థితుల్లో సరైన నిర్ణయాలు తీసుకునేందుకు దోహదపడతాయని పేర్కొన్నారు. ప్రత్యేకంగా అత్యవసర పరిస్థితుల్లో ప్రాణాలను కాపాడేందుకు ఉపయోగపడే సీపీఆర్ విధానాన్ని డమ్మీ మానవ నమూనా (మ్యానికిన్) సహాయంతో ప్రత్యక్షంగా ప్రదర్శించి శిక్షణ ఇచ్చారు. ప్రమాదం జరిగిన వెంటనే సరైన ప్రథమ చికిత్స అందించడం ద్వారా ప్రాణాలను రక్షించవచ్చని రెస్క్యూ నిపుణులు వివరించారు. అనంతరం గనుల భద్రత, ప్రమాదాల నివారణ, సురక్షిత విధానాల పాటింపుపై కార్మికులతో రక్షణ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో జీడీకే–1,3 ఇంక్లైన్ మేనేజర్ సుధీర్ జక్కుల్‌వార్, సేఫ్టీ ఆఫీసర్ జి. మహేష్, నూతి శ్రీనివాస్, వెంటిలేషన్ అధికారి, పిట్ ఇంజనీర్ శేఖర్, సూపర్‌వైజర్లు, రెస్క్యూ సిబ్బంది, కార్మికులు పాల్గొన్నారు.

మెడికల్ అన్‌ఫిట్ కార్మికులకు సూటబుల్ జాబ్ దిశగా ముందడుగు

ప్రజానావ, రామగుండం: సింగరేణి అండర్‌గ్రౌండ్ గనుల్లో పనిచేస్తూ అనారోగ్య కారణాలతో మెడికల్ అన్‌ఫిట్‌గా మారి ప్రస్తుతం సర్ఫేస్‌లో జనరల్ అసిస్టెంట్‌లుగా విధులు నిర్వహిస్తున్న మైనింగ్ స్టాఫ్, ఈ అండ్ ఎం సూపర్‌వైజర్లు, ట్రేడ్స్‌మెన్‌లకు సూటబుల్ జాబ్ కల్పించాలంటూ గుర్తింపు సంఘం ఏఐటియుసి చేపట్టిన పోరాటానికి యాజమాన్యం సానుకూలంగా స్పందించిందని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటియుసి) ఆర్జీ–1 బ్రాంచి కార్యదర్శి రంగు శ్రీను తెలిపారు. కార్మికుల పెండింగ్ సమస్యల పరిష్కారం కోసం ఏఐటియుసి పట్టుదల తో జూన్ 8న ఇచ్చిన సమ్మె నోటీసులో ఈ అంశాన్ని ప్రధాన డిమాండ్‌గా చేర్చినట్లు పేర్కొన్నారు. ఈ అంశంపై జూన్ 25న హైదరాబాద్‌లో అసిస్టెంట్ లేబర్ కమిషనర్ సమక్షంలో జరిగిన చర్చల్లో జూలై 10లోపు సమ్మె డిమాండ్ల పరిష్కారంపై యాజమాన్యం, యూని యన్ పరస్పరం చర్చించుకోవాలని సూచించారని తెలిపారు. ఈ నేపథ్యంలో యాజమాన్యం జూలై 6న కొత్తగూడెం మెయిన్ హాస్పిటల్‌లో సంబంధిత కార్మికులు వైద్య పరీక్షలకు హాజరు కావాలని ఆదేశాలు జారీ చేసిందన్నారు. వైద్య పరీక్షల అనంతరం అర్హత సాధించిన వారికి సూటబుల్ జాబ్ కేటాయింపు ప్రక్రియ ప్రారంభమయ్యే అవకాశముం దని తెలిపారు. స్ట్రక్చర్ సమావేశంలో యాజమాన్యం ఈ అంశాన్ని అంగీకరించినప్పటికీ అమలులోకి తీసుకురా కుండా పెండింగ్‌లో ఉంచిందని, యూనియన్ సమ్మె నోటీసు అనంతరం లేబర్ కమిషనర్ జోక్యంతోనే వైద్య పరీక్షల ఆదేశాలు వెలువడ్డాయని పేర్కొన్నారు. మెడికల్ పరీక్షల అనంతరం సూటబుల్ పోస్టుల్లో నియామ కాలు చేపట్టే అవకాశం ఉందని ఆయన వెల్లడించారు. ఏఐటియుసి పోరాట ఫలితం గానే ఈ ప్రక్రియ ముందుకు సాగుతోందని, జూలై 6న నిర్వహించే వైద్య పరీక్షలకు సంబంధిత కార్మికులు తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు. కార్మికులకు సూటబు ల్ జాబ్‌లు కేటాయించే వరకు ఏఐటియుసి పోరాటం కొనసాగుతుందని, కార్మిక వర్గం ఈ విజయాన్ని గుర్తించాలని రంగు శ్రీను పేర్కొన్నారు.

ఆన్‌లైన్ అనుమతులతో లభ్యం కాని ఇసుక

- లాగిన్ కాక ఇబ్బందులలో భవన నిర్మాణ కార్మికులు
- మీడియా సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి రాములు

ప్రజానావ, సిరిసిల్ల : ఇసుక సరఫరా లో ఆన్లైన్ అనుమతుల వల్ల లాగిన్ కావడంలో భవన నిర్మాణ కార్మికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఏఐటియుసి భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి రాములు ఆందోళన వ్యక్తం చేశారు. శుక్రవారం సిరిసిల్ల సుభాష్ నగర్ లోని కార్మిక సంఘ భవనంలో జరిగిన మీడియా సమావేశంలో కడారి రాములు మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను గతంలో జిల్లా కలెక్టర్, ఎమ్మార్వో వినతులు చేసినప్పటికీ ఆన్లైన్ తీసుకొచ్చి ఇసుక అనుమతులు ఇస్తున్నామని చాలాన్లు చెల్లించిన డిడీలకు కొత్త కార్యదర్శులకు అప్పగించినందున వారి యాప్ లలో ఇష్కకు లాగిన్ అవుతలేదని అన్నారు. కార్మికులకు వర్షాలు పడి వాగు వచ్చినట్టు అయితే ఇసుక దొరకలేని పరిస్థితి ఉంటుందని వెల్లడించారు. అనుమతులు ఇవ్వని పక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ఈ సందర్భంగా హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు బొల్లె బాబు, కొలెపాక వినోద్ తదితరి కార్మిక సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఆపరేషన్ ముస్కాన్–12 విజయవంతం చేయాలి

- 31వ తేదీ వరకు కార్యక్రమాలు
- జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్
- ఆపరేషన్ ముస్కాన్‌పై వివిధ శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష

ప్రజానావ, సిరిసిల్ల : జిల్లాలో ఆపరేషన్ ముస్కాన్ 12 విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. ఆపరేషన్ ముస్కాన్ 12 పై జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో వివిధ శాఖల అధికారులతో సమన్వయ సమావేశం శుక్రవారం జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సమీక్ష నిర్వహించారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. తప్పిపోయిన, పారిపోయిన పిల్లలు బాల కార్మికులుగా మారిన వారిని సంరక్షించి వారి స్వస్థలాలకు చేర్చేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల ప్రకారం ప్రతి సంవత్సరం జనవరి, జూలై నెలల్లో ఆపరేషన్ ముస్కాన్ పేరుతో ప్రతి సంవత్సరం నిర్వహిస్తున్నాయని తెలిపారు. ఇందులో భాగంగా ఈ నెల 1 వ తేదీ నుంచి 31వ తేదీ వరకు జిల్లాలో ఈ కార్య క్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. తప్పిపోయిన, పారిపోయిన పిల్లల్ని వెతికి పట్టుకునేందుకు ప్రభుత్వం నిర్దేశించిన దర్పన్ యాప్ ను వినియోగించాలని సూచించారు. అలాగే ప్రతి పోలీస్ స్టేషన్ నుండి మిస్సింగ్ చిల్డ్రన్ సంబంధిత సమాచారం తీసుకుని అన్ని విభాగాలు సమన్వయంతో వారిని గుర్తించేందుకు చేరదీసేందుకు కృషి చేయాలని తెలిపారు. అలాగే ఇటుక బట్టీలు, బేకరీ షాపులు, మెకానిక్ షాప్ లు, ఇండ్ల నిర్మాణ పనులు, వ్యవసాయ పనులు, ఇతర పనుల్లో బాల కార్మికుల తో పని చేయించుకోవడం నేరమని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా బాల కార్మికులను పనిలో పెట్టుకునే యజమానులపై కఠినంగా వ్యవహరించాల ని, ఎఫ్ఐఆర్ నమోదు చేసి విచారించాలని సూచించారు. అలాగే బాల కార్మికులుగా మారిన పిల్లలను వారి తల్లిదండ్రులకు అప్పగిస్తూ వారికి కౌన్సిలింగ్ చేయాలని తెలిపారు. ఆలయాల ప్రాంతంలో భిక్షాటన చేసే పిల్లలను ఖాళీగా తిరుగుతూ మత్తు పదార్థాలకు అలవాటు పడే పిల్లలను గుర్తించాలని సూచించారు. వారిని రెసిడెన్షియల్ విద్యాలయాల్లో చేర్పించాలని పేర్కొన్నారు. పిల్లల యొక్క బంగారు భవిష్యత్తు కోసం కౌన్సెలింగ్ నిర్వహించి విద్యారంగం వైపు వెళ్లేలా చూడాలని తెలిపారు. ఒకవేళ విద్య పట్ల ఆసక్తి లేకపోతే ఏదైనా శిక్షణ కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేయించాలని, ఐటీఐ ఏటీసీ పాలిటెక్నిక్, న్యాక్ లాంటి సంస్థల సేవలను వినియోగించుకోవాలని సూచించారు. బస్ స్టేషన్, బస్సులలో ఎవరైనా అనాథ పిల్లలు, మహిళలు కనపడితే 1098 లేదా181కు కాల్ చేయాలని రవాణా శాఖ ఆర్టీసీ డిపో మేనేజర్లకు, అందరూ ఆర్టీసీ సిబ్బందికి సూచించాలని తెలిపారు.జిల్లా సంక్షేమ శాఖ, వైద్య ఆరోగ్య శాఖ, పోలీస్ శాఖ, మున్సిపల్, దేవాదాయ శాఖ, స్వయం సహాయక సంఘాలు సమన్వయంతో పిల్లల సమాచారాన్ని అందించాలని వారి భవిష్యత్తు కోసం సహకరించాలని సూచించారు. బాల కార్మిక చట్టం అమలు కోసం లేబర్ ఆఫీసర్ తప్పనిసరిగా అన్ని ఎస్టాబ్లిష్మెంట్లను తనిఖీ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ చంద్రయ్య, జిల్లా రెవెన్యూ అధికారి జయశ్రీ, జిల్లా సంక్షేమ అధికారి పీ లక్ష్మి రాజం, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ అంజయ్య, సభ్యులు ఖాజా, ఐసీపీఎస్ మిషన్ వాత్సల్య సిబ్బంది కవిత, అంజయ్య గగన్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరా మెరుగుదలకు ప్రత్యేక చర్యలు

- పలు అభివృద్ధి పనుల ప్రారంభం
- క్షేత్రస్థాయి అధికారులతో సమీక్షా సమావేశం
- రాజన్న సిరిసిల్ల జిల్లాలో టీజీఎన్‌పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి విస్తృత పర్యటన

ప్రజానావ, సిరిసిల్ల : సిరిసిల్ల జిల్లాలో వినియోగదారులకు నాణ్యమైన, నిరంతర, భద్రతాయుత విద్యుత్ సరఫరా అందించడమే టీజీఎన్‌పీడీసీఎల్ ప్రధాన లక్ష్యమని, అందుకోసం అవసరమైన అన్ని మౌలిక వసతుల అభివృద్ధి పనులు వేగవంతంగా కొనసాగుతాయని సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి స్పష్టం చేశారు. సిరిసిల్ల సర్కిల్ పరిధిలో గత ఏప్రిల్ 1, 2026 నుండి ఇప్పటివరకు చేపట్టిన విద్యుత్ అభివృద్ధి కార్యక్రమాలను తెలంగాణ ఉత్తర ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్ రెడ్డి వివరించారు. శుక్రవారం రాజన్న సిరిసిల్ల జిల్లాలో విస్తృతంగా పర్యటించారు. జిల్లాలో విద్యుత్ రంగానికి సంబంధించిన పలు అభివృద్ధి పనులను పరిశీలించి, వాటిని ప్రారంభించడంతో పాటు అధికారులతో కీలక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ జిల్లాలో విద్యుత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని 13 కొత్త సబ్‌స్టేషన్లకు అనుమతులు మంజూరు చేయగా, అందులో 2 సబ్‌స్టేషన్ల నిర్మాణ పనులు ప్రస్తుతం పురోగతిలో ఉన్నాయని తెలిపారు. వీటి ద్వారా భవిష్యత్తులో లోడ్ పంపిణీ సులభతరం కావడంతో పాటు, విద్యుత్ సరఫరాలో నాణ్యత పెరుగుతుందని పేర్కొన్నారు. అలాగే విద్యుత్ అంతరాయాలను తగ్గించేందుకు, ఫీడర్ల సామర్థ్యాన్ని పెంచేందుకు జిల్లాకు 19 బంచ్డ్ బ్రేకర్లు మంజూరు చేయగా, వాటిలో 15 ఇప్పటికే పూర్తిచేసి సేవల్లోకి తీసుకువచ్చినట్లు సీఎండీ వివరించారు. మిగిలిన పనులను కూడా వేగంగా పూర్తి చేసి వినియోగదారులకు మరింత మెరుగైన సేవలు అందించేలా చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. వ్యవసాయ రంగానికి ప్రాధాన్యతనిస్తూ, రైతులకు యూనిఫాం సర్వీస్ లైన్ ఛార్జీలతో కొత్త వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు అందిస్తున్నట్లు తెలిపారు. దీని ద్వారా రైతులకు పారదర్శకమైన, సులభమైన విధానంలో కనెక్షన్లు అందేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో విద్యుత్ లైన్ల భద్రత, నిలకడైన సరఫరా కోసం మధ్యస్థంభాలు అధిక సంఖ్యలో ఏర్పాటు చేయడం, దెబ్బతిన్న విద్యుత్ స్తంభాల మార్పిడి పనులు పెద్ద ఎత్తున పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. దీని వల్ల లైన్ల స్థిరత్వం పెరిగి, ప్రమాదాల అవకాశాలు తగ్గడంతో పాటు విద్యుత్ అంతరాయాలు కూడా తగ్గుతాయని తెలిపారు. వినియోగదారుల అవసరాలకు అనుగుణంగా ట్రాన్స్‌ఫార్మర్ సామర్థ్యాన్ని పెంచేందుకు ఇంప్రూవ్‌మెంట్ డీటీఆర్‌లు కూడా పెద్ద సంఖ్యలో ఫీల్డ్‌లో ఏర్పాటు చేసినట్లు చెప్పారు. లోడ్ అధికంగా ఉన్న ప్రాంతాల్లో వీటి ఏర్పాటు వల్ల వోల్టేజ్ సమస్యలు తగ్గి, విద్యుత్ సరఫరా మరింత మెరుగుపడుతుందని వెల్లడించారు. అలాగే జిల్లాలో విద్యుత్ పంపిణీ వ్యవస్థను మరింత బలోపేతం చేయడానికి 33 కేవీ ఇంటర్‌లింక్ లైన్ల పనులు విస్తృత స్థాయిలో చేపట్టినట్లు సీఎండీ తెలిపారు. ఈ లైన్లు పూర్తి అయితే ప్రత్యామ్నాయ సరఫరా మార్గాలు అందుబాటులోకి వచ్చి, ఏదైనా లోపం వచ్చినా వినియోగదారులకు నిరంతర విద్యుత్ సరఫరా అందించేందుకు ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు. విద్యుత్ సరఫరా, ఫిర్యాదులు, అత్యవసర సేవలు, లోపాల సమాచారం కోసం 1912 కాల్ సెంటర్ సేవలను వినియోగించు కోవాలని కోరారు. ప్రతి పని ప్రారంభించే ముందు ప్రమాదాలను అంచనా వేసి, అవసరమైన భద్రతా చర్యలు తీసుకోవడం ద్వారా ప్రమాదాలను పూర్తిగా నివారించవచ్చని వివరించారు. క్షేత్రస్థాయిలో విధులు నిర్వహించే సిబ్బంది తప్పనిసరిగా భద్రతా ప్రమాణాలు పాటించాలని చెప్పారు. భద్రతకు అత్యున్నత ప్రాధాన్యం ఇవ్వాలని అన్నారు. విద్యుత్ సరఫరాలో సాంకేతిక లోపాలను అరికట్టేందుకు మర్రిపల్లి సబ్‌స్టేషన్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన బంచ్డ్ బ్రేకర్ ను సీఎండీ ప్రారంభించారు. సీఎండీ వెంట సిరిసిల్ల సూపెరింటెండింగ్ ఇంజనీర్ టి. వేణుమాధవ్, డిఈ వేములవాడ వెంకట రమణ, డిఈ సిరిసిల్ల ఎన్ అంజయ్య, డిఈ చంద్రమౌళి, ఏడీఈ ఏఈలు తదితరులు పాల్గొన్నారు.

జీవో–17 రద్దు చేయాలని బీఆర్ఎస్ ఆందోళన

- పెద్దపల్లిలో నిరసన, పలువురు నేతల అరెస్ట్

ప్రజానావ, పెద్దపల్లి: రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నంబర్–17 చిన్న తరహా కాంట్రాక్టర్ల జీవనోపాధిపై తీవ్ర ప్రభావం చూపుతోందని, వెంటనే ఆ జీవోను రద్దు చేయాలని పెద్దపల్లి నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకురాలు దాసరి ఉష డిమాండ్ చేశారు. ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ శుక్రవారం బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి పెద్దపల్లి లోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి అనంతరం అక్కడే ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా దాసరి ఉష మాట్లాడుతూ తెలంగాణలోని గురుకుల విద్యాసంస్థల్లో చదువుతున్న లక్షలాది మంది విద్యార్థుల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు దయనీయంగా ఉందని, ఇది ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని విమర్శించారు. పాఠశాలలు ప్రారంభమై 20 రోజులు గడిచినా ఇప్పటికీ విద్యార్థులకు కనీసం దుస్తులు, నోట్‌బుక్కులు అందకపోవడం దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్తున్న మాజీ ఐపీఎస్ అధికారి, బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌ను ఉద్దేశపూర్వకంగా లక్ష్యంగా చేసుకున్నారని ఆరోపించారు. ఫోన్ ట్యాపింగ్, ఫార్ములా–ఈ, పోక్సో వంటి అంశాల్లో ప్రభుత్వం విమర్శలు ఎదుర్కొంటున్న సమయంలో ప్రజల దృష్టి మళ్లించేందుకే ఆయన భద్రతను కుదించారని విమర్శించారు. అంతేకాకుండా ఆయన సతీమణి లక్ష్మీ భాయిని ప్రాధాన్యత లేని పోస్టుకు బదిలీ చేయడం కూడా రాజకీయ కక్షసాధింపులో భాగమేనని ఆరోపించారు. జీవో–17పై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసిన ఆమె, గత 15 ఏళ్లుగా గురుకుల పాఠశాలలకు నిత్యావసర వస్తువులు సరఫరా చేస్తూ నెలకు రూ.10 వేల నుంచి రూ.20 వేల వరకు ఆదాయంతో జీవనం సాగిస్తున్న వేలాది మంది చిన్న కాంట్రాక్టర్లను ప్రభుత్వం ఒక్కసారిగా ఉపాధి కోల్పోయే పరిస్థితికి నెట్టిందని ఆవేదన వ్యక్తం చేశారు. చిన్న కాంట్రాక్టర్లు టెండర్లలో పాల్గొనకుండా కార్పొరేట్ సంస్థలకు మాత్రమే లబ్ధి చేకూరేలా ప్రభుత్వం వ్యవహరిస్తోందని విమర్శించారు. జీవో–17 అమలుతో రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 10 వేల మంది చిన్న తరహా కాంట్రాక్టర్లు ఉపాధి కోల్పోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. చిన్న కాంట్రాక్టర్ల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని జీవో–17ను తక్షణమే రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం కక్షసాధింపు రాజకీయాలకు, రేవంత్ రెడ్డి ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు పెద్దఎత్తున నిరసన చేపట్టారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు జోక్యం చేసుకుని దాసరి ఉషతో పాటు పలువురు బీఆర్ఎస్ కార్యకర్తలను అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ కార్యక్రమంలో బీరం రవి, బండ నిఖిల్, అజీమ్, కన్నం శ్రావణ్, శంకర్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

సందేహాల నివృత్తికి సహాయ కేంద్రం ఏర్పాటు

- పెద్దపల్లి ఆర్టీవో గంగయ్య

ప్రజానావ, పెద్దపల్లి : కేంద్ర ఎన్నికల సంఘం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఎస్.ఐ.ఆర్ (స్పెషల్ సమ్మరీ రివిజన్) ప్రక్రియలో భాగంగా ఓటర్ల సౌకర్యార్థం పెద్దపల్లి మున్సిపల్ కార్యాల యంలో ప్రత్యేక సహాయ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు పెద్దపల్లి ఆర్డీవో గంగయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణ పరిధి లోని ఓటర్లు తమ ఓటుకు సంబంధించిన వివరాల ను, అలాగే తమ ప్రాంత బూత్ లెవెల్ అధికారుల సమాచారాన్ని ఈ కేంద్రం ద్వారా తెలుసుకోవచ్చని సూచించారు. ఓటర్లు తమ ఓటర్ ఐడీ కార్డు లేదా ఎపిక్ నంబర్‌తో మున్సిపల్ కార్యాలయంలోని సహాయ కేంద్రాన్ని సంప్రదిస్తే, సిబ్బంది వారికి కావలసిన పూర్తి సమాచారాన్ని అందిస్తారని ఆయన స్పష్టం చేశారు. ఈ సహాయ కేంద్రం ఏర్పాటుకు పూర్తి స్థాయిలో సహకరించిన గౌరవ మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేష్‌కి ఆర్డీవో గంగయ్య ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేష్ మాట్లాడుతూ పట్టణ ఓటర్లందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవోతో పాటు మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేష్, మున్సిపల్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వర్షాకాల రక్షణ చర్యలపై ప్రత్యేక కార్యాచరణ

అధికారులకు జీడబ్ల్యూఎంసీ కమిషనర్ వెంకన్న ఆదేశాలు

ప్రజానావ, వరంగల్ : వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని నగరంలో ప్రజల ప్రాణ, ఆస్తి రక్షణకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని, ప్రమాదకర భవనాలను గుర్తించి తక్షణ చర్యలు చేపట్టాలని, వ్యాపార సంస్థలు తప్పనిసరిగా ఫైర్ సేఫ్టీ నిబంధనలను అమలు చేయాలని జీడబ్ల్యూఎంసీ కమిషనర్ టి. వెంకన్న అధికారులను ఆదేశించారు. శుక్రవారం జీడబ్ల్యూఎంసీ ప్రధాన కార్యాలయంలో డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (డీఆర్ఎఫ్), టౌన్ ప్లానింగ్, ఇంజినీరింగ్ విభాగాల ఉన్నతాధికారులతో నిర్వహించిన సమన్వయ సమావేశంలో కమిషనర్ వర్షాకాలంలో చేపట్టాల్సిన ముందస్తు రక్షణ చర్యలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో శిథిలావస్థకు చేరిన భవనాలు, ప్రమాదకర నిర్మాణాలను ప్రత్యేకంగా గుర్తించి వెంటనే యజమానులకు నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. ప్రజల భద్రతకు ముప్పుగా ఉన్న భవనాల విషయంలో చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు అవసరమైతే వాటిని ఖాళీ చేయించడం లేదా తొలగించే చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కమిషనర్ జోనా, సూపరింటెండింగ్ ఇంజినీర్ రాజ్‌కుమార్, ఇన్‌చార్జి సిటీ ప్లానర్ రవీందర్ రాడేకర్, డీఎఫ్‌వో శంకర్ లింగం, ఎస్ఎఫ్‌వో రాజేశ్వర్ రావు, సీనియర్ అసిస్టెంట్ విజయ్‌కుమార్, డీఆర్ఎఫ్ అధికారులు, టౌన్ ప్లానింగ్, ఇంజినీరింగ్ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

రాజు గోండుల కోటను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలి

- ఆధునిక మ్యూజియం, మౌలిక వసతుల కల్పనపై కలెక్టర్ రాజర్షిషా ఆదేశాలు

ప్రజానావ, ఆదిలాబాద్: పర్యాటకులను ఆకర్షించేలా చారిత్రక రాజు గోండుల కోట పునరుద్ధరణ పనులను వేగవంతం చేసి, దేశంలోనే ప్రముఖ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా స్పష్టం చేశారు. శుక్రవారం ఉట్నూర్ మండల కేంద్రంలోని చారిత్రక రాజు గోండుల కోటను సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ ప్రాజెక్టు అధికారి మంద మకరంద్తో కలిసి ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా అధికారులతో కలిసి కోట పరిసర ప్రాంతాలను క్షుణ్ణంగా పరిశీలించి చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై చర్చించారు. అనంతరం ఐటిడిఏ కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ గోండు రాజుల చరిత్రకు, గిరిజన సంస్కృతికి ప్రతీకగా నిలిచిన రాజు గోండుల కోటను త్వరితగతిన పునర్నిర్మించాలని ఆదేశించారు. ఆధునిక సౌకర్యాల తో దేశవ్యాప్తంగా పర్యాటకులను ఆకర్షించే విధంగా దీనిని అభివృద్ధి చేయాలని సంబంధిత శాఖల అధికారులను సూచించారు. కోట పునర్నిర్మాణ పనుల్లో చారిత్రకతకు ఎక్కడా భంగం కలగకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని స్పష్టం చేశారు. భావితరాలకు గిరిజనుల గొప్ప చరిత్రను తెలియజేసేలా కోటలో అత్యాధునిక మ్యూజియం ఏర్పాటు చేయాల ని సూచించారు. మ్యూజియంలో గోండు రాజుల వంశ చరిత్ర, వారి పాలన, సంస్కృతి, సంప్రదాయా లు, వారసత్వ ఆనవాళ్లు, పురాతన వస్తువులు, చారిత్రక ఆధారాలను ప్రతిబింబించేలా ఏర్పాట్లు చేయాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి మాట్లాడుతూ రాజు గోండుల కోటను సుందరీకరించి దేశవ్యాప్తంగా గుర్తింపు పొందే పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి త్వరితగతిన కార్యాచరణ చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్ర మంలో ఆర్కియాలజీ డైరెక్టర్ అర్జున్ రావు, అదనపు డైరెక్టర్ నరసింహులు, డీడీ సాగర్, ఓఎస్డీ రాజు, పర్యాటక శాఖ అధికారి రవికుమార్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ తానాజీ, ఏపీఓ పీటీజీ ఆత్రం భాస్కర్, డిప్యూటీ డీఈఓ చందన్, ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఈ20 ఇథనాల్‌పై అపోహలు వీడాలి

- **శాస్త్రీయ ఆధారాలతోనే ఇథనాల్ మిశ్రమ ఇంధన కార్యక్రమం**
- **దేశానికి రూ.1.9 లక్షల కోట్ల విదేశీ మారక ఆదా: కేంద్రం**

న్యూఢిల్లీ: పెట్రోల్‌లో 20 శాతం వరకు ఇథనాల్ మిశ్రమం (ఈ20) అమలుపై సామాజిక మాధ్యమాల్లో జరుగుతున్న తప్పుడు ప్రచారాలకు కేంద్ర ప్రభుత్వం సమాధానమిచ్చింది. ఈ20 ఇంధనం వల్ల ఇంజిన్‌లు దెబ్బతింటాయని, అధికంగా నీరు వినియోగిస్తుందని, బీమా చెల్లుబాటు కాదని, పర్యావరణానికి హాని కలుగుతుందన్న ఆరోపణలకు ఎలాంటి శాస్త్రీయ ఆధారాలు లేవని కేంద్ర పెట్రోలియం, సహజ వాయు మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. అంతర్జాతీయ అనుభవం, శాస్త్రీయ పరిశోధనలు, నియంత్రణ సంస్థల సూచనల ఆధారంగానే ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు వెల్లడించింది. ఇథనాల్ తయారీకి లీటరుకు 10 వేల లీటర్ల నీరు అవసరమనే ప్రచారం పూర్తిగా నిరాధారమని కేంద్రం పేర్కొంది. దేశ ఆహార భద్రత అవసరాలు తీరిన తర్వాత మిగిలిన బియ్యాన్నే ఇథనాల్ ఉత్పత్తికి వినియోగిస్తున్నామని తెలిపింది. ఒక లీటర్ ఇథనాల్ తయారీకి సుమారు 3 నుంచి 5 లీటర్ల శుద్ధి చేసిన నీరే వినియోగిస్తారని, నీటి పునర్వినియోగ సాంకేతికతను కూడా ప్లాంట్లు అమలు చేస్తున్నాయని వివరించింది. ప్రస్తుతం ఇథనాల్ ఉత్పత్తిలో 40 శాతానికి పైగా మొక్కజొన్న నుంచే వస్తోందని, దీనికి వరితో పోలిస్తే చాలా తక్కువ నీరు అవసరమని పేర్కొంది. ఈ20 ఇంధనం వాహనాల పనితీరును దెబ్బతీస్తుందనే ప్రచారాన్ని కేంద్రం ఖండించింది. ఆటోమోటివ్ రీసెర్చ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఏఆర్ఏఐ) నిర్వహించిన పరీక్షల్లో కార్లు, ద్విచక్ర వాహనాల పనితీరుపై ఎలాంటి గణనీయమైన ప్రతికూల ప్రభావం కనిపించలేదని తెలిపింది. మైలేజీలో స్వల్ప మార్పు తప్ప ఇంజిన్ పనితీరు యథావిధిగా ఉంటుందని, ఈ20కు అనుకూలంగా రూపొందించిన వాహనాలకు అధిక ఆక్టేన్ విలువ కారణంగా అదనపు ప్రయోజనాలు కూడా లభిస్తాయని పేర్కొంది. ఏఆర్ఏఐ, ఇండియన్ ఆయిల్, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం, సియామ్ సంయుక్తంగా నిర్వహించిన అధ్యయనాల్లో కూడా లోహ, ప్లాస్టిక్ భాగాలపై ఎలాంటి ప్రతికూల ప్రభావం లేదని తేలిందని వెల్లడించింది. పాత వాహనాల్లో కొన్ని రబ్బరు భాగాలను ముందుగానే మార్చాల్సిన అవసరం మాత్రమే ఉండొచ్చని స్పష్టం చేసింది.

బీమా రద్దు కాదు

ఈ20 ఇంధనం వాడితే వాహనాల వారంటీ లేదా బీమా రద్దవుతుందనే ప్రచారాన్ని కూడా కేంద్రం కొట్టిపారేసింది. ఈ20కు అనుగుణంగా తయారైన లేదా ఆమోదం పొందిన వాహనాలకు వారంటీ, బీమా యథాతథంగా కొనసాగుతాయని తెలిపింది. ఇథనాల్‌లో చక్కెర ఉండటంతో చీమలు, తేనెటీగలు ఆకర్షితులవుతాయనే ప్రచారం కూడా అవాస్తవమని పేర్కొంది. ఇంధన గ్రేడ్ ఇథనాల్‌లో చక్కెర అవశేషాలు ఉండవని, ప్రత్యేక రసాయనాల కారణంగా పురుగులు చేరవని వివరించింది. పర్యావరణ పరిరక్షణ నిబంధనల ప్రకారమే ఇథనాల్ ప్లాంట్లు పనిచేస్తున్నాయని, నీటి పునర్వినియోగం, జీరో లిక్విడ్ డిశ్చార్జ్ వంటి విధానాలు తప్పనిసరిగా అమలు చేస్తున్నట్లు తెలిపింది.

ఆర్థికంగా దేశానికి భారీ ప్రయోజనం

ఇథనాల్ మిశ్రమ కార్యక్రమం వల్ల 2014–15 నుంచి ఇప్పటివరకు దేశానికి రూ.1.9 లక్షల కోట్లకు పైగా విదేశీ మారకద్రవ్యం ఆదా అయినట్లు కేంద్రం వెల్లడించింది. రైతులకు రూ.1.6 లక్షల కోట్లకు పైగా చెల్లింపులు జరిగాయని, సుమారు 930 లక్షల మెట్రిక్ టన్నుల కార్బన్‌డయాక్సైడ్ ఉద్గారాలు తగ్గాయని తెలిపింది. అలాగే 310 లక్షల మెట్రిక్ టన్నుల ముడి చమురు దిగుమతులను భర్తీ చేయగలిగామని పేర్కొంది. దేశం నిర్దేశించుకున్న 20 శాతం ఇథనాల్ మిశ్రమ లక్ష్యాన్ని 2025 డిసెంబర్‌లోనే ముందుగానే చేరుకుందని, ప్రస్తుతం దేశ ఇథనాల్ ఉత్పత్తి సామర్థ్యం సుమారు 2,000 కోట్ల లీటర్లకు పెరిగిందని కేంద్ర పెట్రోలియం శాఖ వెల్లడించింది.

తక్కువ వర్షాలపై కేంద్రం అప్రమత్తం

- **ఎల్‌నినో ప్రభావంతో కరవు పరిస్థితులపై నిరంతర పర్యవేక్షణ**
- **రైతులకు ప్రత్యామ్నాయ పంటలపై సూచనలివ్వాలని ఆదేశం**
- **విద్యుత్, జలాశయాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి**

న్యూఢిల్లీ : ప్రాంతాల్లో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదవుతూ కరవు పరిస్థితులు తలెత్తే అవకాశాలపై కేంద్ర ప్రభుత్వం నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తోందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా తెలిపారు. ఈ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని అన్ని సంబంధిత శాఖలు అప్రమత్తంగా ఉండాలని ఆయన ఆదేశించారు. కేంద్ర వ్యవసాయ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌తో కలిసి పరిస్థితిని సమీక్షించిన అమిత్ షా, రాష్ట్ర ప్రభుత్వాలతో సమన్వయం చేసుకుని రైతులకు పరిస్థితులకు అనుగుణంగా సాగు చేయాల్సిన పంటలపై మార్గదర్శకాలు ఇవ్వాలని వ్యవసాయ శాఖతో పాటు సంబంధిత మంత్రిత్వ శాఖలను ఆదేశించారు. దేశంలోని అన్ని జలాశయాల నీటి నిల్వలను నిరంతరం పర్యవేక్షించాలని జలవనరుల శాఖకు సూచించిన ఆయన, తక్కువ నీటితో సాగయ్యే పశుగ్రాసం, చిరుధాన్యాలు, పప్పుధాన్యాల వంటి ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహించాలని పేర్కొన్నారు. అలాగే విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని విద్యుత్ శాఖను ఆదేశించారు. దేశంలో అవసరమైన ఆహార ధాన్యాల నిల్వలు సమృద్ధిగా ఉన్నాయని, నిత్యావసర వస్తువుల ధరలు ప్రస్తుతం స్థిరంగా ఉన్నాయని అధికారుల సమావేశంలో అమిత్ షాకు వివరించారు. జూన్‌లో దేశవ్యాప్తంగా సాధారణం కంటే సుమారు 40 శాతం తక్కువ వర్షపాతం నమోదైందని, మధ్య భారతదేశంలో ఈ లోటు 50.4 శాతానికి చేరిందని అధికారులు వెల్లడించారు. అలాగే జులై నెలలో కూడా వర్షపాతం సాధారణం కంటే తక్కువగానే ఉండే అవకాశముందని భారత వాతావరణ శాఖ ఇప్పటికే అంచనా వేసింది. ఇదిలా ఉండగా, ఇటీవల భారీ వర్షాలు, ఆకస్మిక వరదలు, కొండచరియలు విరిగిపడటంతో నష్టపోయిన అస్సాం, అరుణాచల్‌ప్రదేశ్ రాష్ట్రాల్లో పరిస్థితిని అంచనా వేసేందుకు కేంద్ర హోంశాఖ అంతర్‌మంత్రిత్వ బృందం (ఐఎంసీటీ)ని పంపించాలని అమిత్ షా ఆదేశించారు. మౌలిక సదుపాయాలు, వ్యవసాయం, నివాస ప్రాంతాలకు జరిగిన నష్టాన్ని ఈ బృందం పరిశీలించి నివేదిక సమర్పించనుంది.

బాలికలపై లైంగిక వేధింపులు

- **ఉపాధ్యాయుడిపై కేసు..**
- **తాత్కాలికంగా పాఠశాల మూసివేత**

సోన్‌భద్ర: ఉత్తరప్రదేశ్‌లోని సోన్‌భద్ర జిల్లాలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఇద్దరు బాలికలపై లైంగిక వేధింపులకు పాల్పడ్డాడన్న ఆరోపణలపై ఓ సహాయ ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేసి, అతనిపై కేసు నమోదు చేశారు. జిల్లా ప్రాథమిక విద్యాధికారి (బీఎస్ఏ) ముకుల్ ఆనంద్ పాండే తెలిపిన వివరాల ప్రకారం.. మొదటి, మూడో తరగతుల్లో చదువుతు న్న ఇద్దరు బాలికలతో ఉపాధ్యాయుడు అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడంటూ గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. అనంతరం బాధిత బాలికలు, ఇతర విద్యార్థుల వాంగ్మూలాలను నమోదు చేయగా, ఆరోపణలకు ప్రాథమికంగా బలం ఉన్నట్లు తేలిందన్నారు. ఈ ఘటన నేపథ్యంలో సంబంధిత పాఠశాలను బ్లాక్ విద్యాధికారి ఆదేశాల మేరకు తాత్కాలికంగా మూసి వేశారు. ప్రభుత్వ ఉద్యోగుల ప్రవర్తనా నియమావ ళిని ఉల్లంఘించడంతో పాటు ఉపాధ్యాయ వృత్తి గౌరవానికి విరుద్ధంగా వ్యవహరించినందున నిందితుడిని సస్పెండ్ చేసినట్లు అధికారులు తెలిపారు. జులై 1న నిందిత ఉపాధ్యాయుడిపై ఎఫ్ఐఆర్ నమోదు చేశామని, కేసు దర్యాప్తు కొనసాగుతోందని స్థానిక పోలీసులు వెల్లడించారు.

ఇన్‌స్టాగ్రామ్ ప్రకటనలపై మెటాకు కేంద్రం సమన్లు

- **చిన్నారుల లైంగిక దుర్వినియోగ కంటెంట్ ప్రచారం ఆరోపణలపై వివరణ కోరనున్న ఐటీ శాఖ**
- **బీబీసీ కథనంతో అప్రమత్తమైన ప్రభుత్వం**
- **తప్పులు తేలితే కఠిన చర్యలుంటాయని హెచ్చరిక**

న్యూఢిల్లీ: ఇన్‌స్టాగ్రామ్‌లో చిన్నారుల లైంగిక దుర్వినియోగానికి (సీఎస్ఏఎం) సంబంధించిన కంటెంట్‌ను ప్రోత్సహించే ప్రకటనలు కనిపిస్తున్నాయన్న ఆరోపణలపై కేంద్ర ప్రభుత్వం మెటాకు సమన్లు జారీ చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు ఎలక్ట్రానిక్స్, సమాచార సాంకేతిక శాఖ (మైటీ) అధికారులను కేంద్ర ఐటీ మంత్రి అశ్విని వైష్ణవ్ ఆదేశించినట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. త్వరలో జారీ చేయనున్న నోటీసులో ఈ తరహా ప్రకటనలు ఎలా ఆమోదం పొందాయి, ఆరోపణలు వెలుగులోకి వచ్చిన తర్వాత సంస్థ ఎలాంటి చర్యలు తీసుకుంది, భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఎలాంటి భద్రతా చర్యలు చేపడుతుందనే అంశాలపై మెటా నుంచి వివరణ కోరనున్నారు. ఇటీవల బీబీసీ ప్రచురించిన దర్యాప్తు కథనం ప్రకారం, మెటా సిఫారసు అల్గారిథమ్ చిన్నారుల లైంగిక దుర్వినియోగ కంటెంట్‌కు సంబంధించిన వీడియోలను ప్రోత్సహించిందని, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌లలో ఇలాంటి ప్రకటనలు కూడా కనిపించాయని ఆరోపణలు వచ్చాయి. రేప్ వీడియో, చైల్డ్ వీడియో వంటి పదాలతో కనిపించిన చెల్లింపు ప్రకటనలు వినియోగదారులను టెలిగ్రామ్ ఛానళ్లకు మళ్లించి, అక్కడ అక్రమ కంటెంట్‌ను విక్రయిస్తున్నట్లు కథనం పేర్కొంది. చెల్లింపు ప్రకటనల ద్వారా ఆదాయం పొందుతున్న నేపథ్యంలో, మూడో పక్షం కంటెంట్ అనే కారణంతో మెటా బాధ్యత నుంచి తప్పించుకోలేదని ప్రభుత్వ వర్గాలు స్పష్టం చేశాయి. ఆరోపణలు నిజమని తేలితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించాయి.

భద్రతా వ్యవస్థలను బలోపేతం చేస్తున్నాం

ఇదిలా ఉండగా, మెటా స్పందిస్తూ చిన్నారుల లైంగిక దుర్వినియోగ కంటెంట్‌పై తమకు జీరో టాలరెన్స్ విధానం ఉందని పేర్కొంది. ఇలాంటి కంటెంట్‌ను గుర్తించి తొలగించేందుకు అధునాతన కృత్రిమ మేధ (ఏఐ) సాంకేతికతను వినియోగిస్తున్నామని, నేరస్థులు నిబంధనలను తప్పించుకునేందుకు కొత్త మార్గాలు అన్వేషిస్తున్నందున నిరంతరం తమ భద్రతా వ్యవస్థలను బలోపేతం చేస్తున్నామని తెలిపింది. కాగా, ఈ వారం మెటాపై కేంద్రం చర్యలు తీసుకోవడం ఇది రెండోసారి. వాట్సాప్‌లో ప్రతిపాదించిన యూజర్‌నేమ్ ఫీచర్ సైబర్ మోసాలు, ఫిషింగ్, డిజిటల్ అరెస్టు మోసాలకు దారితీసే అవకాశం ఉందంటూ కేంద్రం ఇప్పటికే నోటీసు జారీ చేసింది. ప్రభుత్వంతో సంప్రదింపులు పూర్తయ్యే వరకు ఆ ఫీచర్‌ను అమలు చేయొద్దని సూచించగా, మెటా దాని అమలును తాత్కాలికంగా వాయిదా వేయడానికి అంగీకరించినట్లు సమాచారం.

వేర్వేరు ప్రమాదాల్లో ఎనిమిది మంది మృతి

- **భాగల్‌పూర్‌లో గూడ్స్ రైలు ఢీకొని ముగ్గురు రైల్వే కార్మికులు మృతి**
- **ఇళ్లపై బోల్తాపడిన డంపర్.. ఈ-రిక్షాను ఢీకొన్న వాహనం**

భాగల్‌పూర్: బిహార్‌లోని భాగల్‌పూర్ జిల్లాలో శుక్రవారం జరిగిన మూడు వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురు చిన్నారులు, ఓ మహిళ సహా మొత్తం ఎనిమిది మంది మృతి చెందగా, మరో ఏడుగురు గాయపడ్డారు. మొదటి ఘటనలో తూర్పు రైల్వే మాల్దా డివిజన్‌లోని సాహిబ్‌గంజ్–భాగల్‌పూర్ రైల్వే మార్గంలో పట్టాలపై పనిచేస్తున్న నలుగురు రైల్వే కార్మికులను గురువారం రాత్రి గూడ్స్ రైలు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రామ్ ప్రసాద్ (38), రాము (40), రగ్గా (45) అక్కడికక్కడే మృతి చెందగా, మరో కార్మికుడు గాయపడ్డాడు. మృతదేహాలను పోస్టుమార్టం కోసం తరలించారు. రెండో ఘటనలో నవగఛియా ప్రాంతంలో ఇసుక లోడ్‌తో వెళ్తున్న డంపర్ వెనుక టైరు పేలిపోవడంతో అదుపుతప్పి రహదారి పక్కన ఉన్న గడ్డి ఇళ్లపై బోల్తాపడింది. ఈ ప్రమాదంలో రాధా కుమారి (4), అంకుష్ కుమార్ (3), ఇందు దేవి (50) మృతి చెందగా, మరో ఆరుగురు గాయపడ్డారు. జీవనోపాధి కారణాలతో ప్రభుత్వం కేటాయించిన స్థలానికి వెళ్లకుండా బాధిత కుటుంబాలు అక్కడే నివసిస్తున్నట్లు అధికారులు తెలిపారు. మరో ఘటనలో లోదీపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని బిసన్‌పూర్ జిచో గ్రామంలో ఉపేంద్ర మండల్ అనే వ్యక్తిని డంపర్ ఢీకొనడంతో అతడు మృతి చెందాడు. అదే గ్రామంలో ఉదయం పాఠశాలకు ఈ–రిక్షాలో వెళ్తున్న అరవింద్ యాదవ్ అనే బాలుడిని గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో అతడు కూడా ప్రాణాలు కోల్పోయాడు. పోలీసులు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

అమర్‌నాథ్ యాత్రికుల కోసం జమ్మూ రైల్వే స్టేషన్‌లో విస్తృత ఏర్పాట్లు

- **యాత్ర తొలిరోజే 12 వేల మందికిపైగా అమర్‌నాథేశ్వర దర్శనం**
- **అందుబాటులోకి కొత్త ప్లాట్‌ఫాంలు, తాగునీరు, విశ్రాంతి కేంద్రాలు**

జమ్మూ: వార్షిక అమర్‌నాథ్ యాత్ర సందర్భంగా జమ్మూ తావీ రైల్వే స్టేషన్‌కు చేరుకునే యాత్రికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉత్తర రైల్వే జమ్మూ డివిజన్ విస్తృత ఏర్పాట్లు చేసింది. ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని వేచిచూడే హాళ్లు, తాగునీటి సౌకర్యం, హెల్ప్‌డెస్క్‌లు, భద్రతా చర్యలను మరింత బలోపేతం చేసింది. జమ్మూ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఉచిత్ సింఘాల్ అధికారులతో కలిసి స్టేషన్‌ను పరిశీలించి యాత్రికులకు కల్పిస్తున్న సౌకర్యాలు, సన్నద్ధతను సమీక్షించారు. స్టేషన్ ఆవరణలో వందలాది మంది భక్తులు విశ్రాంతి తీసుకునేందుకు విశాలమైన కవర్డ్ వెయిటింగ్ ఏరియాను ఏర్పాటు చేశారు. అక్కడ కూర్చునేందుకు సీట్లు, లైటింగ్, ఫ్యాన్లు, కూలర్లు, తాగునీటి సౌకర్యాలు కల్పించడంతో పాటు పరిశుభ్రత కోసం 24 గంటల హౌస్‌కీపింగ్ సిబ్బందిని నియమించారు. రైళ్ల సమయాలు, ప్లాట్‌ఫాం వివరాలు, వైద్య సహాయం తదితర సమాచారం అందించేందుకు స్కౌట్స్, గైడ్స్ సహకారంతో 24 గంటల హెల్ప్‌డెస్క్‌ను ఏర్పాటు చేశారు. యాత్రికుల భద్రత కోసం అదనపు టికెట్ తనిఖీ సిబ్బంది, కమర్షియల్ అధికారులు, రైల్వే రక్షణ దళం (ఆర్‌పీఎఫ్) సిబ్బందిని నిరంతరం విధుల్లో ఉంచారు. సీసీటీవీ నిఘాను మరింత పటిష్ఠం చేసి కంట్రోల్ రూమ్ నుంచి నిరంతర పర్యవేక్షణ చేపడుతున్నారు. మౌలిక సదుపాయాల విస్తరణలో భాగంగా జమ్మూ తావీ రైల్వే స్టేషన్‌లో కొత్తగా నిర్మించిన 4, 5 ప్లాట్‌ఫాంలను రైళ్ల రాకపోకలకు అందుబాటులోకి తీసుకొచ్చారు.

టికెట్లను అధికారిక కౌంటర్లలోనే కొనుగోలు

భక్తులు తప్పనిసరిగా అధికారికంగా నమోదు చేసుకుని మాత్రమే యాత్రకు వెళ్లాలని, రైల్వే టికెట్లను అధికారిక కౌంటర్ల నుంచే కొనుగోలు చేయాలని, అపరిచితులు ఇచ్చే ఆహారం, పానీయాలు స్వీకరించవద్దని రైల్వే అధికారులు సూచించారు. అవసరమైతే స్టేషన్ హెల్ప్‌డెస్క్ లేదా రైల్ మదద్ హెల్ప్‌లైన్–139ను సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు. ఇదిలా ఉండగా, 57 రోజుల అమర్‌నాథ్ యాత్ర తొలి రోజైన శుక్రవారం దక్షిణ కశ్మీర్‌లోని పవిత్ర గుహలోని హిమశివలింగాన్ని 12,100 మందికిపైగా భక్తులు దర్శించుకున్నట్లు అధికారులు తెలిపారు.

అన్నింటినీ గమనిస్తున్నాం

- **బంగ్లాదేశ్‌లోని ప్రాజెక్టులపై పరస్పర అంగీకార రోడ్‌మ్యాప్ ప్రకారమే సహకారం**
- **చైనా పాత్ర సహా అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకొని ముందుకెళ్తాం**
- **మోంగ్లా పోర్టు, యుద్ధ విమానాల కొనుగోలుపైనా నిఘా: విదేశాంగ శాఖ**



న్యూఢిల్లీ: తీస్తా నది ప్రాజెక్టుకు సంబంధించిన ప్రతి పరిణామాన్ని నిశితంగా పరిశీలిస్తూ, సమగ్ర దృక్పథంతో తదుపరి కార్యాచరణను నిర్ణయిస్తామని కేంద్ర విదేశాంగ శాఖ (ఎంఈఏ) స్పష్టం చేసింది. బంగ్లాదేశ్‌లో భారత్ చేపడుతున్న అభివృద్ధి సహకార కార్యక్రమాలన్నీ ఇరు దేశాల మధ్య పరస్పర అంగీకారంతో రూపొందించిన రోడ్‌మ్యాప్ ప్రకారమే కొనసాగుతున్నాయని పేర్కొంది. బంగ్లాదేశ్ ప్రధాని తారిక్ రెహ్మాన్ ఇటీవల చైనా పర్యటన సందర్భంగా తీస్తా రివర్ సమగ్ర నిర్వహణ, పునరుద్ధరణ ప్రాజెక్టు (టీఆర్‌సీఎంఆర్‌పీ)పై బీజింగ్‌తో చర్చలు జరగడం, ఆ ప్రాజెక్టుకు చైనా మద్దతు ప్రకటించిన నేపథ్యంలో విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ స్పందించారు. తీస్తా ప్రాజెక్టుపై భారత అభిప్రాయాన్ని ఇప్పటికే ఢాకాకు స్పష్టంగా తెలియజేశామని, తాజా పరిణామాలన్నింటినీ దృష్టిలో ఉంచుకుని ముందుకు సాగుతామని తెలిపారు. సిక్కింలో పుట్టిన తీస్తా నది పశ్చిమ బెంగాల్ మీదుగా బంగ్లాదేశ్‌లోకి ప్రవహిస్తుంది. ఈ నదీ పరీవాహక ప్రాంతం భారత్‌కు వ్యూహాత్మకంగా అత్యంత కీలకమైన సిలిగురి కారిడార్‌కు సమీపంలో ఉండటంతో ఈ ప్రాజెక్టులో చైనా ప్రమేయం భద్రతా, వ్యూహాత్మక కోణాల్లో ప్రాధాన్యం సంతరించుకుంది. ఇదే సందర్భంగా బంగ్లాదేశ్‌లోని మోంగ్లా పోర్టు ఆధునికీకరణ, చైనా నుంచి యుద్ధ విమానాల కొనుగోలు వంటి అంశాలపై ప్రశ్నించగా, వాటన్నింటినీ భారత్ నిశితంగా గమనిస్తోందని జైస్వాల్ తెలిపారు. దేశ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని అవసరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. విదేశాల్లో భారత కాన్సులర్ సేవలపై మాట్లాడుతూ, ఆస్ట్రేలియా, కువైట్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ)లో పరిమిత స్థాయిలో సేవలు కొనసాగుతున్నాయని చెప్పారు. ఆయా దేశాల్లో భారత మిషన్లకు సేవలందిస్తున్న ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీల కార్యకలాపాలు ప్రస్తుతం న్యాయస్థాన విచారణలో ఉన్నందున తాత్కాలికంగా నిలిపివేసినట్లు వెల్లడించారు. ఈ అంశంపై హైకోర్టు ఆదేశాల కోసం ఎదురుచూస్తున్నామని తెలిపారు. పాకిస్థాన్‌లోని యునెస్కో ప్రపంచ వారసత్వ కట్టడమైన తక్షశిలలో జరిగిన నిర్మాణ మార్పులపై స్పందిస్తూ, ప్రపంచ వారసత్వ సంపద ఏ ఒక్క దేశానిదీ కాదని, మానవాళి ఉమ్మడి వారసత్వంగా దానిని పరిరక్షించడం ప్రతి దేశం బాధ్యత అని జైస్వాల్ పేర్కొన్నారు.

ఈసారి బద్రీనాథ్!

- **ఆలయ కానుకలపై అక్రమాల ఆరోపణలు**
- **దోషులపై కఠిన చర్యలు తప్పవన్న ఆలయ కమిటీ**

డెహ్రాడూన్: అయోధ్య రామాలయ విరాళాల దుర్వినియోగ ఆరోపణల నేపథ్యంలో తాజాగా బద్రీనాథ్ ధామ్‌లో భక్తుల కానుకల వ్యవహారంపైనా ఇలాంటి ఆరోపణలు రావడంతో బద్రీనాథ్–కేదార్‌నాథ్ ఆలయ కమిటీ (బీకేటీసీ) విచారణకు ఆదేశించింది. సోషల్ మీడియాలో ప్రచారంలో ఉన్న ఆరోపణలను తీవ్రంగా పరిగణించిన కమిటీ ప్రత్యేక దర్యాప్తు కమిటీని ఏర్పాటు చేయడంతో పాటు సంబంధిత ఉద్యోగుల నుంచి వివరణ కోరింది. బీకేటీసీ అధ్యక్షుడు హేమంత్ ద్వివేది మాట్లాడుతూ, విచారణలో ఆరోపణలు నిజమని తేలితే ఎవరినీ ఉపేక్షించబోమని, దోషులపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. సోషల్ మీడియాలో తన వ్యక్తిగత కార్యదర్శిగా పేర్కొంటున్న వ్యక్తి వాస్తవానికి సాధారణ ప్రభుత్వ ఉద్యోగి మాత్రమేనని, ఆయనకు తన వ్యక్తిగత కార్యదర్శితో ఎలాంటి సంబంధం లేదని వివరణ ఇచ్చారు. బీకేటీసీ సీఈవో సోహన్ సింగ్ రంగడ్ తెలిపిన వివరాల ప్రకారం, అందుబాటులో ఉన్న ఆధారాలు, సీసీటీవీ ఫుటేజీ, సంబంధిత వ్యక్తుల వాంగ్మూలాల ఆధారంగా విచార ణ కమిటీ నివేదిక సమర్పించనుంది. విచారణ పూర్త య్యే వరకు నిర్ధారణ కాని ఆరోపణలను ప్రచారం చేయవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

ముంబై-అహ్మదాబాద్ హైస్పీడ్ రైలు ప్రాజెక్టులో కీలక ఘట్టం

- **సొరంగ పనులకు రేపు శ్రీకారం**
- **టన్నెల్ బోరింగ్ మెషీన్‌ను ప్రారంభించనున్న కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్**
- **ఈ సాంకేతికత వినియోగం దేశంలో ఇదే తొలిసారి**

న్యూఢిల్లీ: దేశంలో తొలి బుల్లెట్ రైలు ప్రాజెక్టుగా నిర్మిస్తున్న ముంబై–అహ్మదాబాద్ హైస్పీడ్ రైలు మార్గంలో సొరంగ నిర్మాణ పనులకు ఆదివారం శ్రీకారం చుట్టనున్నారు. ముంబైలోని విక్రోలి నుంచి బాంద్రా–కుర్లా కాంప్లెక్స్ (బీకేసీ) స్టేషన్ వరకు టన్నెల్ బోరింగ్ మెషీన్ (టీబీఎం) ద్వారా చేపట్టే తవ్వకాలను కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ ప్రారంభించనున్నారు. జాతీయ హైస్పీడ్ రైలు సంస్థ (ఎన్‌హెచ్‌ఎస్ఆర్‌సీఎల్) అధికారుల ప్రకారం, భూగర్భంలో సుమారు 56.6 మీటర్ల లోతులో ఏర్పాటు చేసిన టీబీఎంను మంత్రి ప్రారంభిస్తారు. తొలి యంత్రం విక్రోలి నుంచి బీకేసీ వరకు సుమారు 5.8 కిలోమీటర్ల సొరంగ తవ్వకాలు చేపడుతుంది. మరో టీబీఎంను సావ్లీలో ఏర్పాటు చేస్తుండగా, అది సుమారు 9.7 కిలోమీటర్ల మేర, అందులో 7 కిలోమీటర్ల సముద్రం అడుగున ఉన్న భాగంతో పాటు తవ్వకాలు నిర్వహించనుంది. మొత్తం 20.37 కిలోమీటర్ల సొరంగంలో 15.4 కిలోమీటర్లను టన్నెల్ బోరింగ్ మెషీన్లతో నిర్మించనుండగా, మిగిలిన 4.8 కిలోమీటర్ల పనులు ఇప్పటికే డ్రిల్ అండ్ బ్లాస్ట్ విధానంలో పూర్తయ్యాయి. ఈ సొరంగం భూగర్భంలో సుమారు 65 మీటర్ల లోతులో నిర్మించబడుతుంది. రెండు టీబీఎంలు పూర్తిస్థాయిలో పనిచేయడం ప్రారంభించిన తర్వాత నెలకు సుమారు 600 మీటర్ల సొరంగ నిర్మాణం పూర్తయ్యే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. చైనాలో నుంచి సముద్ర మార్గంలో దిగుమతి చేసిన ప్రత్యేక జర్మన్ తయారీ టీబీఎంలను అఫ్కాన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సంస్థ వినియోగిస్తోంది. 13.6 మీటర్ల కట్టర్ హెడ్‌తో ఇవి భారతదేశంలో రైల్వే ప్రాజెక్టుల్లో వినియోగిస్తున్న అతిపెద్ద టన్నెల్ బోరింగ్ యంత్రాలుగా నిలుస్తున్నాయి. 508 కిలోమీటర్ల పొడవైన ముంబై–అహ్మదాబాద్ హైస్పీడ్ రైలు కారిడార్‌లో రైళ్లు గంటకు గరిష్ఠంగా 320 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించనున్నాయి. బాంద్రా–కుర్లా కాంప్లెక్స్ నుంచి సబర్మతి వరకు మొత్తం 12 స్టేషన్లు ఉండనున్నాయి. పరిమిత స్టాప్‌లతో నడిచే సర్వీసులు సూరత్, వడోదర, అహ్మదాబాద్‌లలో మాత్రమే ఆగుతూ సుమారు 2 గంటల 7 నిమిషాల్లో గమ్యస్థానానికి చేరుకోనున్నాయి.

ఖమేనీ అంత్యక్రియలకు భారత ప్రతినిధులు

- **టెహ్రాన్‌లో నివాళులర్పించిన కేంద్ర మంత్రి పవిత్ర మార్గెరిటా, బిహార్ గవర్నర్ సయ్యద్ అటా హస్నైన్**
- **భారత ప్రభుత్వం, ప్రజల తరపున సంతాపం**
- **6న ప్రధాన అంతిమయాత్ర, 7న ఖోమ్‌లో ప్రత్యేక కార్యక్రమాలు**

న్యూఢిల్లీ: ఇరాన్ మాజీ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ అంత్యక్రియల కార్యక్రమంలో భారత్ తరపున కేంద్ర విదేశాంగ శాఖ సహాయ మంత్రి పవిత్ర మార్గెరిటా, బిహార్ గవర్నర్ లెఫ్టినెంట్ జనరల్ (రిటైర్డ్) సయ్యద్ అటా హస్నైన్ శుక్రవారం టెహ్రాన్‌లో పాల్గొన్నారు. భారత ప్రభుత్వం, ప్రజల తరపున ఖమేనీకి నివాళులర్పించి సంతాపం తెలిపారు. ఇటీవల పశ్చిమాసియాలో జరిగిన ఘర్షణల్లో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు కూడా ఈ సందర్భంగా భారత ప్రతినిధులు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని మార్గెరిటా, బిహార్ రాజ్‌భవన్, భారతదేశంలోని ఇరాన్ రాయబార కార్యాలయం సామాజిక మాధ్యమాల ద్వారా వెల్లడించాయి. ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కి యన్ ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి అంత్యక్రియలకు హాజరు కావాలని ఆహ్వానం పంపినప్పటికీ, భారత్ తరపున అధికారిక ప్రతినిధులుగా మార్గెరిటా, హస్నైన్‌లను పంపింది. కాంగ్రెస్ పార్టీ తరపున మాజీ విదేశాంగ మంత్రి సల్మాన్ ఖుర్షీద్ కూడా అంత్యక్రి యల్లో పాల్గొంటున్నారు. ఈ సందర్భంగా విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ మాట్లాడు తూ, ఇరాన్‌లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించేందుకు ఈ ఇద్దరు ప్రతినిధులను ప్రభుత్వం నియమించిందని తెలిపారు. భారత్–ఇరాన్ మధ్య ఉన్న నాగరికత, సాంస్కృతిక, ప్రజల మధ్య సంబంధాల ప్రాధాన్యాన్ని ఈ ఉన్నతస్థాయి ప్రాతినిధ్యం ప్రతిబింబిస్తోందని విదేశాంగ శాఖ పేర్కొంది. ఇరాన్ ప్రభుత్వ మీడియా కథనాల ప్రకారం, ప్రధాన అంతిమయాత్ర జూలై 6న టెహ్రాన్‌లో జరగనుండగా, జూలై 7న పవిత్ర నగరం ఖోమ్‌లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. అనంతరం జూలై 9న ఖమేనీ స్వస్థలమైన మష్హద్‌లో అంత్యక్రియలు పూర్తికానున్నాయి.

ఫెడరర్ సరసన జకోవిచ్

- వింబుల్డన్‌లో 105వ మ్యాచ్ విజయంతో అరుదైన ఘనత
- రిండర్‌క్నెచ్‌పై నాలుగు సెట్లలో నెగ్గిన సెర్బియా దిగ్గజం
- ప్రీక్వార్టర్స్‌లో సఫియుల్లిన్‌తో పోరు

లండన్: సెర్బియా టెన్నిస్ దిగ్గజం నొవాక్ జకోవిచ్ వింబుల్డన్ లో మరో అరుదైన ఘనతను తన ఖాతాలో వేసుకున్నాడు. పు రుషుల సింగిల్స్ మూడో రౌండ్‌లో ఫ్రాన్స్‌కు చెందిన ఆర్థర్ రిండర్‌క్నెచ్‌ను 7-5, 6-4, 1-6, 7-6 (7/4)తో ఓడించిన జకోవిచ్, ఆల్ ఇంగ్లండ్ క్లబ్‌లో తన 105వ మ్యాచ్ విజయాన్ని నమోదు చేశాడు. దీంతో వింబుల్డన్‌లో అత్యధిక సింగిల్స్ విజయాలు సాధించిన పురుషుల ఆటగాడిగా రోజర్ ఫెడరర్ పేరిట ఉన్న రికార్డును సమం చేశాడు. మహిళల విభాగంలో మార్టినా నవ్రతిలోవా 120 విజయాలతో అగ్రస్థానంలో కొన సాగుతున్నారు. 24 గ్రాండ్‌స్లామ్ టైటిళ్ల విజేత అయిన జకోవి చ్‌కు ఈ విజయం అంత తేలికగా దక్కలేదు. తొలి రెండు సెట్లు సొంతం చేసుకున్నప్పటికీ, మూడో సెట్‌ను కేవలం 18 నిమి షాల్లో కోల్పోయాడు. అయితే నాలుగో సెట్ టైబ్రేక్‌లో అసా ధారణ ఆటతీరుతో పుంజుకుని వరుసగా రెండు ఏస్‌లు సం ధించాడు. మ్యాచ్ పాయింట్ సమయంలో ప్రత్యర్థి జారి పడటంతో లభించిన అవకాశాన్ని అద్భుతమైన బ్యాక్‌హ్యాండ్ వాలీతో ముగించి నాలుగో రౌండ్‌లోకి అడుగుపెట్టాడు.

ఇది గొప్ప గౌరవం

మ్యాచ్ అనంతరం జకోవిచ్ మాట్లాడుతూ, ఫెడరర్ సరసన నిలవడం తనకు గర్వకారణమని తెలిపాడు. 'ఇది ఎంతో గొప్ప గౌరవం. ఇప్పుడు 106వ విజయానికి ఫెడరర్‌తోనే ఒక మ్యాచ్ ఆడితే బాగుంటుంది' అంటూ సరదాగా వ్యాఖ్యానించి అభిమా నులను అలరించాడు. ప్రీక్వార్టర్స్‌లో జకోవిచ్ రష్యా క్వాలిఫ యర్ రోమన్ సఫియుల్లిన్‌తో తలపడనున్నాడు. మరోవైపు డిఫెండింగ్ ఛాంపియన్ జానిక్ సిన్నర్ అమెరికా ఆటగాడు జెన్సన్ బ్రూక్స్‌బీపై 6-4, 6-3, 6-4తో విజయం సాధించి నాలుగో రౌండ్‌కు చేరాడు.

కన్నీళ్లు పెట్టుకున్న సఫియుల్లిన్

ప్రపంచ 132వ ర్యాంకర్ రోమన్ సఫియుల్లిన్ బ్రెజిల్‌కు చెందిన జోవో ఫోన్సెకాను 6-3, 6-3, 6-3తో చిత్తుచేసి ప్రీ క్వార్టర్స్‌కు అర్హత సాధించాడు. గత ఏడాది మోకాలి గాయం తో టెన్నిస్‌కు దూరమైన తాను మళ్లీ ఈ స్థాయిలో ఆడగలు గుతున్నానని చెబుతూ ఇంటర్వ్యూలో భావోద్వేగానికి లోన య్యాడు.

ఒసాకా దూకుడు!

నాలుగుసార్లు గ్రాండ్‌స్లామ్ విజేత నయోమీ ఒసాకా వింబుల్డన్‌లో తన అత్యుత్తమ ప్రదర్శనను కొనసాగిస్తోంది. మహిళల సింగిల్స్ మూడో రౌండ్‌లో దారియా కసట్కినాపై 6-1, 6-3తో సునాయాస విజయం సాధించిన జపాన్ స్టార్ తొలిసారి ఈ ప్రతిష్ఠాత్మక టోర్నీలో నాలుగో రౌండ్‌కు అర్హత సాధించింది. విజయం అనంతరం మీడియాతో మాట్లాడిన ఒసాకా.. తన మూడేళ్ల కుమార్తె షాయ్ పుట్టినరోజుకు సంబంధించిన ఓ ఆసక్తికర సంఘటనను అభిమానులతో పంచుకుంది. పుట్టినరోజు సందర్భంగా ఆమెను పార్క్‌కు తీసుకెళ్లాలని అనుకున్నప్పటికీ, కొద్దిగా అల్లరి చేయడంతో టైమ్‌ఔట్ ఇవ్వాల్సి వచ్చిందని చిరునవ్వుతో చెప్పింది.

వయసు కాదు.. సామర్థ్యమే ఎంపికకు ప్రామాణికం

- వైభవ్‌లో సచిన్, కోహ్లీల స్థాయి ప్రతిభ ఉంది
- భారత మాజీ కెప్టెన్ కపిల్‌దేవ్

న్యూఢిల్లీ: యువ సంచలనం వైభవ్ సూర్యవంశీలో సచిన్ టెండూల్కర్, విరాట్ కోహ్లీల స్థాయి ప్రతిభ కనిపిస్తోందని భారత మాజీ కెప్టెన్, దిగ్గజ ఆల్‌రౌండర్ కపిల్‌దేవ్ ప్రశంసించారు. భారత జట్టులో అతడి ఎంపిక విషయంలో వయసును కాకుండా సామర్థ్యాన్ని మాత్రమే పరిగణనలోకి తీసుకోవాలని అభిప్రాయపడ్డారు. ఐర్లాండ్, ఇంగ్లండ్ పర్యటనల కోసం భారత టీ20 జట్టులో చోటు దక్కించుకున్న 15 ఏళ్ల వైభవ్ ఇంకా అంతర్జాతీయ అరంగేట్రం కోసం ఎదురుచూస్తున్నాడు. ఈ నేపథ్యంలో విక్రాంత్ పోడ్‌కాస్ట్‌లో మాట్లాడిన కపిల్‌దేవ్, టీ20ల్లో వైభవ్ చూపిస్తున్న ప్రతిభ అసాధారణమని కొనియాడారు. ప్రతిభ పరంగా చూస్తే అతడు సచిన్, కోహ్లీల స్థాయిలో కనిపిస్తున్నాడు. టీ20ల్లో అతనిలో ప్రత్యేకమైన టాలెంట్ స్పష్టంగా కనిపిస్తోంది. అయితే ఇతర ఫార్మాట్లలో కూడా తన సామర్థ్యాన్ని నిరూపించుకోవాల్సి ఉంటుంది. టెస్టు క్రికెట్‌లో అవసరమైతే ఓవర్ల తరబడి ఓపికగా బ్యాటింగ్ చేయగలడా అనేది చూడాలి అని కపిల్ అన్నారు. వైభవ్‌పై ఇప్పటికే అతిగా చర్చ జరుగుతోందని, అలాంటి ఒత్తిడి యువ ఆటగాడికి మంచిది కాదన్నారు. అతడికి ఎదిగేందుకు తగిన సమయం, స్వేచ్ఛ ఇవ్వాలని సూచించారు. భారత తుది జట్టులో చోటు కల్పించాలా అన్న ప్రశ్నకు స్పందిస్తూ.. సచిన్ కూడా ఇదే వయసులో అంతర్జాతీయ క్రికెట్‌లోకి వచ్చాడు. అప్పట్లో తొందరగా అవకాశం ఇస్తున్నామేమో అనిపించింది. కానీ చరిత్ర చూస్తే ఆలస్యం చేయకపోవడమే సరైన నిర్ణయమని తెలుస్తుంది. వైభవ్ సిద్ధంగా ఉంటే వయసును కాదు, అతడి సామర్థ్యాన్నే చూడాలి. ఆ సామర్థ్యం ఉందని భావిస్తే తప్పకుండా ఆడించాలి అని కపిల్ వ్యాఖ్యానించారు.

ఉత్కంఠ పోరులో ఈజిప్ట్ సంచలనం

- పెనాల్టీ షూటౌట్‌లో 4-2తో ఆస్ట్రేలియాపై ఘన విజయం

ఆర్లింగ్టన్: ఫిఫా ప్రపంచకప్‌లో నాకౌట్ దశలో తొలిసారి ఆడుతున్న ఈజిప్ట్ చరిత్రాత్మక విజయాన్ని నమోదు చేసింది. ఆస్ట్రేలియాతో శుక్రవారం జరిగిన ఉత్కంఠభరిత పోరు నిర్ణీత, అదనపు సమయంలో 1-1తో సమంగా ముగియడంతో మ్యాచ్ పెనాల్టీ షూటౌట్‌కు వెళ్లింది. అక్కడ ఈజిప్ట్ 4-2తో పైచేయి సాధించి ప్రీ క్వార్టర్ (రౌండ్ ఆఫ్-16)లోకి అడుగుపెట్టింది. షూటౌట్‌లో ఈజిప్ట్ తరఫున మహ్మూద్ సాబెర్, రామీ రబియా, మహ్మద్ సలాహ్, హొస్సామ్ అబ్దెల్‌మగీద్ పెనాల్టీలను విజయవంతంగా గోల్‌లుగా మలిచారు. ఆస్ట్రేలియా తరఫున జాక్సన్ ఇర్విన్, అవర్ మబిల్ మాత్రమే గోల్స్ చేయగా, హ్యారీ సౌటార్, లూకాస్ హెర్రింగ్టన్ అవకాశాలను చేజార్చుకున్నారు. అబ్దెల్‌మగీద్ కొట్టిన చివరి పెనాల్టీ ఈజిప్ట్‌కు విజయాన్ని ఖరారు చేసింది. మ్యాచ్ 13వ నిమిషంలో ఇమామ్ అషూర్ హెడర్‌తో ఈజిప్ట్‌కు ఆధిక్యం అందించాడు. అయితే 55వ నిమిషంలో ఈజిప్ట్ డిఫెండర్ మహ్మ ద్ హనీ పొరపాటున స్వీయ గోల్ చేయడంతో ఆస్ట్రేలియా 1-1తో సమం చేసింది. ఈ ప్రపంచకప్‌లో హనీకి ఇది రెండో స్వీయ గోల్‌గా నిలిచింది. హామ్‌స్ట్రింగ్ గాయంతో బాధపడుతున్నప్పటికీ స్టార్ ఆటగాడు మహ్మద్ సలాహ్ తుది జట్టులో బరిలోకి దిగాడు. మ్యాచ్‌లో గోల్ చేయలేకపోయినా, షూటౌట్‌లో కీలక పెనాల్టీని విజయవంతంగా పూర్తి చేశాడు. ఈ విజయంతో ఈజిప్ట్ రౌండ్ ఆఫ్-16లోకి ప్రవేశించింది. మంగళవారం జరిగే తదుపరి మ్యాచ్‌లో డిఫెండింగ్ చాంపియన్ అర్జెంటీనా లేదా కేప్‌వెర్డే జట్టుతో తలపడనుంది. మరోవైపు ప్రపంచకప్ నాకౌట్ దశలో ఆస్ట్రేలియా వరుసగా మూడోసారి నిరాశతోనే టోర్నీ నుంచి నిష్క్రమించింది.

సంజూకు అగ్నిపరీక్ష

- నేడు ఇంగ్లండ్‌తో భారత్ రెండో టీ20
- శాంసన్, తిలక్ వర్మ ఫామ్‌పై జట్టు మేనేజ్‌మెంట్ అసంతృప్తి
- మరోసారి వైభవ్‌పైనే అందరి దృష్టి
- తుది జట్టులో చోటుపై ఇంకా వీడని సస్పెన్స్

మాంచెస్టర్: ఇంగ్లండ్‌తో శనివారం జరిగే రెండో టీ20 అంతర్జాతీయ మ్యాచ్ భారత జట్టులోని పలువురు ఆటగాళ్లకు కీలకంగా మారింది. ముఖ్యంగా ఓపెనర్ సంజూ శాంసన్‌కు ఈ మ్యాచ్ అగ్నిపరీక్షగా నిలవనుంది. యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ జట్టులో అవకాశానికి సిద్ధంగా ఉండటంతో శాంసన్‌పై ఒత్తిడి మరింత పెరిగింది. తొలి టీ20లో భారత్ 189/7 పరుగులు చేసినప్పటికీ వర్షం కారణంగా మ్యాచ్ రద్దైంది. అయితే శాంసన్ ఏడు బంతుల్లో ఒక్క పరుగే చేసి మరోసారి నిరాశపరిచాడు. ఇటీవల అభిషేక్ శర్మ వరుసగా అర్ధశతకాలతో ఆకట్టుకోవడంతో మరో ఓపెనర్‌గా శాంసన్ కూడా భారీ ఇన్నింగ్స్‌తో తన స్థానాన్ని నిలబెట్టుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. సీమింగ్ పిచ్‌లపై అతని సాంకేతిక బలహీనతలు వరుసగా బయటపడుతుండటం ఆందోళన కలిగిస్తోంది. ఇదే పరిస్థితి కొనసాగితే వైభవ్ సూర్యవంశీకి అవకాశం ఇవ్వాలన్న డిమాండ్ మరింత బలపడే అవకాశం ఉంది. అయితే యువ ఆటగాడిని తొందరగా ఒత్తిడిలోకి నెట్టకుండా దశలవారీగా అవకాశాలు కల్పించాలని జట్టు యాజమాన్యం భావిస్తోంది.

తిలక్ వర్మదీ అదే పరిస్థితి

మిడిల్ ఓవర్లలో పరుగుల వేగాన్ని పెంచడంలో తిలక్ వర్మ విఫలమవుతున్నాడనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ ఏడాది 12 టీ20ల్లో అతను కేవలం 12 సిక్సర్లు మాత్రమే బాదడం ఫినిషర్‌గా ఆశించిన స్థాయికి తగ్గ ప్రదర్శనగా విశ్లేషకులు భావిస్తున్నారు. ముఖ్యంగా స్పిన్, నెమ్మదైన బంతులను ఎదుర్కొనే సమయంలో అతని స్ట్రైక్‌రేట్ ఆందోళన కలిగిస్తోంది. ఇక ఓల్డ్ ట్రాఫోర్డ్ పిచ్ స్పిన్నర్లకు కొంత అనుకూలించే అవకాశం ఉండటంతో భారత బౌలింగ్ విభాగంలో పెద్దగా మార్పులు చేసే అవకాశాలు కనిపించడం లేదు. ఇంగ్లండ్ కెప్టెన్ హ్యారీ బ్రూక్ నేతృత్వంలోని జట్టులో ఫిల్ సాల్ట్, జోస్ బట్లర్, టామ్ బాంటన్ వంటి విధ్వంసక బ్యాటర్లు ఉండటంతో భారత బౌలర్లకు గట్టి సవాల్ ఎదురుకానుంది. పేస్ విభాగంలో జోఫ్రా ఆర్చర్, జోష్ టంగ్ ఇంగ్లండ్ బలంగా నిలవనున్నారు. రెండో టీ20లో భారత జట్టు కూర్పుపై అందరి దృష్టి నిలిచింది. ముఖ్యంగా వైభవ్ సూర్యవంశీకి అరంగేట్ర అవకాశం కల్పిస్తారా? లేక మరికొంతకాలం నిరీక్షింపజేస్తారా? అన్నది మ్యాచ్‌కు ముందు అత్యంత ఆసక్తికర అంశంగా మారింది.

Business
బిజినెస్

డెలివరీ నెట్‌వర్క్ విస్తరించనున్న అమెజాన్

- రూ.2,800 కోట్ల పెట్టుబడితో భారీ ప్రణాళిక



కోల్‌కతా: దేశవ్యాప్తంగా తన లాజిస్టిక్స్, డెలివరీ వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు ఈ ఏడాది రూ.2,800 కోట్లకు పైగా పెట్టుబడి పెట్టనున్నట్లు ఈ-కామర్స్ దిగ్గజం అమెజాన్ ఇండియా ప్రకటించింది. కార్యకలాపాల విస్తరణతో పాటు ఆధునిక సాంకేతికతను వినియోగించి వేగవంతమైన, సురక్షితమైన, విశ్వసనీయమైన డెలివరీ సేవలను అందించడమే ఈ పెట్టుబడి ప్రధాన లక్ష్యమని కంపెనీ వెల్లడించింది. ఈ పెట్టుబడులతో డెలివరీ నెట్‌వర్క్‌ను విస్తరించడమే కాకుండా ఉద్యోగుల భద్రత, ఆరోగ్యం, ఆర్థిక సంక్షేమాన్ని మెరుగుపర్చే చర్యలకూ ప్రాధాన్యం ఇస్తామని అమెజాన్ ఇండియా ఆపరేషన్స్ డైరెక్టర్ కరణ్ చుగ్ తెలిపారు. పశ్చిమ బెంగాల్‌లో ఇటీవల చేపట్టిన లాజిస్టిక్స్ విస్తరణ ఫలితంగా డెలివరీ వేగం గణనీయంగా పెరిగిందని కంపెనీ పేర్కొంది. 2025లో నాలుగు కొత్త డెలివరీ స్టేషన్లను ప్రారంభించడంతో రాష్ట్రంలో మొత్తం డెలివరీ కేంద్రాల సంఖ్య 100 దాటింది. దీనివల్ల సుమారు 40 శాతం ఆర్డర్లు వినియోగదారులకు అదే రోజు లేదా మరుసటి రోజే చేరుతున్నాయని వెల్లడించింది. ప్రస్తుతం రాష్ట్రంలో అమెజాన్‌కు రెండు ఫుల్‌ఫిల్‌మెంట్ సెంటర్లు, మూడు సార్టింగ్ సెంటర్లు, 100కు పైగా డెలివరీ స్టేషన్లు ఉన్నాయి. 2024లో హౌరాలోని పంచ్లాలో ఏర్పాటు చేసిన ఫుల్‌ఫిల్‌మెంట్ సెంటర్‌కు 11 లక్షల క్యూబిక్ అడుగుల నిల్వ సామర్థ్యం ఉంది. ఈ విస్తరణతో స్థానిక వ్యాపారులకు దేశవ్యాప్తంగా వినియోగదారులను చేరుకునే అవకాశాలు మరింత పెరిగాయని కంపెనీ తెలిపింది. ప్రస్తుతం బెంగాల్‌కు చెందిన 70 వేలకుపైగా విక్రేతలు, 20వేల స్థానిక దుకాణాలు అమెజాన్ వేదికలో నమోదయ్యాయి. అసన్సోల్, బంకూరా, దుర్గాపూర్, హౌరా, ఖరగ్‌పూర్, మాల్దా వంటి నగరాల్లో వినియోగదారుల డిమాండ్ వేగంగా పెరుగుతోందని పేర్కొంది. అలాగే నెట్‌వర్క్ విస్తరణతో ప్రత్యక్ష, పరోక్ష, సీజనల్ ఉద్యోగ అవకాశాలు కూడా గణనీయంగా పెరిగినట్లు వెల్లడించింది.

రాపిడోపై రవాణా శాఖ కొరడా

- అనుమతులు లేకుండానే బైక్ ట్యాక్సీ సేవల నిర్వహణ
- ఆర్టీవో చర్యలు.. రాపిడో వ్యవస్థాపకులపై కేసు

నాగ్‌పూర్: మహారాష్ట్రలో అనుమతి లేకుండా బైక్ ట్యాక్సీ సేవలు నిర్వహిస్తున్నారనే ఆరోపణలపై రాపిడో యాప్‌ను నిర్వహిస్తున్న రూఫెన్ ట్రాన్స్‌పోర్టేషన్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్‌పై కేసు నమోదైంది.నాగ్‌పూర్ ఆర్టీవో ఫిర్యాదు మేరకు సంస్థ వ్యవస్థాపకులు రిషికేశ్ ఎస్.ఆర్, పవన్ గుంటుపల్లి, అరవింద్ శంకాలపై సీతాబుల్డి పోలీసులు కేసు నమోదు చేశారు. జూన్ 23న నిర్వహించిన తనిఖీల్లో భాగంగా అనుమతి లేని పెట్రోల్ బైక్‌ను బుక్ చేసి వాణిజ్య ప్రయాణాలకు వినియోగిస్తున్నట్లు గుర్తించారు.మహారాష్ట్ర ప్రభుత్వం నుంచి బైక్ ట్యాక్సీలకు అనుమతి లేదని, అయినప్పటికీ సేవలు నిర్వహిస్తున్నారని ఆర్టీవో ఫిర్యాదులో పేర్కొంది. దీంతో వాహనాన్ని స్వాధీనం చేసుకుని మోటార్ వెహికిల్ చట్టం కింద చర్యలు తీసుకున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మూడో రోజూ మార్కెట్ల జోష్

- ఐటీ షేర్లతో సూచీలకు ఊపు
- సెన్సెక్స్ 262 పాయింట్లు, నిఫ్టీ 95 పాయింట్లు లాభం

ముంబై: దేశీయ ఈక్విటీ మార్కెట్లు వరుసగా మూడో ట్రేడింగ్ సెషన్‌లోనూ లాభాలతో ముగిశాయి. ఐటీ షేర్లలో బలమైన కొనుగోళ్లు, అమెరికా ఉద్యోగ గణాంకాలు అంచనాల కంటే బలహీనంగా నమోదవడంతో ఫెడరల్ రిజర్వ్ సమీప భవిష్యత్తులో వడ్డీ రేట్లను యథాతథంగా ఉంచే అవకాశాలు పెరిగాయన్న అంచనాలు మార్కెట్లకు మద్దతుగా నిలిచాయి. శుక్రవారం బీఎస్ఈ సెన్సెక్స్ 261.79 పాయింట్లు (0.34 శాతం) పెరిగి 77,763.91 వద్ద ముగిసింది. ట్రేడింగ్ మధ్యలో ఒక దశలో 655 పాయింట్లకు పైగా ఎగబాకి 78,157.52ను తాకింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 95.15 పాయింట్లు (0.39 శాతం) లాభపడి 24,270.85 వద్ద స్థిరపడింది. సెన్సెక్స్‌లో హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ 5.79 శాతం ఎగబాకి అగ్రగామిగా నిలిచింది. టెక్ మహీంద్రా, భారతీ ఎయిర్‌టెల్, టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్), సన్ ఫార్మా, బజాజ్ ఫిన్‌సర్వ్, బజాజ్ ఫైనాన్స్, టాటా స్టీల్, అల్ట్రాటెక్ సిమెంట్, ఐసీఐసీఐ బ్యాంక్ షేర్లు కూడా లాభాల్లో ముగిశాయి. మరోవైపు యాక్సిస్ బ్యాంక్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, మహీంద్రా అండ్ మహీంద్రా, లార్సన్ అండ్ టుబ్రో షేర్లు ఒత్తిడిని ఎదుర్కొన్నాయి.

రియాల్టీ, హెల్త్‌కేర్‌కు మద్దతు

రంగాల వారీగా రియాల్టీ సూచీ 2.22 శాతం పెరగ్గా, ఫోకస్డ్ ఐటీ 1.74 శాతం, ఐటీ 1.55 శాతం, హెల్త్‌కేర్ 1.31 శాతం, కమోడిటీస్, మెటల్, టెలికాం సూచీలు కూడా లాభపడ్డాయి. అయితే విద్యుత్, క్యాపిటల్ గూడ్స్, ఇండస్ట్రియల్స్, ఆటో, యుటిలిటీస్ రంగాల్లో అమ్మకాల ఒత్తిడి కనిపించింది.

వారాంతానికీ బలమైన ముగింపు

ఈ వారం మొత్తంగా సెన్సెక్స్ 663.44 పాయింట్లు (0.86 శాతం), నిఫ్టీ 214.85 పాయింట్లు (0.89 శాతం) లాభపడ్డాయి. అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు తగ్గుముఖం పట్టడం, వడ్డీ రేట్లపై ఒత్తిడి తగ్గుతుందన్న అంచనాలు దేశీయ మార్కెట్లకు అనుకూలంగా మారాయని విశ్లేషకులు తెలిపారు. అయితే ట్రేడింగ్ చివరి దశలో ప్రభుత్వ రంగ బ్యాంకులు, ఇంధన రంగ షేర్లలో లాభాల స్వీకరణ కారణంగా సూచీలు గరిష్ఠ స్థాయిల నుంచి కొంత వెనక్కి వచ్చినట్లు పేర్కొన్నారు.

స్టాక్ మార్కెట్లోకి ఆల్‌కార్గో గ్లోబల్

ఆల్‌కార్గో లాజిస్టిక్స్ నుంచి డీమెర్జర్ అనంతరం ఆల్‌కార్గో గ్లోబల్ లిమిటెడ్ షేర్లు శుక్రవారం స్టాక్ మార్కెట్లలో లిస్టయ్యాయి. బీఎస్ఈలో షేరు రూ.21 వద్ద ట్రేడింగ్‌ను ప్రారంభించి రూ.22 వరకు చేరుకున్నప్పటికీ, ఆ తర్వాత అమ్మకాల ఒత్తిడికి లోనై 5 శాతం పడిపోయి రూ.19.95 వద్ద లోయర్ సర్క్యూట్‌ను తాకింది. ఎన్ఎస్ఈలో షేరు రూ.22 వద్ద లిస్టై, అనంతరం 5 శాతం క్షీణించి రూ.20.90 వద్ద లోయర్ సర్క్యూట్‌కు చేరింది. కంపెనీ మార్కెట్ క్యాపిటలైజేషన్ సుమారు రూ.1,960.65 కోట్లుగా నమోదైంది. ఆల్‌కార్గో గ్రూప్ నాలుగేళ్ల క్రితం ప్రారంభించిన పునర్వ్యవస్థీకరణ ప్రక్రియలో భాగంగానే ఈ డీమెర్జర్ పూర్తయిందని కంపెనీ తెలిపింది. వ్యాపార విభాగాలకు ప్రత్యేక గుర్తింపు కల్పించడం, కార్యకలాపాలపై మరింత దృష్టి సారించడమే ఈ పునర్వ్యవస్థీకరణ లక్ష్యమని పేర్కొంది. డీమెర్జర్ అనంతరం ఆల్‌కార్గో గ్రూప్‌లో ఆల్‌కార్గో గ్లోబల్, ఆల్‌కార్గో లాజిస్టిక్స్, ఆల్‌కార్గో టెర్మినల్స్, ట్రాన్స్ ఇండియా రియల్ ఎస్టేట్ అనే నాలుగు లిస్టెడ్ సంస్థలు కొనసాగనున్నాయి.

1:1 నిష్పత్తిలో షేర్ల కేటాయింపు

జాతీయ కంపెనీ లా ట్రైబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ) ఆమోదించిన పునర్వ్యవస్థీకరణ పథకం ప్రకారం, ఆల్‌కార్గో లాజిస్టిక్స్ వాటాదారులకు వారు కలిగి ఉన్న ప్రతి ఒక్క షేరుకు ఒక ఆల్‌కార్గో గ్లోబల్ ఈక్విటీ షేరును 1:1 నిష్పత్తిలో కేటాయించినట్లు కంపెనీ వెల్లడించింది. ప్రపంచ వాణిజ్య రంగంలో వేగంగా మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ఎల్‌సీఎల్ కన్సాలిడేషన్, ఎఫ్‌సీఎల్, ఎయిర్ ఫ్రైట్, డోర్-టు-డోర్ లాజిస్టిక్స్ సేవల్లో సంస్థ తన నాయకత్వాన్ని మరింత బలోపేతం చేస్తుందని ఆల్‌కార్గో గ్రూప్ వ్యవస్థాపకుడు, చైర్మన్ శశి కిరణ్ శెట్టి తెలిపారు.

మళ్లీ రూ.1.50 లక్షల మార్క్ దాటిన బంగారం

- 10 గ్రాములకు ఒక్కరోజే రూ.3,300 జంప్

న్యూఢిల్లీ: అంతర్జాతీయ మార్కెట్లలో అనుకూల పరిణామాలు, అమెరికా డాలర్ విలువ క్షీణించడం దేశీయ బులియన్ మార్కెట్‌కు ఊతమిచ్చాయి. దీంతో బంగారం ధరలు వరుసగా రెండో రోజు భారీగా పెరిగి 10 గ్రాముల ధర మరోసారి రూ.1.50 లక్షల స్థాయిని అధిగమించింది. శుక్రవారం 99.9 శాతం స్వచ్ఛత కలిగిన బంగారం ధర రూ.3,300 పెరిగి రూ.1,50,800 (పన్నులతో కలిపి)కు చేరుకుంది. వెండి ధరలు కూడా వరుసగా నాలుగో రోజు లాభపడి కిలోకు రూ.5,000 పెరిగి రూ.2,45,000కు చేరాయి. అంతర్జాతీయ మార్కెట్లలో బులియన్‌కు పెరిగిన డిమాండ్, రూపాయి మారకపు విలువలో వచ్చిన మార్పులు దేశీయ ధరలకు మద్దతుగా నిలిచాయని మార్కెట్ వర్గాలు తెలిపాయి. అమెరికా డాలర్ ఇండెక్స్ బలహీనపడటం, వడ్డీ రేట్ల పెంపు అవకాశాలు తగ్గుతాయన్న అంచనాలు బంగారంలో తాజా కొనుగోళ్లకు దారితీశాయని విశ్లేషకులు పేర్కొన్నారు. మే నెలలో దిగుమతి సుంకాల పెంపు తర్వాత నెలరోజులుగా కొనసాగిన అమ్మకాల ఒత్తిడి తగ్గడంతో పెట్టుబడిదారుల సెంటిమెంట్ మెరుగుపడిందని వివరించారు.

బీవోబీ, జీఐసీ హౌసింగ్‌కు ఆర్‌బీఐ జరిమానా

- కేవైసీ, రుణదాతల నిబంధనల ఉల్లంఘనపై చర్యలు
- బీవోబీపై రూ.63.6 లక్షలు, జీఐసీ హౌసింగ్‌పై రూ.3.1 లక్షల పెనాల్టీ

ముంబై: నియంత్రణ నిబంధనలను పాటించడంలో లోపాలు గుర్తించిన నేపథ్యంలో ప్రభుత్వ రంగ బ్యాంక్ ఆఫ్ బరోడాపై రూ.63.6 లక్షలు, జీఐసీ హౌసింగ్ ఫైనాన్స్‌పై రూ.3.1 లక్షల జరిమానాను భారతీయ రిజర్వు బ్యాంకు (ఆర్‌బీఐ) విధించింది. ఫెయిర్ ప్రాక్టీసెస్ కోడ్ ఫర్ లెండర్స్‌తో పాటు నో యువర్ కస్టమర్ (కేవైసీ) నిబంధనలను ఉల్లంఘించినందుకు బీవోబీపై చర్యలు తీసుకున్నట్లు ఆర్‌బీఐ వెల్లడించింది. 2025 మార్చి 31 నాటి ఆర్థిక స్థితిని ఆధారంగా చేసుకుని నిర్వహించిన తనిఖీల్లో కొన్ని రుణ ఖాతాలపై ఒప్పందంలో పేర్కొన్నదానికంటే అధిక వడ్డీ వసూలు చేసినట్లు గుర్తించినట్లు తెలిపింది. అలాగే కొంతమంది ఖాతాదారుల కేవైసీ వివరాలను నిర్దేశిత గడువులో సీకేవైసీఆర్‌లో నమోదు చేయలేదని పేర్కొంది.

జీఐసీ హౌసింగ్‌లోనూ కేవైసీ లోపాలు

జాతీయ గృహ బ్యాంకు (ఎన్‌హెచ్‌బీ) నిర్వహించిన తనిఖీల్లో జీఐసీ హౌసింగ్ ఫైనాన్స్ కేవైసీ మార్గదర్శకాలను పూర్తిగా అమలు చేయలేదని తేలింది. ఖాతాల రిస్క్ వర్గీకరణను కనీసం ఆరు నెలలకు ఒకసారి సమీక్షించే వ్యవస్థను ఏర్పాటు చేయడంలో సంస్థ విఫలమైనట్లు ఆర్‌బీఐ పేర్కొంది. ఈ జరిమానాలు కేవలం నియంత్రణ నిబంధనల అమలులో గుర్తించిన లోపాల ఆధారంగానే విధించామని తెలిపింది.

'నాగబంధం' విజువల్స్ వండర్

'పెదకాపు' ఫేమ్ విరాట్ కర్ణ హీరోగా, ప్రముఖ నిర్మాత అభిషేక్ నామా స్వీయ దర్శకత్వంలో తెరకెక్కించిన భారీ చిత్రం 'నాగబంధం' ప్రేక్షకుల ముందుకు వచ్చింది. అభిషేక్ పిక్చర్స్, నిక్ స్టూడియోస్ బ్యానర్లపై కిషోర్ అన్నపురెడ్డి, నిషిత నాగిరెడ్డి ఈ చిత్రాన్ని భారీ నిర్మాణ విలువలతో నిర్మించారు. నభా నటేష్, ఐశ్వర్య మీనన్, దక్ష నగార్కర్, మహేశ్ మంజ్రేకర్, జగపతిబాబు, అనసూయ, మురళీ శర్మ తదితరులు కీలక పాత్రల్లో నటించారు. సినిమాటోగ్రఫీని ఎస్. సౌందర్ రాజ్ అందించగా, జునైద్ కుమార్, అభిలు సంగీతాన్ని సమకూర్చారు. ఎడిటింగ్ బాధ్యతలను ఆర్.సీ. ప్రణవ్ నిర్వహించారు. పురాణాలు, చరిత్ర, ఫాంటసీ అంశాల మేళవింపుతో రూపొందిన ఈ చిత్రం 2026లో అత్యంత ఆసక్తిగా ఎదురుచూసిన సినిమాల్లో ఒకటిగా నిలిచింది. ప్రపంచవ్యాప్తంగా జూలై 3న గ్రాండ్‌గా విడుదలైన ఈ సినిమాకు ఒక రోజు ముందుగానే ప్రత్యేక ప్రీమియర్ షోలు ప్రదర్శించడంతో ప్రేక్షకుల్లో మరింత ఆసక్తి పెరిగింది. భారీ అంచనాల మధ్య ప్రేక్షకుల ముందుకు వచ్చిన 'నాగబంధం'కు తొలి షోల నుంచే పాజిటివ్ టాక్ వినిపిస్తోంది. సోషల్ మీడియాలోనూ, థియేటర్ల బయట కూడా ప్రేక్షకులు తమ అభిప్రాయాలను పంచుకుంటూ సినిమాపై ప్రశంసలు కురిపిస్తున్నారు. ముఖ్యంగా విజువల్స్, క్లైమాక్స్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్, వీఎఫ్ఎక్స్, హీరో విరాట్ కర్ణ నటన సినిమాకు ప్రధాన బలాలు. "ఇది కేవలం సినిమా కాదు.. థియేటర్‌లో తప్పక చూడాల్సిన విజువల్ ఎక్స్‌పీరియన్స్". గత చారిత్రక, పురాణ అంశాలను ఎంతో అద్భుతంగా తెరపై ఆవిష్కరించారు. ప్రతి సీన్ ఎంతో గ్రాండ్‌గా ఉంది. 'పెదకాపు' ఆశించిన స్థాయిలో విజయం సాధించకపోయినా ఈ సినిమా మాత్రం విరాట్ కర్ణ కెరీర్‌ను మరో స్థాయికి తీసుకెళుతుంది. ఈ సినిమాలోని శివుడి దర్శనం, అనంత పద్మనాభస్వామికి సంబంధించిన సన్నివేశాలు అద్భుతంగా ఉన్నాయి. ప్రతి ఫ్రేమ్ విజువల్‌గా రిచ్‌గా, ప్రతి సీన్ గూస్‌బంప్స్‌తో పాటు రోమాలు నిక్కబొడిచేలా ఉన్నాయి. ఇదిలా ఉంటే సినిమా చివరి 25 నిమిషాలు మరో స్థాయిలో ఉన్నాయి. ఫస్ట్ హాఫ్ కొత్తగా అనిపిస్తే సెకండ్ హాఫ్‌లో ఊహించని ట్విస్టులతో ప్రేక్షకులను ఎంతో ఆకట్టుకుంటుంది. కథ విధానం కొత్తగా ఉండటంతో చివరి వరకు ఆసక్తి కొనసాగింది. ఈ సినిమా చూస్తున్నంత వరకూ ఎక్కడా బోర్ అనిపించకుండా సినిమా సాగుతుంది. ఈ సినిమా విజువల్స్ పరంగా ఇది గ్రాండ్ స్కేల్ మైథాలజికల్ అడ్వెంచర్‌గా నిలిచింది. ఈ సినిమాలో 'నమో రే' పాట థియేటర్‌లో ప్రత్యేకమైన అనుభూతి కలిగించింది. ఇలాంటి తెలుగు సినిమాలు హాలీవుడ్ సినిమాలకు ఏమాత్రం తీసిపోకుండా ఉన్నాయి. నభా నటేష్ కూడా తన పాత్రకు పూర్తి న్యాయం చేసింది. జగపతిబాబు పాత్ర కూడా చాలా పవర్‌ఫుల్‌గా ఉంది. ఫస్ట్ హాఫ్‌లో కొద్దిసేపు మాత్రమే నెమ్మదిగా అనిపించినా ఆ తర్వాత సినిమా పూర్తిగా పుంజుకుని చివరి వరకు ఆసక్తిగా సాగింది. మొత్తంగా తొలి షోల నుంచే 'నాగబంధం'కు పాజిటివ్ టాక్ రావడంతో ఈ స్పందన బాక్సాఫీస్ వద్ద ఎంతవరకు కలెక్షన్లు రాబడుతుందో, ఎన్ని కోట్ల క్లబ్‌లో చేరుతుందో వేచి చూడాలి.

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్, స్టార్ డైరెక్టర్ సుకుమార్ కాంబినేషన్‌లో తెరకెక్కనున్న RC17పై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇటీవల బుచ్చిబాబు సానా దర్శకత్వంలో వచ్చిన 'పెద్ది' సినిమాతో చరణ్ బాక్సాఫీస్ వద్ద మంచి విజయాన్ని అందుకోవడంతో ఇప్పుడు 'రంగస్థలం' తర్వాత సుకుమార్‌తో చేయబోయే ఈ ప్రాజెక్ట్‌పై ఆసక్తి మరింత పెరిగింది. మైత్రి మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఈ పాన్ ఇండియా చిత్రానికి సంబంధించిన ప్రతి అప్‌డేట్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. తాజాగా ఈ చిత్రంలో చరణ్ సరసన హీరోయిన్‌గా బాలీవుడ్ బ్యూటీ కియారా అద్వానీ పేరు వినిపిస్తోంది.

చెర్రీ సరసన కియారా!

సుకుమార్ ఈ సినిమాలో హీరోయిన్ పాత్రను కూడా బలంగా, నటనకు ప్రాధాన్యమున్న విధంగా డిజైన్ చేశారని, ఆ పాత్రకు కియారా సరిపోతారని చిత్ర వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. అయితే ఈ వార్త మెగా అభిమానుల్లో కొంత ఆందోళన కలిగిస్తోంది. గతంలో రామ్ చరణ్, కియారా కలిసి నటించిన 'వినయ విధేయ రామ', 'గేమ్ ఛేంజర్' చిత్రాలు ఆశించిన విజయాలు సాధించలేదు. దీంతో కియారా చరణ్‌కు కలిసి రావడం లేదనే సెంటిమెంట్ అభిమానుల్లో కనిపిస్తోంది. ఒకవేళ ఈ ప్రాజెక్ట్ ఖరారైతే వీరిద్దరికీ ఇది మూడో సినిమా అవుతుంది. అయితే సుకుమార్ మాత్రం సెంటిమెంట్ల కంటే పాత్రకు సరిపోయే నటీనటుల ఎంపికకే ప్రాధాన్యం ఇస్తారనే అభిప్రాయం ఉంది. మరి మేకర్స్ కియారా వైపే మొగ్గు చూపుతారా లేక మరో హీరోయిన్‌ను ఎంపిక చేస్తారా అన్నది ఆసక్తికరంగా మారింది.

జైలర్-2లో హృతిక్ రోషన్

మాఫియా, ప్రతీకార నేపథ్యం, కుటుంబ అంశాల మేళవింపుగా రూపొంది ప్రేక్షకుల్ని విశేషంగా ఆకట్టుకున్న చిత్రం 'జైలర్'. అగ్ర కథానాయకుడు రజనీకాంత్ ప్రధాన పాత్రలో నెల్సన్ దిలీప్ కుమార్ తెరకెక్కించిన ఈ చిత్రానికి సీక్వెల్ రానున్న విషయం తెలిసిందే. తాజాగా 'జైలర్ 2' షూటింగ్ పూర్తయినట్లు టీమ్ తెలిపింది. త్వరలోనే విడుదల తేదీని ప్రకటిస్తామని వెల్లడించింది. నిజానికి ఈ సినిమా చిత్రీకరణ ఈ ఏడాది ఏప్రిల్‌లోనే పూర్తయింది. కానీ, నెల్సన్ ఈ కథలో మరికొన్ని కొత్త సన్నివేశాలు యాడ్ చేసి 25 రోజుల పాటు మళ్లీ షూటింగ్ నిర్వహించారు. తాజాగా అవి డా పూర్తయినట్లు చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రంలో హృతిక్ రోషన్ అతిథి పాత్రలో నటిస్తున్నట్లు ఎప్పటి నుంచో వార్తలు వస్తున్నాయి. ఇటీవల ఆయన చెన్నై రావడంతో ఆ వార్తలకు మరింత బలం చేరింది. ఈ 25 రోజుల షెడ్యూల్‌లో ఆయనకు సంబంధించిన సన్నివేశాలనే చిత్రీకరించారని సమాచారం. ఈ ఏడాది సెప్టెంబర్‌లో సినిమా విడుదలకు సన్నాహాలు చేస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. 'జైలర్'లో పలు భాషలకు చెందిన అగ్రతారలు అతిథి పాత్రల్లో మెరిసిన విషయం తెలిసిందే. రెండో భాగంలోనూ ఆ సందడి కొనసాగనుంది. సీనియర్ నటుడు మిథున్ చక్రవర్తి డా ఇందులో కీలకపాత్రలో కనిపించనున్నారు. మొదటి భాగం ఎక్కడ ఆగిపోయిందో అక్కడి నుంచే సీక్వెల్ ప్రారంభమవు తుందని గతంలో శివరాజ్ కుమార్ తెలిపారు.

'లెనిన్' కోసం లఖిల్ ఎదురుచూపు

'లెనిన్'తో ప్రేక్షకులను పలకరించేందుకు సిద్ధమయ్యారు నటుడు అఖిల్. మురళీకిశోర్ అబ్బూరు దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా జులై 10న ప్రేక్షకుల ముందుకు రానుంది. తాను మూడేళ్ల విరామం తీసుకోవడానికి గల కారణాన్ని అఖిల్ వివరించారు. ఏజెంట్ సినిమా విడుదలైన మూడు నెలలకు నేను ప్రమాదవశాత్తు బాత్రూంలో పడ్డాను. గాజు ముక్కలు నా చేతికి బలంగా గుచ్చుకున్నాయి. ఎడమ చేతి వేళ్లకు రెండు శస్త్రచికిత్సలు జరిగాయి. 48 కుట్లు పడ్డాయి. 8 నెలల పాటు బరువులు ఎత్తలేకపోయాను. ఆ గాయం నుంచి పూర్తిగా కోలుకోవడానికి 16 నెలలు పట్టింది. మూడేళ్ల విరామం తీసుకున్నందుకు నా అభిమానులు నాపై కోపంగా ఉన్నారు. ఇలా మరోసారి జరగదని వాళ్లకు నేను హామీ ఇస్తున్నాను అని అఖిల్ చెప్పారు. లెనిన్ చిత్రం గురించి మాట్లాడుతూ.. కథ వినగానే కొత్త అనుభూతి కలిగిందన్నారు. పాత్రల్లోని విభిన్న కోణాలు ఆశ్చర్యపరిచాయని తెలిపారు. ఇలాంటి కథే కాదు.. ఈ అంశంపూద ఒక్క సినిమా డా రాలేదని పేర్కొన్నారు. అందు ఇలాంటి సినిమాతోనే కమ్‌బ్యాక్ ఇవ్వాలని నిర్ణయించుకున్నట్లు చెప్పారు.

'రియా శిబు'కు ఆఫర్స్!

హీరోయిన్లకు భాషతో పెద్దగా సంబంధం ఉండదు. ఒక భాషకు చెందిన నటీమణులు మరో భాషలో అవకాశాలు అందుకుని స్టార్‌డమ్‌ను సంపాదించుకోవడం సినీ పరిశ్రమలో కొత్త విషయం కాదు. మలయాళానికి చెందిన నయనతార తమిళ చిత్ర పరిశ్రమలో అగ్ర కథానాయికగా ఎదిగి అక్కడే స్థిరపడినట్లే, ఇప్పుడు మరో మలయాళీ బ్యూటీ కూడా అదే దిశగా అడుగులు వేస్తున్నట్లు కనిపిస్తోంది. ఆమె రియా షిబు. నటిగా తన ప్రయాణాన్ని ప్రారంభించిన రియా, తర్వాత నిర్మాతగా మారి తమిళ స్టార్ హీరో విక్రమ్ నటించిన 'వీర ధీర సూరన్' చిత్రాన్ని నిర్మించింది. అనంతరం కథానాయికగా అవతారమెత్తి మలయాళంలో వచ్చిన 'సర్వం మాయ' చిత్రంలో నటించి మంచి గుర్తింపు, విజయాన్ని సొంతం చేసుకుంది. నటిగా, నిర్మాతగా తన ప్రతిభను నిరూపించుకున్న రియా ఇప్పుడు కోలీవుడ్ దర్శక నిర్మాతల దృష్టిని ఆకర్షిస్తోంది. ప్రస్తుతం విక్రమ్ హీరోగా తెరకెక్కుతున్న కొత్త చిత్రంలో హీరోయిన్‌గా అవకాశం దక్కించుకున్న ఆమెకు మరో క్రేజీ ప్రాజెక్ట్ కూడా లభించినట్లు సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. తాజా సమాచారం ప్రకారం విజయ్ సేతుపతితో కలిసి నటించే అవకాశం రియాకు వచ్చినట్లు తెలుస్తోంది. ఈ చిత్రానికి దర్శకురాలు క్రితిక ఉదయనిధి దర్శకత్వం వహిస్తున్నట్లు సమాచారం. కుటుంబ అనుబంధాలతో కూడిన కమర్షియల్ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రం రూపొందనున్నట్లు చెబుతున్నారు. ఇటీవల ఈ సినిమా షూటింగ్ ప్రారంభమైనట్లు, ఎలాంటి హడావిడి లేకుండా చిత్రీకరణ జరుగుతోందని, మరో వారంలో తొలి షెడ్యూల్ పూర్తి కానున్నట్లు సమాచారం. భారీ స్థాయిలో ఈ చిత్రాన్ని రెడ్ జెయింట్ మూవీస్ సంస్థ నిర్మిస్తున్నట్లు తెలుస్తోంది.

జననాయగన్ రిలీజ్ ఎప్పుడు?

కోలీవుడ్ స్టార్ హీరో దళపతి విజయ్ పొలిటికల్ యాక్షన్ థ్రిల్లర్ 'జననాయగన్' రిలీజ్ చుట్టూ ఇండస్ట్రీలో సరికొత్త చర్చ నడుస్తోంది. గత 7 నెలలుగా ఈ చిత్రం సెన్సార్ వివాదాలు, కోర్టు సుల కారణంగా వాయిదా పడుతూ వస్తున్న సంగతి తెలిసిందే. అయితే తాజా సమాచారం ప్రకారం ఈ చిత్రం సెన్సార్ బోర్డు నుండి 'ఎ సర్టిఫికెట్ పొందే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. వచ్చే వారం రోజుల్లోగా ఈ తుది సర్టిఫిషన్ పక్రియ పూర్తి కానుందని ఆ వెంటనే హిందీ, తెలుగు వెర్షన్ల సెన్సార్ ఫార్మాలిటీస్‌ను కూడా పూర్తి చేసేందుకు చిత్ర యూనిట్ కృషి చేస్తోంది. సెన్సార్ సమస్యలు వీడుతుండటంతో మేకర్స్ ఈ సినిమాను జూలై 16 లేదా జూలై 23న థియేటర్ల లోకి తీసుకురావాలని భావిస్తు న్నట్లు సమాచారం. అయితే, ఇప్పటి ఈ విండో లో పలు క్రేజీ చిత్రాలు తమ విడుదల తేదీలను ప్రకటించాయి. అయితే సెన్సార్ ఎ సర్టిఫికెట్ ఇస్తే చిన్న పిల్లలు ఈ సినిమా చూసేందుకు అనుమతిం చరు. కానీ దళపతి చివరి చిత్రం కావడంతో ఈ సినిమా ఎప్పుడు వచ్చినా థియేటర్ల వద్ద జాతర ఖాయమని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

దసరాకు 'విశ్వంభర' విడుదల

సన్నాహాలు చేస్తోన్న చిత్రబృందం మెగాస్టార్ చిరంజీవి నటిస్తున్న మోస్ట్ అవేటెడ్ సోషియో–ఫాంటసీ అడ్వెంచర్ మూవీ 'విశ్వంభర' విడుదలపై ఎట్టలకు ఒక స్పష్టత వచ్చేసినట్లు తెలుస్తుంది. ఈ భారీ బ్జడెట్ విజువల్ వండర్ సినిమాను రాబోయే దసరా కానుకగా అక్టోబర్ 16న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల చేసేందుకు చిత్రబృందం సన్నాహాలు చేస్తుంది. చిరంజీవి ఎపిక్ ఫాంటసీ 'విశ్వంభర' దసరా పండుగ కానుకగా ప్రపంచ వ్యాప్తంగా థియేటర్లలోకి వస్తోంది అంటూ పలువురు వూడియా, సినీ ప్రముఖులు సోషల్ వూడియా వేదికగా పోస్ట్‌లు పెట్టడంతో దసరా రాబోతుండటం పక్కా అని తెలుస్తుంది. బ్లాక్‌బస్టర్ హిట్ 'బింబిసార' చిత్ర దర్శకుడు వశిష్ట ఈ సినిమాను ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిస్తుండగా, ప్రముఖ నిర్మాణ సంస్థ యువి క్రియేషన్స్ అత్యంత భారీ బడ్జెట్‌తో ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. 'అంజి', 'జగదేకవీరుడు అతిలోక సుందరి' చిత్రాల తర్వాత చిరంజీవి నుండి వస్తున్న పూర్తి స్థాయి సోషియో–ఫాంటసీ సినిమా కావడంతో ఈ దసరాకు బాక్స్ బద్దలు కొట్టనుంది.

ధృవ్ విక్రమ్‌తో మైత్రీ మూవీస్ చిత్రం ప్రారంభం

ఇటీవల బైసన్‌తో మెప్పించిన కోలీవుడ్ స్టార్ హీరో చియాన్ విక్రమ్ కుమారుడు, యువ సంచలనం ధ్రువ్ విక్రమ్ కథానాయకుడిగా మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ ఒక సరికొత్త చిత్రాన్ని ప్రకటించింది. ధ్రువ్ విక్రమ్ కెరీర్‌లో నాలుగో సినిమాగా వర్కింగ్ టైటిల్స్‌తో రూపొందుతున్న ఈ భారీ చిత్రం చెన్నైలో చిత్ర యూనిట్ సభ్యులు, పలువురు సినీ ప్రముఖుల సమక్షంలో పూజా కార్యక్రమాలతో అత్యంత ఘనంగా ప్రారంభమైంది. ధ్రువ్ విక్రమ్ కెరీర్‌లోనే ఇప్పటివరకు రాని ఒక డిఫరెంట్ జోనర్‌లో, అవుట్ అండ్ అవుట్ పక్కా కమర్షియల్ మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రాన్ని మలిచేందుకు మేకర్స్ ఎ÷–లాన్ చేస్తున్నారు. ఈ క్రేజీ ప్రాజెక్ట్‌కు డైరెక్టర్ కరణ్ ఎ. కుమార్ దర్శకత్వం వహిస్తుండగా, ఆయనతో పాటు రైటర్ శబీ సంయుక్తంగా ఈ చిత్రానికి స్క్రిప్ట్‌ను మరియు డైలాగ్స్‌ను అందిస్తున్నారు. వలం కథానాయకుడి పాత్రే కాకుండా సినిమాలో మిగిలిన పాత్రలు డా చాలా బలంగా ఉంటాయని, ఈ నేపథ్యంలోనే చిత్రంలో కీలక పాత్రల కోసం ప్రముఖ నటుడు పృథ్వీరాజ్, యాక్టర్ సాయి దీనలను ఎంపిక చేసినట్లు చిత్రబృం దం వెల్లడించింది. విక్కీ సినిమాటోగ్రాఫర్‌గా విజువల్స్ అందిస్తుండగా, చియాన్ ఎడిటర్‌గా, జి.ఎమ్. శేఖర్ ప్రొడక్షన్ డిజైనర్‌గా బాధ్యతలు చేపట్టారు. ఈ పూజా కార్యక్రమాలతోనే సినిమా రెగ్యులర్ షూటింగ్‌కు సంబంధించిన ఏర్పాట్లు డా శరవేగంగా జరుగుతున్నాయని, రాబోయే రోజుల్లో ఈ సినిమాకు సంబంధించిన పూర్తి తారాగణం, హీరోయిన్, టైటిల్‌ను మేకర్స్ అధికారికంగా వెల్లడిస్తారని సమాచారం.

Published and Editor Owned by Adula Thirupathi, and Printed by vattemula Rama krishna, RK Printers Mig 11, Block No 16, Ground Floor 4, Baghlingampally, Hyderabad 500044. Telangana State. and Published from 16-11-13/A, saleemnagar colony, Malakpet, Hyderabad, Telangana State. **Editor: Adula Thirupathi.** **RNI NO : TGTEL/25/A4244** Email: prajanaava@gmail.com. Phone No: 99484 33277